www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఏపీలో అంతా మాఫియానే

మైనింగ్, ఇసుక, మద్యంలో దోచుకోవడం.. దాచుకోవడమే!

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి.. రూ.10 లక్షల కోట్ల అప్పులు

రాష్ట్రానికి మూడు రాజధానులు కాదు.. ఒక్కటైనా కట్టారా?

ప్రత్యేక హోదాకు ఉద్యమించిన జగన్ బీజేపీకి తొత్తుగా మారారు

జగన్ సర్కారుపై చెల్లెలు షర్మిల ఫైర్.. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు

తెలంగాణలో నియంతను గద్దె దించానని వ్యాఖ్య

14




షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల

సోమవారం | 22-1-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 | సంచిక (Issue) : 294

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి రా. 7.53 తదుపరి త్రయోదశి; నక్షత్రం: మృగశిర తె. 4.59 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: ఉ.9.44-11.24; దుర్ముహూర్తం: మ.12.49-1.34; అమృతఘడియలు: రా.7.46-9.27; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.01 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



సర్వాంగ సుందరంగా ముస్తాబై, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న అయోధ్య రామ మందిరం

శ్రీరామ జయం

అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ నేడే

మధ్యాహ్నం 12.30కు అభిజిత్ లగ్నంలో ముహూర్తం

ముందుగా 56 రకాల భోగ్ ప్రసాదం నివేదన

70 ఏళ్ల తర్వాత నూతన మందిరంలోకి రామ్ లల్లా

హనుమ, సోదరులు లక్ష్మణ, భరత, శత్రుఘ్నులూ..

కొత్త విగ్రహం ముందే పాత విగ్రహాల ప్రతిష్ఠ

తొలిగా మోదీకి.. రేపటి నుంచి ప్రజలకు దర్శనం

ఆధ్యాత్మిక శోభతో అయోధ్య నగరం కళకళ

ఉదయం ఆలయ ప్రాంగణంలో సంగీత విభావరి

ఏపీ ఘటం, కర్ణాటక వీణా నాదం, తమిళనాడు నుంచి నాదస్వరం, మృదంగ విద్వాంసులు

నేడు 10 లక్షల దివ్వెల వెలుగుల్లో అయోధ్య

ప్రస్తుతం భూతలం వరకే ఆలయం పూర్తి

మొదటి అంతస్తులో రామ్‌దర్బార్.. అందులో రాజారాం, సీత.. ఏడాది చివరికల్లా మొత్తం పూర్తి

అయోధ్య, జనవరి 21: "ఎన్నాళ్లో వేచిన ఉదయం.. ఈనాడే ఎదురవుతుంటే.." అంటూ రామభక్తులంతా ఆ బాల రాముని దర్శనం కోసం తపిస్తున్న సమయం ఆసన్నమైంది! అల సాకేతపురిలో జన్మించి.. సరయూ నది ఒడ్డున ఆటలాడి.. తండ్రిమాట జవదాటని పితృవాక్య పరిపాలకుడిగా ఎదిగి.. హిందూ జన హృదయ సామ్రాట్టుగా విరాజిల్లుతున్న ఆదర్శపురుషుడు, అవతారమూర్తి ప్రాణప్రతిష్ఠ సుముహూర్తానికి ఇంకా కొన్ని గంటలే ఉంది! బాల రాముడి నేత్రోన్మీలనాన్ని తిలకించి పులకించే క్షణాలు దగ్గరికొచ్చేశాయి! మరపురాని ఈ వేడుకలను కనులారా వీక్షించేందుకు.. సంబరాల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకుని ఆ జ్ఞాపకాలను మనసుపొరల్లో దాచుకునేందుకు.. దేశం నలుమూలల నుంచి తరలి వస్తున్న భక్తులతో అయోధ్యాపుర వీధులన్నీ నిండిపోయాయి! లౌడ్ స్పీకర్లలో వినిపించే రాముడి పాటలతో.. రామయ్య భజనలతో మారుమోగుతున్నాయి!! రెపరెపలాడుతూ ఎగిరే రామ ధ్వజాలతో.. రామనామ సంకీర్తన చేసే సాధుసంతులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందడి

మిగతా 2వ పేజీలో...



3

రామసేతు వద్ద ప్రధాని

సేతుబంధన తీర్థంలో ధ్యానం

సముద్ర స్నానం, శివుడికి పూజలు

కడలి ఒడ్డున ప్రాణాయామం

కోదండ రామాలయంలో ధ్యానం

పవిత్ర జలాల కలశంతో ఢిల్లీకి

హైదరాబాద్‌కు టెస్లా?



చైనా ఆటోమొబైల్ దిగ్గజం బీవైడీ కూడా!

పెట్టుబడులపై ఈ రెండు సంస్థల ఆసక్తి

వాటితో నిరంతర సంప్రదింపుల్లో ఉన్నాం

యూకేలోని తెలంగాణవారికి హెల్ప్‌లైన్

లండన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్

'మూసీ'పై అద్భుత డిజైన్లు రూపొందించండి

దుబాయ్‌లో ప్లానర్లు, డిజైనర్లను కోరిన సీఎం

70 సంస్థలతో అర్ధరాత్రి వరకు చర్చలు

ప్రవాసీలకు మార్చిలోగా అత్యుత్తమ పాలసీ

పెట్టుబడులు పెట్టండి.. జెద్దాలో శ్రీధర్‌బాబు



దుబాయ్‌లో అధికారులతో సీఎం రేవంత్

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్తు వాహనాల తయారీ రంగంలో దిగ్గజ సంస్థలు టెస్లా, బీవైడీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తితో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో ప్లాంట్లు నెలకొల్పేందుకు వీటితో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నామని పేర్కొన్నారు. ఈ సంస్థలు రాష్ట్రానికి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. చర్చలు ఏ దశలో ఉన్నది? ఒప్పందం విలువ ఎంత? అనేది

మిగతా 13వ పేజీలో...

ఆసరాకు అందలం

సీఎం రేవంత్‌కు అండగా నిలిచిన నేతలకు పదవులు

సీఎం, ప్రభుత్వ సలహాదార్లుగా వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్, హర్కార వేణుగోపాల్‌రావు

ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవి

వేం నరేందర్ నియామకంపై ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

13

మేం తలుచుకుంటే బీఆర్ఎస్ 39 ముక్కలు

వంద రోజులు కాకుండానే విమర్శలా?

కేటీఆర్, హరీశ్ ఆస్పత్రిలో చూపించుకోవాలి

బీఆర్ఎస్‌ను బరాబర్ బొందపెడ్తం: కోమటిరెడ్డి



బీఆర్ఎస్‌ను ఖతం చేసే కుట్ర

మొన్న బీజేపీ నేత బండి సంజయ్ అన్నారు..

'ఆంధ్రజ్యోతి' రాధాకృష్ణ కొత్తపలుకులో ఇదే చెప్పారు

మోదీకి, రేవంత్‌కు భయపడం.. బీఆర్ఎస్‌ను ఏమీ చేయలేరు

మేం మరో 8 స్థానాలు గెలిచి ఉంటే హంగ్ ఏర్పడేది

'మల్కాజిగిరి' బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో కేటీఆర్

వనవాస రామా!

» 14 ఏళ్లు సీతారామ లక్ష్మణుల అరణ్యవాసం

» అయోధ్య నుంచి లంక దాకా ప్రస్థానం

తెల్లవారితే చక్రవర్తి అయి రాజ్యమునేలే రామయ్య.. తండ్రి మాటకై పదవిని వదిలి నార వస్త్రాలు ధరించి ధర్మపత్ని సీత, లక్ష్మణ సహితంగా అడవుల వైపు నడిచాడు. 14 ఏళ్ల వనవాసంలో లెక్కకుమిక్కిలి కష్టాలను అనుభవించాడు. భక్తకోటిని ఆదుకునే కోదండ రామయ్య పూలబాటను వదిలి ముళ్లబాట పట్టాడు. అంతఃపురవాసాన్ని వదిలి పూరిపాకలో గడిపాడు. అడవుల్లో ఆకలి దప్పులకోర్చాడు. రాక్షసులతో తలపడ్డాడు. గొప్ప గొప్ప రుషి పుంగవులను కలిసి జ్ఞానసముపార్జన చేశాడు. ఈ ప్రస్థానం ద్వారా కష్టసుఖాలను ఒకే విధంగా స్వీకరించాలనే గొప్ప సందేశాన్ని భావితరాలకు ఇచ్చాడు. మరి.. రఘురాముడి ప్రస్థానం అయోధ్య నుంచి కానల వైపు ఎలా సాగింది? ఆ పురాణ పురుషుడి 14 ఏళ్ల వనవాసం ఎక్కడెక్కడ గడిచింది?



అయోధ్య నుంచి ప్రయాగ్‌రాజ్‌కు

అయోధ్య ప్రస్తుతం యూపీలో ఉంది. పట్టాభి రాముడిగా వెలుగొందాల్సిన రామయ్య.. సీత, లక్ష్మణుడితో కలిసి అడవులవైపు బయలుదేరింది అయోధ్య నుంచే! ముగ్గురూ నేరుగా ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి వెళ్లి.. ఆ మహర్షి ఆశీస్సులు తీసుకుంటారు. 14 ఏళ్ల సుదీర్ఘ వనవాసంలో భాగంగా ఎక్కడెక్కడ ఉండాలన్న విషయంలోనూ సలహాలు తీసుకుంటారు. రావణ సంహారం జరిగి..తిరిగి అయోధ్యకు వెళ్లేముందు కూడా సీతారామ లక్ష్మణులు ఆ మహర్షి ఆశీస్సులు తీసుకుంటారు.



చిత్రకూటం - మధ్యప్రదేశ్

శ్రీరామ వనవాసంలో కీలక ప్రదేశమిది. రాముడు ఇక్కడే కుటీరం ఏర్పాటు చేసుకొని సీత, లక్ష్మణుడితో కలిసి 11 ఏళ్లకు పైగా గడిపినట్లుగా రామాయణం చెబుతోంది. సప్తరుషుల్లో ఒకరైన అత్రి మహాముని, ఆయన సతీమణి అనసూయా దేవిని సీతారాములు ఇక్కడే కలిసి ఆశీస్సులు తీసుకుంటారు.



పంచవటి - నాసిక్

ప్రస్తుతం మహారాష్ట్రలోని నాసిక్‌లో ఉంది. చిత్రకూటం నుంచి బయలుదేరిన సీతారామలక్ష్మణులు పంచవటిలోనూ కొన్నాళ్లున్నారు. రావణుడి సోదరి అయిన శూర్పణఖ రామ లక్ష్మణులను మోహించడం, లక్ష్మణుడు.. ఆమె ముక్కు, చెవులు కోసిన ఘట్టం అంతా ఇక్కడే జరిగినట్లు రామాయణ గాథ చెబుతుంది. సీతను రావణుడు అపహరించిందీ ఇక్కడే.

లేపాక్షి - ఆంధ్రప్రదేశ్



ప్రస్తుతం ఏపీలోని అనంతపురం జిల్లాలో ఉన్న ప్రదేశమిది. పుష్పక విమానంలో సీతను రావణుడు తీసుకెళుతున్నప్పుడు పక్షిరాజు జటాయువు జానకీమాతను రక్షించేందుకు లంకేశుడితో పోరాడింది ఇక్కడే. లక్ష్మణుడితో కలిసి పంచవటి నుంచి సీతను వెతుక్కుంటూ బయలుదేరిన శ్రీరామచంద్రుడు ఓ చోట రెక్కలు తెగి.. దేహమంతా రక్తసిక్తమై పడివున్న స్థితిలో జటాయువును చూస్తాడు. పక్షిరాజును ఉద్దేశించి 'లే పక్షి' అని రాముడు అన్నాడని.. అందుకే ఆ ప్రదేశానికి లేపాక్షి అనే పేరొచ్చిందని పురాణ కథనం. జటాయువు ప్రాణం వీడుతూ సీతను రావణుడు అపహరించాడని రామలక్ష్మణులకు వివరిస్తాడు.




కిష్కింధ - కర్ణాటక

కిష్కింధను ఇప్పుడు హంపిగా పిలుస్తున్నారు. వానర రాజు సుగ్రీవుడిని రాముడు కలిసిన చోటు ఇది. సుగ్రీవుడితో స్నేహం.. ఆయన సోదరుడు వాలి సంహారం.. సీతాన్వేషణకు హనుమంతుడిని పంపడం.. రావణుడితో యుద్ధం కోసం వానర సైన్యంతో కదలడం వంటి కీలక ఘట్టాలకు కిష్కింధే నెలవు.

రామేశ్వరం - తమిళనాడు



రామయణంలో పొందుపర్చిన అన్ని ప్రదేశాల్లోకెల్లా అత్యంత ప్రముఖమైన ప్రదేశం రామేశ్వరం. వానర సైన్యంతో కలిసి సముద్రం దాటి లంకకు వెళ్లేందుకు రాముడు వారధిని నిర్మించింది ఇక్కడి నుంచే. రాముడు సైకత లింగాన్ని తయారు చేసి పూజలు చేశాడని రామాయణంలో ప్రత్యేక ప్రస్తావనా ఉంది.



అశోక వాటిక - శ్రీలంక

శ్రీలంకలో ఉన్న దర్శనీయ స్థలాల్లో అశోక వాటిక ప్రఖ్యాతిపొందింది. శ్రీలంకలోని నువారా ఎలియా అనే ప్రాంతంలో ఉంది. అశోక వాటికను 'సీతా అమ్మన్ టెంపుల్‌'గా పిలుస్తున్నారు. సీతను రావణుడు ఉంచింది ఇక్కడే. సీతమ్మ జాడ తెలుసుకునేందుకు లంకలో అడుగు పెట్టిన హనుమంతుడి పాదముద్రలూ ఇక్కడ చూడొచ్చు.



తలైమన్నార్ - శ్రీలంక

రామ-రావణ యుద్ధం జరిగిన చోటు.. ఆ సంగ్రామంలో రావణుడు నేలకొరిగిన చోటు.. అశోకవనం నుంచి వచ్చిన సీత మళ్లీ రాముడి చెంతకు చేరిన చోటు ఇది. తలైమన్నార్‌లోనే రావణుడి సోదరుడైన విభీషణుడిని లంకకు రాజుగా ప్రకటించిన అనంతరం ఇక్కడి నుంచే సీతారామలక్ష్మణులు బయలుదేరి అయోధ్యలో అడుగు పెడతారు.

శ్రీరామ జయం



(మొదటి పేజీ తరువాయి)

నడుమ.. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు అభిజిత్ లగ్నంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం మొదలు కానుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ కార్యక్రమంలో పాల్గొని రాముడి విగ్రహం కళ్లకు కట్టిన పసుపు వస్త్రాన్ని తొలగించి (నేత్రోన్మీలనం అనంతరం) తొలి దర్శనం చేసుకుంటారు. ఆ తర్వాత స్వామివారికి హారతి ఇస్తారు. మంగళవారం నుంచి భక్తులకు బాలరాముడి దర్శన భాగ్యం కలగనుంది. కాగా.. ప్రాణ ప్రతిష్ఠ అనంతరం రామ్‌లల్లాకు ముందుగా నివేదించే 56 రకాల భోగ్ ప్రసాదం ఇప్పటికే లఖ్‌నవూ నుంచి అయోధ్యకు చేరుకుంది.

50 వాయిద్యాలతో మంగళ ధ్వనులు

రామమందిరం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో దాదాపు 2గంటల పాటు మంగళ ధ్వనులు ప్రతిధ్వనించనున్నాయి. దీనికోసం భారతీయ సంప్రదాయానికి చెందిన ఘటం (ఏపీ), మృదంగం, నాదస్వరం (తమిళనాడు), వీణ (కర్ణాటక) తదితర 50 రకాల సంప్రదాయ సంగీత వాయిద్యాలను సిద్ధం చేశారు. 22న ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

కొత్త ఆలయంలోకి రామ్‌లల్లా

దాదాపు 70 సంవత్సరాల పాటు ఒక గుడారానికి పరిమితమై అక్కడే పూజలందుకుంటున్న పాత రామ్ లల్లా.. 21న రాత్రి శయన హారతి అనంతరం 22న సోమవారం కొత్త ఆలయంలో నిద్ర లేవనున్నారు. ఆదివారం రాత్రి హారతి తర్వాత పాత విగ్రహాన్ని నూతనంగా నిర్మించిన రామమందిరంలోకి తరలించారు. అలాగే లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుడు, స్వామి హనుమ విగ్రహాలను కొత్త ఆలయంలోకి తీసుకెళ్లారు. దశాబ్దాల అనంతరం ఈ నెల 20, 21వ తేదీల్లో పాత ఆలయం మూసి ఉండటంతో భక్తులకు వరుసగా రెండు రోజుల పాటు రామ్ లల్లా దర్శనం లభించలేదు. ఇప్పుడు వారందరికీ ఆయన కొత్త మందిరంలో దర్శన భాగ్యం కలిగించనున్నారు. కొత్తగా ప్రతిష్ఠించే బాలరాముడి విగ్రహం ముందు భాగంలోనే.. ఈ విగ్రహాలను కూడా ఉంచుతారు. రామ్‌లల్లా పాత విగ్రహం ఎత్తు కేవలం ఆరు అంగుళాలు మాత్రమే కాగా, మిగిలిన విగ్రహాలు అంతకంటే చిన్నవి. ఈ నేపథ్యంలోనే.. పెద్ద విగ్రహాన్ని తయారు చేయించాలని ట్రస్టు నిర్ణయించింది.

10 లక్షల దీపాలు.. 121 మంది ఆచార్యులు..

బాల రాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని సోమవారం (22న) సాయంత్రం అయోధ్య నగరాన్ని 10లక్షల మట్టి దీపాలు వెలిగించనున్నారు. నగరంలోని 100 ఆలయాలతో పాటు ఇతర ప్రధాన కూడళ్లను దీపాలతో అలంకరిస్తామని ట్రస్టు అధికారులు వెల్లడించారు. ఇక.. అయోధ్యలోని రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు సంబంధించిన పూజా క్రతువుల్లో 121మంది ఆచార్యులు పాల్గొంటున్నారు. కాగా.. అయోధ్యలో నిర్మిస్తున్న రామమందిర నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.1,100 కోట్లకు పైగా ఖర్చయిందని, మిగిలిన పనులు పూర్తి చేయడానికి మరో రూ.300 కోట్లు అవసరమవుతాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి తెలిపారు. పాత రామ్‌లల్లా విగ్రహం ఐదారు అంగుళాలు మాత్రమే ఎత్తు ఉండటంతో 25-30 అడుగుల దూరం నుంచి దర్శించుకోవడానికి భక్తులకు సాధ్యం కాదని.. అందుకే పెద్ద విగ్రహం ప్రతిష్ఠిస్తున్నామని ఆయన వివరించారు.

అయోధ్య కాషాయమయం

ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఇళ్లు, భవనాలు, దుకాణాలు.. అన్నింటిపైనా కాషాయ జెండాల రెపరెపలతో అయోధ్య నగరమంతా కాషాయమయంగా కనిపిస్తోంది. భక్తులు అయోధ్య వీధుల్లో కాలినడకన, గుర్రాలపై ప్రయాణిస్తూ కూడా జెండాలు ఊపుతూ ఉత్సాహంగా వెళ్తున్నారు. కొన్నిరోజులుగా కాషాయ జెండాల అమ్మకాలు అనేక రెట్లు పెరిగిపోయాయి.

రామమందిరం ప్రత్యేకతలు ఇవీ...

1 సంప్రదాయ నాగరా శైలిలో రామమందిరం నిర్మితమవుతోంది. ఈ మందిరం పొడవు 380 అడుగులు, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161 అడుగులు.

1 మూడు అంతస్తులుగా ఉండే రామమందిరంలో ఒక్కో అంతస్తు 20అడుగుల ఎత్తు ఉంటుంది. ఈ ఆలయంలో 392 స్తంభాలు, 44 ద్వారాలు ఉన్నాయి.


1 మొదటి అంతస్తులో శ్రీరామ దర్బార్ ఉంటుంది. ఇక్కడ మొత్తం ఐదు (నృత్య, రంగ్, సభా, ప్రార్థనా, కీర్తనా) మండపాలు ఉంటాయి.

1 తూర్పువైపు ఉన్న సింహద్వారం నుంచి భక్తులు 32 మెట్లు ఎక్కి ఆలయం లోపలికి ప్రవేశిస్తారు.

1 మందిరం చుట్టూ 732 మీటర్ల పొడవు, 14 అడుగుల వెడల్పుతో దీర్ఘచతురస్రాకారంలో భారీ ప్రహరీని నిర్మించారు.

1 ఈ ప్రహరీ 4 మూలల్లో సూర్యుడు, దేవీ భగవతి, వినాయకుడు, శివుడి మందిరాలు ఉన్నాయి. ఉత్తర భాగంలో అన్నపూర్ణా దేవి, దక్షిణ భాగంలో హనుమాన్ గుడి ఉన్నాయి.





ప్రధాని అయోధ్య పర్యటన ఇలా...

బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ సోమవారం ఉదయం 10.20 గంటలకు అయోధ్య చేరుకుంటారు. 10.55 గంటలకు రామ జన్మభూమికి చేరుకుంటారు. 12.05 నుంచి 12.55 గంటల మధ్య గర్భాలయంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం ఒంటిగంటకు.. కార్యక్రమానికి హాజరైన అతిథులతో మాట్లాడుతారు. 2.05గంటల ప్రాంతంలో మందిర నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులతో ఇష్టాగోష్ఠి. అనంతరం అక్కడి శివాలయంలో పూజలు చేస్తారు. 2.40 గంటలకు విమానాశ్రయానికి చేరుకుని 3.05 గంటలకు ఢిల్లీ బయలుదేరి వెళతారు. భద్రతా చర్యల్లో భాగంగా అయోధ్యలో 9,700సీసీ కెమెరాల ను, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశా రు. 12వేల మంది పోలీసులను, ఎన్ఎస్‌జీ బలగాలను మోహరించారు.

నేడు జరిగేది బాలరాముడి ప్రతిష్ఠ!


» భూతలం వరకే ఆలయ నిర్మాణం పూర్తి

» ఆలయ ట్రస్టు చైర్మన్ నృపేన్ మిశ్రా

అయోధ్య, జనవరి 21: రామాలయ నిర్మాణం పూర్తికాకముందే ప్రాణ ప్రతిష్ఠ చేయడాన్ని, గర్భగుడిలోకి ప్రధాని మోదీని అనుమతించి.. తమకు మాత్రం వెలుపల ఆసనాలు ఏర్పాటు చేయడాన్ని నలుగురు శంకరాచార్యులు వ్యతిరేకించడంపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు చైర్మన్ నృపేన్ మిశ్రా స్పందించారు. వారు సనాతన ధర్మాచరణ పర్యవేక్షకులని పేర్కొన్నారు. 'వారు ధర్మగురువులు. నేను సామాన్యుడిని.. అయితే జాతికి నేనో విషయం చెప్పదలిచాను. ఆలయం గ్రౌండ్ ఫ్లోర్ భూతలంలో బాలరాముడిని ప్రతిష్ఠ చేస్తున్నామని ప్రకటించాం. ఇందులో గర్భ గుడి, ఐదు మండపాలుంటాయి. దీనివరకు నిర్మాణ పూర్తయింది. మొదటి అంతస్తు ఇంకా పూర్తి కావలసి ఉంది. అందులో రామ్‌దర్బార్ ఉంటుంది. రాజారాముడు సీతాలక్ష్మణ భరత శత్రుఘ్న, ఆంజనేయ సమేతంగా దర్శనమిస్తాడు. రెండో అంతస్తులో ధ్యానం, ధార్మిక కార్యక్రమాలు ఉంటాయి' అని వివరించారు. మొత్తం ఆలయం ఈ ఏడాది చివరికల్లా పూర్తవుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా, రామమందిర ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరు కాబోమన్న నలుగురు శంకరాచార్యలను, ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆధ్యాత్మికవేత్త జగద్గురు స్వామి రామభద్రాచార్య మహరాజ్ "వినాశకాలే విపరీత బుద్ధి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అహం వీడి వేడుకలకు హాజరు కావాలని హితవు పలికారు.

రాముని బంట్లు!

కోట్లాది మంది హిందువుల కల సాకారమై అయోధ్యలో నిర్మితమైన భవ్యమైన రామమందిరంలో బాల రాముడు కొలువుదీరుతున్నాడు! కానీ.. ఇది అంత సులువుగా జరిగిపోలేదు. రామ జన్మభూమి ఉద్యమం పేరుతో ఎంతో మంది చేసిన కృషి ఫలితమే ఈ ఆలయం. ఉద్యమంలో అత్యంత కీలకపాత్ర పోషించినవారిని.. ఆలయ నిర్మాణం సాకారం కావడంలో ముఖ్యులను ఒక్కసారి గుర్తుచేసుకోవాల్సిన సందర్భమిది.



లాల్ కృష్ణ అడ్వాణీ: రామ జన్మభూమి ఉద్యమం అనగానే గుర్తొచ్చే మొట్టమొదటి పేరు.. ఎల్‌కే అడ్వాణీ! అంతకుముందు ఎన్నో ఏళ్లుగా ఎంతో మంది సాధుసంతులు అయోధ్యలో రామాలయం కోసం పోరాడుతున్నా.. ఆ అంశాన్ని రాజకీయ, సామాజిక ఉద్యమంగా మలిచి ప్రజాబాహుళ్యంలోకి చొచ్చుకుపోయేలా చేసింది మాత్రం అడ్వాణీయే. 1990లో.. ఒక టొయోటా వీనీ ట్రక్కును రథంగా మార్చి గుజరాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయం నుంచి అయోధ్యలో రామజన్మభూమి దాకా ఆయన ప్రారంభించిన యాత్రకు విస్తృత మద్దతు లభించింది. 1984 లోక్‌సభ ఎన్నికల్లో 2 సీట్లతో ప్రస్థానం ప్రారంభించిన బీజేపీని వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చి రామ మందిరాన్ని నిర్మించడానికి అవసరమైన భూమికను ఏర్పరచింది అడ్వాణీ రథయాత్రేననడంలో సందేహం లేదు.

కల్యాణ్ సింగ్: బాబ్రీ కూల్చివేత జరిగిన సమయంలో యూపీ సీఎం. 1991 జూన్‌లో ఆయన సీఎంగా ప్రమాణం చేయడానికి ముందే రామ్ లల్లా విగ్రహం వద్దకు వెళ్లి తన పాలనలోనే అక్కడ రామమందిర నిర్మాణం జరిపించి తీరుతానని ప్రతిజ్ఞ చేశారు. 1992లో మసీదు కూల్చివేస్తున్న కరసేవకులపై ఫైరింగ్ ఆర్డర్ ఇవ్వడానికి నిరాకరించారు. రామమందిర నిర్మాణ ఉద్యమంలో అత్యంత కీలక ఘట్టం అదే.

ప్రమోద్ మహాజన్: అయోధ్య ఉద్యమంలో భాగంగా అడ్వాణీ తొలుత సోమ్‌నాథ్ నుంచి అయోధ్య దాకా పాదయాత్ర చేపట్టాలని భావించారు. అయితే, రాముడి రథం లాంటిదాంట్లో యాత్ర చేపడితే బాగుంటుందని, ప్రజల్లోకి బాగా వెళ్తుందని అప్పటి బీజేపీ జనరల్ సెక్రటరీ ప్రమోద్ మహాజన్ సూచించారు. ఆయన ఇచ్చిన రథయాత్ర ఐడియా అద్భుతంగా వర్కవుట్ అయ్యింది. రథయాత్ర సక్సెస్ అయింది.



అశోక్ సింఘాల్: విశ్వ హిందూ పరిషత్ 1984లో ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో వందలాది సాధువులు, హిందూ ప్రముఖులతో 'ధర్మ సదస్సు' నిర్వహించింది. రామజన్మభూమి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని అక్కడే నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత ఆ ఉద్యమానికి అశోక్ సింఘాల్ ప్రధాన రూపకర్తగా మారి ముందుకు నడిపించారు. 1980లో రామజన్మభూమి తాళాలు తెరవాలని కోరుతూ.. రామ్‌జానకీ రథయాత్రను నిర్వహించారు. ఆయన కృషి వల్లనే కరసేవ ఉద్యమం కూడా మొదలైంది. బాబ్రీమసీదు తాళాలు తెరుచుకున్న తర్వాత.. అక్కడ ఆలయం కట్టాలనే ఉద్యమానికి తెరతీశారు. ఆపై దాన్ని అడ్వాణీ అందిపుచ్చుకున్నారు.



మురళీ మనోహర్ జోషి: అడ్వాణీ చేపట్టిన రథయాత్రలో 'సెకండ్-ఇన్-కమాండ్'గా వ్యవహరించిన కీలక వ్యక్తి మురళీ మనోహర్‌జోషి. 1992లో మధురలో.. బాబ్రీమసీదు కూల్చివేతకు కారణమయ్యేలా కరసేవకులను రెచ్చగొట్టే ప్రసంగం చేశారనే ఆరోపణలు ఆయనపై ఉన్నాయి.

ఉమాభారతి: రెచ్చగొట్టే నినాదాలతో ప్రసంగాలు చేయడంలో దిట్ట. బాబ్రీమసీదు కూల్చివేత సమయంలో ఆమె ఇలాగే తన నినాదాలతో కరసేవకులను రెచ్చగొట్టినట్టు లిబర్హాన్ కమిషన్ తేల్చింది. ప్రణాళిక ప్రకారం ఆమె ఇచ్చిన సంకేతంతోనే మసీదు కూల్చివేత మొదలైందని ఆమెపై దాఖలైన అభియోగపత్రంలో పేర్కొన్నారు.

వినయ్ కతియార్: రామ మందిర నిర్మాణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఏర్పాటైన సంస్థ బజరంగ్ దళ్‌కు తొలి అధ్యక్షుడు వినయ్ కతియార్. ఫైర్‌బ్రాండ్. కాగా, బాబ్రీ తాళాలు తెరిపించి శిలాన్యాస్‌కు అనుమతించిన రాజీవ్ గాంధీ, మసీదు కూల్చివేత వేళ మౌనముద్ర దాల్చిన నాటి ప్రధాని పీవీ కూడా మందిర నిర్మాణంలో పరోక్షంగా కీలకపాత్ర పోషించారు. - సెంట్రల్ డెస్క్

రాముడి కోసం 'భీష్ముడి' పోరాటం

రామమందిరం సాకారంలో కురువృద్ధ న్యాయవాది పరాశరన్ పాత్ర కీలకం

» 92 ఏళ్ల వయసులో కోర్టులో వాదనలు

» సుప్రీంకోర్టును మెప్పించి హిందువులకు రామజన్మభూమిని ఇప్పించిన ప్రజ్ఞాశాలి



92 ఏళ్ల వయసులో, యావత్ భారతదేశాన్ని ప్రభావితం చేస్తున్న అత్యంత సంక్లిష్టమైన కేసును స్వీకరించారు. పగలూ రాత్రీ అన్న తేడా లేకుండా కష్టపడి ఆ కేసుపైన వాదనలను నిర్మించుకున్నారు. సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా 40 రోజుల పాటు జరిగిన విచారణలో తన వాదనలను వినిపించి ధర్మాసనాన్ని మెప్పించారు. శ్రీరాముడి జన్మస్థలాన్ని హిందువులకు అప్పగించారు. ఆ దిగ్గజ న్యాయవాది పేరు కేశవ్ పరాశరన్. 1973 నాటి కేశవానంద భారతి కేసు తర్వాత సుప్రీంకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది రామజన్మభూమి కేసులోనే. 2019 ఆగస్టు 6 నుంచి అక్టోబరు 16 వరకూ 40 రోజులపాటు రోజువారీ విచారణ జరిగింది. హిందూ కక్షిదారుల తరఫున వాదనలు వినిపించే న్యాయవాదుల బృందానికి కేశవ్ పరాశరన్ నాయకత్వం వహించారు. కోర్టులో వాదనలు జరిగే సందర్భంలో ఒక్కోసారి పరాశరణ్ ఏకబిగిన నాలుగు గంటలకుపైగా నిలబడి ఉండేవారు. శ్రీరాముడి మీద పరాశరణ్‌కు ఎంతటి భక్తిప్రపత్తులంటే.. కేసు విచారణ జరిగినన్ని రోజులూ ఆయన, ధర్మాసనం ఎదుట వాదనలు వినిపించటానికి ముందు తన బూట్లను విడిచి పక్కన పెట్టి వచ్చేవారు. 'అయోధ్యలో 55-60 మసీదులున్నాయి. వాటిల్లో దేంట్లోనైనా ముస్లింలు నమాజు చేసుకోవచ్చు. కానీ, హిందువులకు మాత్రం ఇది రాముడు పుట్టిన ప్రదేశం. దీనిని మేం మార్చుకోలేం కదా!' అని పరాశరణ్ ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. ఒక ప్రదేశం (అయోధ్య జన్మస్థానం) కూడా కేసు కక్షిదారుల్లో ఒకరిగా ఉండటం ఎలా సాధ్యమని ధర్మాసనంలోని ఒక న్యాయమూర్తి ప్రశ్నించినప్పుడు.. 'రుగ్వేదం ప్రకారం సూర్యుడు దేవుడు. కానీ, ఆయనకు విగ్రహం లేదు. హిందువులు నిరాకార శక్తిని కూడా దేవుడిగా కొలుస్తారు. హిందూ లా ప్రకారం కోర్టులో దేవుడిపై కేసు వేయవచ్చు. దేవుడు కూడా కేసు వేయవచ్చు. కాబట్టి, అయోధ్య జన్మస్థానం ఒక కక్షిదారుగా ఉండటం సాధ్యమే' అని పరాశరణ్ పేర్కొన్నారు. ముస్లిం కక్షిదారుల పక్షాన రాజీవ్ ధావన్ వాదిస్తూ.. 'అది మసీదు. ఎప్పటికీ మసీదే' అని బలంగా చెప్పినప్పుడు.. దానికి కౌంటర్‌గా, 'అది ఒకప్పుడు ఆలయం. ఎప్పటికీ అది ఆలయమే' అని పరాశరణ్ వాదించారు. ధర్మాసనం ఎదుట ఇరుపక్షాల వాదనలు ముగిసిన రోజు.. రాజీవ్ ధావన్‌ను కలిసి వీడ్కోలు చెప్పి వెళ్లిపోవటానికి పరాశరన్ 15 నిమిషాలపాటు వేచి చూసి, ధావన్‌ను కలిసి వెళ్లిపోయారు.

న్యాయవాదిగా సుదీర్ఘ ప్రస్థానం

పరాశరన్ 1927 అక్టోబరు 9న తమిళనాడులోని శ్రీరంగంలో జన్మించారు. 1958లో సుప్రీంకోర్టు లాయర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. 1976లో దేశంలో ఎమర్జెన్సీ సమయంలో పరాశరన్ తమిళనాడు ఏజీగా ఉన్నారు. ప్రధాని ఇందిర హయాంలో సొలిసిటర్ జనరల్‌గా, అటార్నీ జనరల్‌గా పనిచేశారు. 1989 వరకూ అటార్నీ జనరల్‌గా కొనసాగారు. పరాశరన్‌కు 2003లో పద్మభూషణ్, 2011లో పద్మవిభూషణ్ పురస్కారాలు లభించాయి. 2016 తర్వాత పరాశరన్ రెండు కేసులు మాత్రమే చేపట్టారు. ఒకటి అయోధ్య కాగా మరొకటి శబరిమల. - సెంట్రల్ డెస్క్

ఖాన్‌మార్కెట్ లైబ్రరీలో అయోధ్య భూ రికార్డులు

సుప్రీంకోర్టులో హిందూ కక్షిదారుల లాయర్ల బృందంలో శుభేందు ఒకరు. ఈ కేసులో ఓ ముఖ్యమైన అంశాన్ని శుభేందు తాజాగా వెల్లడించారు. 'కేసు విచారణ జరిగిన 40 రోజుల్లో దాదాపుగా మేం ఆఫీసులోనే ఉండేవాళ్లం. కేసుకు బలం చేకూర్చటానికి ల్యాండ్ రికార్డులు, చారిత్రక ఆధారాల కోసం వెతికేవాళ్లం. ఓ మధ్యాహ్నం లంచ్ కోసం ముగ్గురు లాయర్లం ఖాన్ మార్కెట్‌కు వెళ్లాం. భోజనం తర్వాత అక్కడున్న ఓ పుస్తకాల షాపునకు వెళ్తే, యాదృచ్ఛికంగా అయోధ్యకు సంబంధించిన పాత భూరికార్డులు దొరికాయి. ఈ రికార్డులు కేసులో ముఖ్య పాత్ర పోషించాయి' అని శుభేందు వెల్లడించారు.

ఆలయ రూపశిల్పి చంద్రకాంత్



అయోధ్య, జనవరి 21: అయోధ్య రామాలయ మాస్టర్ ప్లాన్ రూపకర్త చంద్రకాంత్ సోమ్‌పురా. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడారు. 32ఏళ్ల కల నెరవేరబోతోందని చెప్పారు. "32 ఏళ్ల క్రితం అప్పటి వీహెచ్‌పీ అధ్యక్షుడు అశోక్ సింఘాల్ నా వద్దకు వచ్చి అయోధ్యలో రామమందిరం కోసం ప్లాన్‌ను రూపొందించాలన్నా రు. రామజన్మభూమి వద్దకు ఇద్దరం వెళ్లాం. కానీ, అక్కడి భద్రతా సిబ్బంది లోపలికి వెళ్లి కొలతలు తీసుకోవడానికి అనుమతించలేదు. దీంతో, అడుగుల లెక్కతోనే కొలతలు తీసుకున్నాను" అని చెప్పారు. ఆ తర్వాత వాస్తు, శిల్ప శాస్త్రాలకు అనుగుణంగా 2020లో మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇందులో చంద్రకాంత్ కుమారుడు ఆశిష్ కూడా పాలుపంచుకున్నారు.



500 ఏళ్ల అయోధ్య రామమందిర చరిత్ర ఇదీ..

1528 అయోధ్యలో రాముడి జన్మస్థలమని హిందువులు భావించే చోట మొఘల్ చక్రవర్తి బాబర్ మసీదును నిర్మించాడు.

1853-1949 ఈ స్థలం గురించి హిందూ-ముస్లింల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగాయి. దీంతో బ్రిటిష్ వాళ్లు మసీదు లోపలి భాగాన్ని ముస్లింలకు, మసీదు వెలుపలి ప్రాంతాన్ని హిందువులకు కేటాయించారు.

1949 మసీదు లోపల రాముడి విగ్రహం బయటపడింది. ముస్లింలు ఆందోళనలు వ్యక్తం చేశారు. దీంతో మసీదును వివాదాస్పద ప్రాంతంగా ప్రకటించి మసీదుకు తాళం వేశారు.

1950 మసీదు లోపల బయటపడిన రామ్ లల్లా విగ్రహానికి పూజలు చేసేందుకు అనుమతించాలని ఫైజాబాద్ సివిల్ కోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. 1959లో నిర్మోహీ అఖాడా మూడో పార్టీగా పిటిషన్ వేసింది.

1961 మసీదు లోపలి రామ్ లల్లా విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ యూపీ సున్నీ వక్ఫ్ బోర్డు కోర్టుకు వెళ్లింది.

1986 మసీదు తలుపులు తెరవాలని, హిందువులు పూజలు చేసుకు నేందుకు అనుమతి ఇవ్వాలని ఫైజాబాద్ జిల్లా కోర్టు తీర్పునిచ్చింది.

1992 డిసెంబరు 6 కరసేవకులు బాబ్రీ మసీదును కూల్చివేశారు. తర్వాత చెలరేగిన హింసలో 2వేల మందికి పైగా చనిపోయారు.

2001 బాబ్రీ కూల్చివేత, హింస కేసులో స్పెషల్ జడ్జి అడ్వాణీ, కల్యాణ్ సింగ్ సహా 13 మందిని నిర్దోషిగా ప్రకటించారు.

2002 హిందూ భక్తులు వెళ్తున్న రైలుకు గోధ్రాలో నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 58 మంది చనిపోయారు. తర్వాత చెలరేగిన హింసలో 2వేల మందికి పైగా మృతి చెందారు.

2010 అలహాబాద్ హైకోర్టు అయోధ్యలోని వివాదాస్పద భూభాగాన్ని మూడొంతులుగా విభజించి.. రెండు వంతులను హిందూ పార్టీలకు, ఒక వంతును వక్ఫ్ బోర్డుకు కేటాయించింది.

2011 అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది.

2017 మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు హిందూ, ముస్లిం పార్టీలకు సూచించింది. దీంతో పాటు పలువురు బీజేపీ నేతలపై నేరపూరిత కుట్ర ఆరోపణలను పునరుద్ధరించింది.

2019 మార్చి 8 అయోధ్య కేసు మధ్యవర్తిత్వానికి సుప్రీంకోర్టు ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. 8వారాల్లోగా ప్రొసీడింగులను పూర్తి చేయాలంది.

2019 నవంబరు 9 అయోధ్యపై సుప్రీం కోర్టు చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. వివాదాస్పద స్థలం మొత్తాన్ని రామ్ లల్లాకే కేటాయించింది. మసీదు నిర్మాణానికి 5ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కేంద్రం, యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.

2020 ఫిబ్రవరి 5 అయోధ్య రామాలయ నిర్మాణానికి కేంద్రప్రభుత్వం 15 సభ్యులతో ట్రస్టును ఏర్పాటు చేసింది.

2020 ఆగస్టు 5 ప్రధాని మోదీ రామాలయ నిర్మాణానికి పునాది రాయి వేశారు.

2022 జనవరి 22 భవ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ

2 నుంచి 303 సీట్ల వరకూ..

ఇంతింతై వటుడింతై అన్నట్లుగా బీజేపీ ప్రస్థానం.. రామ జన్మభూమి ఉద్యమంతోనే పార్టీ ఎదుగుదల

- కీలకపాత్ర పోషించిన అద్వానీ రథయాత్ర
- వాజపేయి హయాంలో కోర్ అంశాలకు తగ్గిన ప్రాధాన్యం
- మోదీ రాకతో తిరిగి హిందుత్వ విజృంభణ
- 400కుపైగా సీట్లు లక్ష్యంగా వచ్చే ఎన్నికలకు కసరత్తు



నాలుగు దశాబ్దాల క్రితం 1980లలో రామ జన్మభూమి ఉద్యమం ప్రారంభమైంది. ఆ ఉద్యమం తన అంతిమ లక్ష్యాన్ని నేడు చేరుకుంది. ఈ ప్రస్థానంలో కర్త, కర్మ, క్రియ బీజేపీ అంటే అతిశయోక్తి కాదు. రామ జన్మభూమి ఉద్యమంలాగే బీజేపీ కూడా ఇంతింతై వటుడింతై అన్నట్లుగా భారతీయ రాజకీయ వినీలాకాశాన్ని పూర్తిగా ఆవరించింది. ఆ ప్రస్థానాన్ని ఓసారి గమనిస్తే.. జనసంఘ్ అవశేషాల నుంచి పురుడు పోసుకున్న బీజేపీ.. 1984లో తొలిసారిగా పోటీ చేసిన లోక్‌సభ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లను మాత్రమే గెల్చుకుంది. నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య అనంతరం జరిగిన ఎన్నికలు కాబట్టి, కాంగ్రెస్ పార్టీ చరిత్రలోనే అత్యధికంగా 414 సీట్లను ఆ ఎన్నికల్లో కైవసం చేసుకుంది. మరోవైపు అప్పుడప్పుడే రామ జన్మభూమి ఉద్యమం దేశవ్యాప్తంగా ఊపందుకుంటోంది. ఈనేపథ్యంలో 1989లో పాలంపూర్ తీర్మానం ద్వారా అయోధ్య రామమందిరం నిర్మాణానికి కట్టుబడి ఉంటామని బీజేపీ ప్రకటించింది. తద్వారా జాతీయ రాజకీయాల్లో తన కంటూ ముద్రను బీజేపీ వేసుకోవటం మొదలైంది. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తన సంఖ్యాబలాన్ని 85 సీట్లకు పెంచుకుంది. 1990ల తొలినాళ్లలో మండల్ రాజకీయాల దశ మొదలైంది. దీనికి ప్రతిగా బీజేపీ రామ జన్మభూమి ఉద్యమాన్ని ఉధృతం చేసింది. గుజరాత్‌లోని సోమ్‌నాథ్ ఆలయం నుంచి బీజేపీ అగ్రనేత అద్వానీ రథయాత్రను ప్రారంభించారు. యాత్ర సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నప్పటికీ.. హిందువులలో అశేష ప్రజానీకాన్ని ఈయాత్ర ఆకర్షించి, బీజేపీని బలోపేతం చేసింది. 1991లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 121సీట్లను కైవసం చేసుకుంది. 1992 డిసెంబరులో బాబ్రీమసీదు విధ్వంసం జరిగింది. ఈ నేపథ్యంలో రామ జన్మభూమి ఉద్యమం మరింత తీవ్రంగా ముందుకొచ్చింది. 1996లో లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 161 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించి వాజపేయి ప్రధాని పదవిని చేపట్టినప్పటికీ మెజారిటీ నిరూపించుకోలేకపోవటంతో రెండు వారాల్లోపే ఆ ప్రభుత్వం కూలిపోయింది. అస్థిర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన ఆ సమయంలో మరో రెండేళ్లలోనే 1998లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. దీంట్లో బీజేపీ 182 సీట్లతో మరోసారి అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించి మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే అన్నాడీఎంకే మద్దతును ఉపసంహరించుకోవటంతో ఏడాదిలోనే ఆ ప్రభుత్వం కూడా కూలిపోయి 1999లో మళ్లీ లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఈసారి కూడా బీజేపీ 182 సీట్లతో తిరిగి వాజపేయి ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ ప్రభుత్వం స్థిరంగా ఐదేళ్లపాటు కొనసాగింది. వాజపేయి హయాంలో అయోధ్య, ఉమ్మడి పౌరస్మృతి తదితర అంశాలను బీజేపీ పక్కనపెట్టింది. 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ అధికారంలోకి వచ్చి వరుసగా రెండు పర్యాయాలు కొనసాగింది. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోదీ బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ఎంపికైన తర్వాత తిరిగి తన కోర్ అంశమైన హిందుత్వను బీజేపీ బలంగా ముందుకు తీసుకొచ్చింది. ఆ ఎన్నికల్లో 282సీట్లతో విజయ పతాకాన్ని ఎగరవేసి మోదీ ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 2019 ఎన్నికల్లో బీజేపీ సంఖ్యాబలం 303కి చేరింది. అదే ఏడాది అయోధ్య కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువడింది. అయోధ్యలో ప్రధాని మోదీ భూమి పూజలో పాల్గొని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఆలయం సాకారమైంది. ఈ నేపథ్యంలో మరికొన్ని నెలల్లో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో 400కుపైగా సీట్లను సాధించి గతంలో కాంగ్రెస్ నెలకొల్పిన రికార్డును బద్దలుకొట్టాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విధంగా బీజేపీ ప్రస్థానంలో అయోధ్య విడదీయరాని భాగంగా మారింది.

(సెంట్రల్ డెస్క్)



ఇదిగో రామమందిర ఉపగ్రహ చిత్రాలు

అయోధ్య, జనవరి21: అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈక్రమంలోనే ఇస్రో ఉపగ్రహం నుంచి తీసిన రామమందిర చిత్రాలను విడుదల చేసింది. ఇస్రో ప్రయోగించిన ఇండియన్ రిమోట్ సెన్సింగ్ కార్టోశాట్ అనే భూపరిశీలన ఉపగ్రహం గత డిసెంబరు 16న తీసిన ఈ ఫొటోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ ద్వారా ఇస్రో విడుదల చేసింది. ఈ చిత్రంలో నిర్మాణ దశలో ఉన్న రామమందిరం దర్శనమిచ్చింది.

రామసేతు వద్ద ప్రధాని ధ్యానం

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

- పవిత్ర జలాల కలశంతో ఢిల్లీకి

చెన్నై, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాట ప్రధాని మోదీ రెండ్రోజుల ఆధ్యాత్మిక పర్యటన ఆదివారం మధ్యాహ్నం ముగిసింది. 19న చెన్నైలో 'ఖేలో ఇండియా' క్రీడలను ప్రారంభించిన ఆయన శని, ఆదివారాల్లో వివిధ ఆలయాలను సందర్శించారు. అయోధ్యలో రామాలయ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో 11రోజుల అనుష్ఠాన దీక్షలో ఉన్న ఆయన ఈ రాష్ట్రంలో రామాయణంలోని కీలక ఘట్టాలతో సంబంధం ఉన్న శ్రీరంగం ఆలయాన్ని, రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. రాత్రి రామేశ్వరంలోని శ్రీరామకృష్ణమఠంలో బస చేశారు. ఆదివారం ఉదయం ధనుష్కోడి ప్రాంతానికి చేరుకుని అక్కడ బంగాళాఖాతం, హిందూమహాసముద్రం కలిసే రామసేతు లేదా 'అరిచ్చలై మునై' (పౌరాణిక నామం 'సేతు బంధన తీర్థం)' ప్రాంతాన్ని సందర్శించారు. ఇక్కడ మోదీ శివ పూజ చేశారు. శ్రీరాముడి జీవితంలో 'అరిచ్చలై మునై'కి ఎంతో ప్రాధాన్యం ఉందని, ఇది రామసేతుకు ఆరంభ కేంద్రమని తర్వాత ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. అరిచ్చలై మునై వద్దే మోదీ సముద్రస్నానమాచరించారు. కడలి ఒడ్డున ప్రాణాయామం చేశారు. తర్వాత కారులో కోదండ రామాలయానికి వెళ్లారు. మూలవిరాట్ వద్ద ఆయన నిల్చొని కాసేపు ధ్యానం చేశారు. ఆ తర్వాత రామేశ్వరం నుంచి హెలికాప్టరులో మదురై చేరుకుని.. విమానంలో పవిత్ర జలాల కలశంతో ఢిల్లీ బయల్దేరారు.

గాజా మరణాలు 25,000

రఫా(గాజాస్ట్రిప్), జనవరి21: ఇజ్రాయెల్ దాడుల కారణంగా మూడు నెలల్లో 25,105 మంది పాలస్తీనా పౌరులు మరణించగా, 62,681 మంది గాయపడినట్లు ఆదివారం గాజా వైద్య మంత్రిత్వశాఖ ప్రకటించింది. మృతిచెందిన వారిలో మహిళలు, పిల్లలే ఎక్కువగా ఉన్నారని వెల్లడించింది. ఎన్నో మృతదేహాలు శిథిలాల కిందే ఉండిపోయాయని, యుద్ధం కారణంగా వైద్యం అందక భారీ ప్రాణనష్టం జరిగిందని వైద్యశాఖ అధికారి అష్రఫ్ అల్ ఖిద్రా తెలిపారు. భీకర దాడుల్ని కొనసాగిస్తున్న ఇజ్రాయెల్... ప్రస్తుతం దక్షిణ భాగంలోని ఖాన్‌యూనిస్ నగరంతో పాటు సెంట్రల్ గాజాలోని శరణార్థి శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలుస్తోంది.

కేంద్రంలో కాంగ్రెస్ ఉండుంటే..
నాలుగో రోజుకల్లా మణిపూర్ హింస చల్లారేది!

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

కలియాబోర్, జనవరి 21: కేంద్రంలో తమ పార్టీ అధికారంలో ఉంటే మణిపూర్‌లో జరుగుతున్న హింసను నాలుగోరోజుకల్లా నియంత్రించే వాళ్లమని కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. భారత్ జోడో న్యాయ్ యాత్రలో భాగంగా అసోంలో ఉన్న ఆయన ఆదివారం ఓ ర్యాలీలో మాట్లాడారు. "కొన్ని నెలలుగా మణిపూర్ అట్టుడుకుతోంది. కానీ మన ప్రధాని మోదీ ఇప్పటి వరకూ అక్కడికి వెళ్లలేదు. అదే ప్రధానిగా కాంగ్రెస్ నేత ఉండి ఉంటే.. మూడు రోజుల్లోనే అక్కడికి వెళ్లి, నాలుగో రోజు కల్లా హింసను ఆపి ఉండేవారు"అని అన్నారు. ప్రధాని మోదీ కూడా ఆర్మీ సాయంతో మూడు రోజుల్లోనే మణిపూర్ హింసను నియంత్రించగలరని, కానీ బీజేపీ ఆ పని చేయాలనుకోవడంలేదని పేర్కొన్నారు. అసోంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను బెదిరించి వారి గొంతులను నొక్కేయాలని చూస్తోందని, కానీ న్యాయ్‌యాత్రలో కాంగ్రెస్‌కు వారు మద్దతును తెలిపారన్నారు. నాయకులు వస్తారు..పోతారు.. కానీ మనసులో ద్వేషం, అహంకారం నిండినవారు త్వరలోనే కనుమరుగై పోతారని రాహుల్ అన్నారు.

మాల్దీవుల అధ్యక్షుని మొండివైఖరికి
ప్రాణం కోల్పోయిన బాలుడు

భారత్ ఇచ్చిన ఎయిర్‌అంబులెన్స్ వినియోగానికి అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ, జనవరి 21: మాల్దీవుల అధ్యక్షునికి భారత్ పట్ల ఉన్న వైముఖ్యం మాటేమిటోగానీ సకాలంలో వైద్యం అందక ఆ దేశంలో 14ఏళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. భారత్ అందజేసిందన్న కారణంతో ఎయిర్ అంబులెన్స్ వినియోగానికి అనుమతి నిరాకరించడంతో ఆ బాలునికి అత్యవసర వైద్య సేవలు అందలేదు. మాల్దీవుల్లో అత్యవసర సమయాల్లో ఉపయోగించుకునేందుకు భారత్ ఎయిర్‌అంబులెన్స్‌ను ఇచ్చింది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ తయారు చేసిన డోర్నియర్ విమానాన్నే ఎయిర్ అంబులెన్స్‌గా ఉపయోగిస్తున్నారు. భారత్‌తో తలెత్తిన దౌత్యపరవివాదం నేపథ్యంలో ఆ విమానాన్ని ఉపయోగించుకునేందుకు అధ్యక్షుడు ముయిజ్జు అనుమతి ఇవ్వకపోవడంతో అత్యవసర సేవలు అందలేదు. విల్మింగ్టన్ ద్వీపంలోని గాఫ్ అలిఫ్ విలింగిలికి చెందిన ఆ బాలునికి బుధవారం మెదడువాపు, గుండెపోటువంటి సమస్యలు తలెత్తాయి. మాలేలోని ఆస్పత్రికి ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలించడానికి బాలుని కుటుంబసభ్యులు సంప్రదించగా సకాలంలో స్పందన రాలేదు. గురువారం ఉదయం 8.30గంటలకు ఎయిర్ అంబులెన్స్ అందుబాటులోకి రాగా వెంటనే మాలే ఆస్పత్రికి తరలించి ఐసీయూలో చేర్చినా ఫలితంలేకపోయింది. విలువైన 16 గంటల సమయం వృథా అయిందని, అందుకే ప్రాణాలు దక్కలేదని ఆ బాలుని తండ్రి వాపోయారు.

అఫ్ఘాన్‌లో కూలింది
భారత విమానం కాదు

- పౌరవిమానయాన శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, జనవరి 21: అఫ్ఘానిస్థాన్‌లో కూలిపోయిన విమానం భారత్‌కు చెందినది కాదని పౌరవిమానయాన శాఖ స్పష్టం చేసింది. బదాక్షన్ ప్రావిన్స్‌లోని జెబాక్ జిల్లా తోప్‌ఖానా కొండల్లో మొరాకోకు చెందిన ఓ చార్టర్డ్ విమానం కుప్పకూలింది. దీంతో భారత్‌కు చెందిన విమానానికి ప్రమాదం జరిగిందంటూ అఫ్ఘాన్ మీడియాలో మొదట వార్తలు వెలువడ్డాయి. మొరాకోలో రిజిస్టరైన డస్సాల్ట్ ఫాల్కన్ (డీఎఫ్-10) విమానాన్ని ఎయిర్ అంబులెన్స్‌గా నడుపుతున్నారని, థాయిలాండ్‌లోని ఉటపావో ఎయిర్‌పోర్టు నుంచి రష్యా రాజధాని మాస్కోకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పౌరవిమానయాన శాఖ వెల్లడించింది. శనివారం సాయంత్రం గయాలోని ఎయిర్‌పోర్టులో ఇంధనం నింపుకోవడానికి ఈ విమానం ఆగిందని పేర్కొంది. అందులో ఓ పేషంట్ సహా ఆరుగురు ప్రయాణిస్తున్నారని తెలిపింది.

రష్యా ఆక్రమిత డోనెట్స్క్‌పై
ఉక్రెయిన్ దాడి

25 మంది మృతి, 20 మందికి గాయాలు

కీవ్, జనవరి 21: రష్యా ఆక్రమిత ప్రాంతం డోనెట్స్క్‌పై ఆదివారం ఉక్రెయిన్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో 25 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది గాయపడ్డారు. దీని గురించి డోనెట్స్క్‌లో రష్యా ప్రతినిధి డెనిస్ పుషిలిన్ స్పందించారు. ఈ దాడిని ఉక్రెయిన్ చేసిందని ఆయన ధ్రువీకరించారు. గాయపడ్డవారిని సహాయక దళాలు ఆస్పత్రికి తరలించాయని పేర్కొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు చెప్పారు. అలాగే ఆదివారం రష్యాలో ఓ గ్యాస్ ఎగుమతి టర్మినల్‌లో భారీ పేలుడు సంభవించింది. ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడుల వల్లే ఈ పేలుడు సంభవించినట్లు రష్యా ఆరోపిస్తోంది. ఈ దాడిలో ఓ గ్యాస్ ట్యాంక్ పేలి అక్కడ భారీగా మంటలు చెలరేగాయని పేర్కొంది.

అపరిచిత వాట్సాప్ కాల్స్‌తో జాగ్రత్త


- కొత్తగా 'సెక్స్టార్షన్' నేరం జరుగుతోంది.. కేంద్ర హోం శాఖ హెచ్చరిక



న్యూఢిల్లీ, జనవరి 21: వాట్సాప్‌లో పలు రకాల సైబర్ నేరాలు చోటుచేసుకుంటున్నాయని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్ర హోం శాఖ పరిధిలోని నిపుణుల బృందమైన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్డీ) వినియోగదారులను హెచ్చరించింది. పలురకాల సైబర్ నేరాలను ప్రస్తావిస్తూ 8పేజీల సూచనలను విడుదల చేసింది. వివిధ రూపాల్లో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని తెలిపింది. సైబర్ నేరగాళ్లు ఉద్యోగ అవకాశాలు, సొమ్ము పెట్టుబడుల ప్రణాళికల పేరుతో మిస్డ్ కాల్స్, వీడియో కాల్స్ చేస్తున్నారు. మారు పేర్లతో సందేశాలు పంపిస్తున్నారు. మొత్తం కంప్యూటర్‌నే 'హైజాక్' చేసి ఆ వ్యక్తి పేరుతో డబ్బులు సర్దుబాటు చేయాలంటూ మెసేజ్‌లు పెడుతున్నారు. వీటన్నింటికన్నా ప్రమాదమైనది 'సెక్స్టార్షన్' నేరమని హెచ్చరించింది. గుర్తు తెలియని వ్యక్తులు వాట్సాప్ కాల్స్ చేస్తారు. అనంతరం నగ్నంగా ఉంటూ వీడియో కాల్ చేసి మాట్లాడుతారు. ఆ తర్వాత బెదిరించి డబ్బులు గుంజుతారు. దీన్నే సెక్స్టార్షన్‌గా వ్యవహరిస్తున్నారు. వియత్నాం, కెన్యా, ఇథియోపియా, మలేసియా నుంచి ఇలాంటి మిస్డ్‌కాల్స్ వస్తున్నాయని తెలిపింది.

యూపీలో పర్యాటకులు చేసే ఖర్చు
రూ.4 లక్షల కోట్లకు..!

- పన్ను రాబడి 25 వేల కోట్లు పెరగొచ్చు
- రామాలయ నిర్మాణంతో పర్యాటకానికి ఊపు: ఎస్‌బీఐ నివేదిక



న్యూఢిల్లీ, జనవరి 21: అయోధ్యలోని రామ మందిరం, ఇతర పర్యాటక ప్రణాళికలతో ఉత్తర్ ప్రదేశ్‌కు గణనీయమైన లబ్ధి చేకూరుతుందని ఎస్‌బీఐ తాజా నివేదిక పేర్కొంది. ఈ ఏడాది చివరి నాటికి ఏకంగా ఆ రాష్ట్రంలో పర్యాటకులు చేసే ఖర్చు రూ.4 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా వేసింది. అలాగే ఆర్థికంగా రూ.20-25 వేల కోట్ల పన్ను రాబడి పెరుగుతుందని తెలిపింది. కేంద్రం తెచ్చిన తీర్థయాత్ర పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి పథకం (ప్రసాద్) ద్వారా యూపీ గణనీయమైన లాభం పొందుతోందని వెల్లడించింది. యూపీ బడ్జెట్ ప్రకారం 2024 ఆర్థిక సంవత్సరంలో సొంత పన్నుల ఆదాయమే రూ.2.5 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా.. 2022తో పోల్చితే ఈ ఏడాది యూపీలో పర్యాటకులు చేసే వ్యయం రెట్టింపవుతుందని నివేదిక తెలిపింది. 'అయోధ్యలో రామాలయం పూర్తవడంతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన కార్యక్రమాల ద్వారా ఈ ఏడాది చివరి నాటికి యూపీలో పర్యాటకులు చేసే ఖర్చు రూ.4 లక్షల కోట్లు దాటే అవకాశముంది. 2022లోనే దేశీయ పర్యాటకులు రూ.2.2 లక్షల కోట్లు ఖర్చు చేయగా.. విదేశీయులు మరో రూ.10 వేల కోట్లు ఖర్చు చేశారు. దాదాపు 2.21 కోట్ల మంది పర్యాటకులు అయోధ్యను సందర్శించారు' అని నివేదిక వివరించింది.

రామ మందిరాన్ని పేల్చివేస్తానన్న
యువకుని అరెస్టు

- మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసుల అనుమానం

న్యూఢిల్లీ, జనవరి 21: అయోధ్యలో నిర్మించిన రామ మందిరాన్ని ప్రాణప్రతిష్ఠ దినమైన సోమవారంనాడు పేల్చివేస్తానంటూ హెచ్చరించిన యువకుడ్ని బిహార్ పోలీసులు అరెస్టు చేశారు. అతడ్ని మతిస్థిమితం లేని వ్యక్తిగా అనుమానిస్తున్నారు. అరారియా జిల్లా బలువా కలియాగంజ్‌కు చెందిన ఇంతెకాహబ్ ఆలం (21) శుక్రవారం పోలీసు హెల్ప్‌లైన్ అయిన 112కు ఫోన్ చేసి తన పేరు చోటా షకీల్ అని, దావూద్ ఇబ్రహీం అనుచరుడునని చెప్పుకొన్నాడు. అయోధ్య రామ మందిరాన్ని పేల్చివేస్తానని హెచ్చరించాడు. వెంటనే రంగంలో దిగిన పోలీసులు మొబైల్ నెంబరు ఆధారంగా అతడి ఆచూకీని గుర్తించారు. శనివారం రాత్రి అరెస్టు చేశారు. ఆ ఫోన్ అతడి తండ్రి పేరున ఉన్నట్లు తేలింది.

నాకు న్యాయం చేయండి..


ఉద్యోగం పోగొట్టుకున్న ఏఆర్ కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థి విజ్ఞప్తి

పంజాగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమం సందర్భంగా జై తెలంగాణ నినాదం చేసినందుకు ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురై ఉద్యోగాన్ని పోగొట్టుకున్న తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఎన్.సురేందర్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన తన గోడు వెళ్లబోసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో పోలీస్ రిక్రూట్‌మెంట్ సందర్భంగా ఏఆర్ కానిస్టేబుల్‌గా తాను ఎంపికయ్యానని, కర్నూల్‌లో శిక్షణ సమయంలో జై తెలంగాణ అంటూ నినాదాలు చేసి అధికారుల ఆగ్రహానికి గురై ఉద్యోగాన్ని పోగొట్టుకున్నానని తెలిపారు. తెలంగాణ కోసం రాజీనామా చేస్తున్నానని రాస్తే అడ్డుకుని వేరే విధంగా తనతో రాజీనామా లేఖ రాయించుకున్నారన్నారు. ప్రస్తుతం తన పరిస్థితి దయనీయంగా ఉందని కన్నీటి పర్యంతమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో న్యాయం జరుగుతుందని ఆశించానని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో న్యాయం చేయాలని అప్పటి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులకు తన గోడు వెళ్లబోసుకోగా వారు అప్పటి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డికి లేఖలు రాశారన్నారు. అయినా ఏ స్పందనలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మానవతా దృక్పథంతో తనకు న్యాయం చేయాలని కోరారు. ఓయూ జేఏసీ, తెలంగాణ ఉద్యమ విద్యార్థి నాయకులు శంకర్, దుర్గం వెంకన్న, పాండురంగ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యమకారుల వ్యతిరేక ప్రభుత్వమని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం వచ్చిందన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు సమ్మెకాలం నాటి బకాయిలు చెల్లించాలి

- రవాణా మంత్రి పొన్నంకు ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ వినతి

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఆర్టీసీ ఉద్యోగులకు సకల జనుల సమ్మె కాలం నాటి బకాయి వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ దొంతు ఆనందం కోరారు. ఈ మేరకు రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన వినతిపత్రం సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగులకు పరిమితి పేరుతో సమ్మెకాలం నాటి వేతన బకాయిల మొత్తాన్ని నిలిపివేయడం దారుణమని పేర్కొన్నారు. సకల జనుల సమ్మె, వంట- వార్పు, మిలియన్ మార్చ్, సాగర హారమ్ రాస్తారోకో వంటి పలు ఉద్యమాల్లో తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు ప్రధాన భూమిక పోషించినట్టు ఆనందం గుర్తు చేశారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు, ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా సకల జనుల సమ్మె కాలం నాటి వేతన బకాయిలను పరిమితుల పేరిట నిలిపివేయకుండా అర్హులందరికీ చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ పాలక మండలిలో రిటైర్డ్ అధికారులకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అక్రమ రవాణా నియంత్రిస్తే ఆర్టీసీ ఆదాయం రూ.800 కోట్లకు పెరుగుతుందని ఆనందం పేర్కొన్నారు. ఆర్టీసీకి అదనంగా మూడు వేల బస్సులను సమకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు.



వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



ఇంకో అబద్ధం

ఆ పుస్తకం చదవడమెందుకు?
ఈ సినిమా చూడడమెందుకు?
దొరికిన పదాలకు అర్థాలు వెదుకుతున్నానా,
దొరికిన అర్థాలకు పదాలు తొడుగుతున్నానా?

పొడిచే పొద్దులలో, పొద్దును మూసే మబ్బులలో,
పౌరాణిక భూముల లోని వాగ్రత్త సమాధులలో,
సమాధుల తల శిలల మీద గాఢలైన ఘోరాలలో,
నేను వెదికే బద్ధాలలో, బద్ధాలు విస్తరించే కొద్దీ
పల్చబడి అస్తమించే ఒక్కొక్క దిన-కరాలలో,
రోజూ సూర్యకిరణాల్ని తాగి భళ్లున వాంతి
చేసుకుంటున్న అతి దీనోచిత నక్షత్రాలలో,
మృతం అయినందుకే ఏదైనా అమృతమని
భాష్యించే మహా మాయక రాజకీయాలలో,
'నానోమీటర్ల'లో మాత్రమే కొలతలకు అందే
రాజకీయ కవితల్లోని అబద్ధాల తొడుగులలో,
అతి అత్యతి పల్చని పదాల రేకుల మీద
ప్రొగ్రాములు రాసే సరికొత్త 'ఇ.యూ.వి.
లితోగ్రఫీ'లను ఎవరు కొనగలరో వారికి
ఇంటలెక్చువల్ పేటెంట్లు అమ్ముకునే విజ్ఞానులు
వదులుకునే మానాభిమానాల్లో, అమ్ముకోదగినది
ఏదో ఒహ పని చేయకుండా ఉండలేని
బానిస-బౌద్ధిక శ్రమ జీవన సుందరమైన, లోనికి
తోకలు ముడుచుకున్న వా-నరుల హస్తాలలో

ప్రియమైన పాఠకుడా నేనేమి వెదుక్కుంటున్నానో
నాకు తెలియదు. పేరు మరిచిపోయిన పాత ఈగ
స్నేను. ఊరికే అలుకుతున్నాను మన ముంగిలిని
ఎండిపోయిన పేడను కాసిని నా కన్నీళ్లతో తడిపి

ఇన్ని వైఫల్యాలూ, ఇన్నిన్ని దుఃఖాల తరువాత
నేను వెదుక్కుంటున్నది ఏమిటో
పాఠక మహాశయా, ప్లీజ్, నువ్వైనా చెప్పగలవా
పొదుపు కథను నొప్పి తెలీకుండా విప్పగలవా?

■ హెచ్చార్కె

(నానోమీటర్ = 0.000000001 మీటర్.
ఇ.యూ.వి. = ఎక్స్‌ట్రీమ్ అల్ట్రా వయొలెట్ లితోగ్రఫీ: 13.5 నానోమీటర్ల వేవ్‌లెంగ్త్ కలిగిన కాంతికిరణంతో అత్యంతపల్చని సిలికాన్ వేఫర్ల మీద వ్రాసే టెక్నాలజీ.)

'అక్షరం' పురస్కారం

అక్షరం లిటరరీ ట్రస్ట్, కర్నూలు ఇస్తున్న అక్షరం లిటరరీ అవార్డ్‌ను 2024 సంవత్సరానికి ప్రసేన్ స్వీకరిస్తారు. పురస్కార ప్రదాన సభ జనవరి 28 ఉ.11గంటలకు మాంటిస్సోరీ హైస్కూల్, ఎ-క్యాంపు, కర్నూలులో ఉంటుంది.

జి. వెంకటకృష్ణ

'చిత్ర కళా ప్రపంచం'

ఎల్.ఆర్. వెంకటరమణ రచించిన చిత్రకళా వ్యాసాల పుస్తకం 'చిత్ర కళా ప్రపంచం' ఆవిష్కరణ జనవరి 27 సా.6గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం, షోయబ్ హాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో రావూరి సురేష్‌బాబు, ఏనుగు నరసింహారెడ్డి, రూప్ కుమార్ డబ్బీకార్, ఎస్. రఘు తదితరులు పాల్గొంటారు.

పాలపిట్ట బుక్స్

'అనంత' సహృదయత

హృదయ, బుద్ధి ఔన్నత్యాలూ, జ్ఞానవివేకాలూ మేళవించిన లేఖలు వాటిని అందుకొనే వ్యక్తుల సంక్షుభిత హృదయాలకు ఊరటనిస్తాయి. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ లేఖలు ఆపాతమధురాలు, ఆలోచనామృతాలు. అనంతకృష్ణుల వారు 20వ శతాబ్దం మొదటి దశకం నుంచి నలభై ఏళ్లపాటు మైసూరులో సంస్కృత పండిత ప్రకాండుల మధ్య, కర్ణాటక సంగీత కోవిదుల నడుమా జీవితం గడిపి, సాహిత్య సంగీతాల సంస్కారాల్నీ మాధుర్యాల్నీ రక్తగతం చేసుకొన్నారు. అందువల్లే శర్మగారి సాహిత్య రచనల్లో భావ ఔదాత్యమూ, సంగీత రచనల్లో జీవన పరిమళమూ గుబాళిస్తాయి. రాళ్ళపల్లి వారి విమర్శనా రచనల వైశిష్ట్యం గురించి సాహిత్య ప్రియులకు కొత్తగా చెప్పవలసినదేమీ లేదు. అనంతకృష్ణుల వారి లేఖల్లోని రామణీయకాన్ని, సుకుమార హాస్యాన్ని, జీవన సౌందర్యాన్ని దర్శించే సువర్ణావకాశం పాఠకులకు కలిగినట్లు లేదు.

రాళ్ళపల్లి వారు మానవీయ విలువల్ని ఆరాధించటమే కాక సాధ్యమైనంత వరకు ఆచరణలో పెట్టినారు కూడా. తమ గురువైన కట్టమంచి రామలింగారెడ్డి రాసిన 'నవయామిని' కావ్యాన్ని అందుకొని ఆయన మైసూరు నుంచి 15-10-1947న రాసిన లేఖలోని ఈ వాక్యాలు ఆయన ఉదాత్తతకు ఇచ్చిన అపారమైన గౌరవాదరాలు వెల్లడి అవుతాయి. "నాయందు ఎప్పటి వాత్సల్యముతో తాము పంపిన 'నవయామిని' కావ్య కుసుమ మందినది. ధన్యుడను. ఇంతకుముందే 'భారతి'లో దానిని చదివి, ఇన్నాళ్లకు మరల మీ సహజధర్మములలో గొప్పది యగు కవిత్వమునకు వచ్చితిరి గదా యని ఆనందాశ్రువులను విడిచి యుంటిని. నా అనుభవము నొక్కమాటతో చెప్పవచ్చునేని తిక్కన్నగారి భారతేక్షువును తుదముట్ట రసించిన వారికి గూడ- ఈ చిక్కదనము, చక్కదనమును లభించునవి గావు. ఈ మహామహుని గొప్పతనము నందలి యేక దేశము నేననుభవించి ధన్యుడనైనది మీరిచ్చిన సహవాస భాగ్యము వలననే. కావున ఆయనకు మీకును గల ఆధ్యాత్మిక ప్రణయమును నేను గొంత యెఱుగుదును.

" 'బిల్హణీయ మందలి విషయము మంచిది కాదు' అనునది సత్యమైన ధీర వాక్యము. మీవంటి పరిణత ప్రజ్ఞులు మాత్రమే చెప్ప గలిగినది; చెప్పవలసినది. ఆ నాయికా నాయకుల నిద్దఱిని పవిత్ర హృదయులనుగా భావించి, భావింప జేసితిరి. నీతి – ముఖ్యముగా -- కామనీతి ఎంత స్వచ్ఛందముగా నున్న నంత మేల్మిగా భావించుట ఆధునిక కవులలో పలువురికి సహజమైనది. ఇట్టి కాలములో పక్వమైన ధీరత గలవారు తప్ప ఇతరులు ఈ రచనలు చేయలేరు. ఇందుకై నాహార్దమైన సంతోషమును తమకు కానుక పెట్టుచున్నాను." ఉదాత్తమైన మానవీయ విలువల్ని ప్రతిపాదించిన ఓ ప్రఖర విమర్శకునికి మరో ప్రబుద్ధ శిష్య విమర్శకుడు అర్పించిన వినమ్ర నివాళి ఇది.

అనంతకృష్ణుల వారిని కొందరు విద్వాంసులు 'అభిరుచి విమర్శకులు' అని అన్నారే కాని వారు జీవితంలోని రాగద్వేషాల్ని, సుఖదుఃఖాల్ని, మిట్టపల్లాల్ని సూక్ష్మంగా పరిశీలించిన, వివేచించిన వివేకవర్ధనులే. కర్ణాటకలోని బళ్ళారి జిల్లా హోస్పేట నివాసి రాజగురు ఏటూరు తోళప్పాచార్యుల వారితో శర్మగారికి జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు మనకాశ్చర్యాన్ని కలిగిస్తాయి. రాళ్ళపల్లి వారి సాంఘిక, రాజకీయ చింతన ఈ లేఖాంశంలో సుస్పష్టమవుతుంది - "నెహ్రూ కాలంలో నాస్తిక దావానలం అంటుకొన్నదన్నారు. ఆయనకు అధికారం రావడం వల్ల అట్లు

> రాళ్లపల్లి వారి మాటల్లో మాధుర్యం వుంది, మృదుత్వం వుంది. అప్పుడప్పుడు అక్కడక్కడా మెరుపు తీగలా మెరిసే ధ్వని కూడా వుంది. సహృదయత, స్నేహశీలత, వాత్సల్యం, సద్విమర్శ ఆయన మాటల్లో, రాతల్లో సంగమించి వారి లేఖలు చదువరులకు మనోల్లాసం, మనోవికాసం కలిగిస్తాయి.

జరిగింది. కాని రామలింగారెడ్డి వంటి ప్రతిభావంతులైన నాస్తికులు, స్వార్థపరులు మనదేశంలో అలికిన పంకం అంతా యింతా కాదు. దానికి లోబడిన నా పూర్వ వయస్సులోని చిత్తవృత్తిని తల్చుకుంటే నాకిప్పుడూ ఒళ్ళు జలదరిస్తుంది. సిగ్గుపడుతూ వుంటాను. నెహ్రూ ప్రతిగా రెడ్డి వచ్చివుంటే మన దేశస్థితి యేమైపోయియుండునో ఊహించుటకూ భయంగా వుంది. గాంధీ గారి వాసన కొంతకు కొంతైనా నెహ్రూకు తగిలి కట్టు పరిచిందనుకోవలసియున్నది.


" 'రామరాజ్యము' ఒకటి వాల్మీకి గ్రంథానికి వదలి చూస్తే, రాజకీయాలూ ఎప్పుడూ ఇట్లే సాగుతావుండినవనిపిస్తుంది. కనుకనే ధర్మము - నీతి వేరుపరిచిరి పెద్దలు. నీతి రాజులది. తాత్కాలికోపద్రవాలను సామదానాదులతో అణచేది దానిపని అంతే. మనుష్యుని సామాన్యమైన యోగక్షేమాలను నిర్ణయించి నడిపేది ధర్మం. అది రాజులో, మంత్రులో, సేనాపతులో చేయగలిగిన పని గాదు. ఫలాపేక్ష లేక, భగవత్ప్రీతిగా ప్రజలకు నిర్విరామంగా ధర్మాన్ని బోధించి, మనస్సులను మార్చే పని రాజకీయాదులను తాకని వ్యాసాదుల వంటి వారిది. మనలో మఠాలు, స్వయమాచార్యులు మొదలైన సంస్థలందుకై యేర్పడినవి. కాని ఆ సంస్థలన్నీ సంస్థానాలై రాజులకన్న అన్యాయముగా అధర్మముగా ప్రవర్తించి పాడైనవి. ...భగవత్ స్వరూపము వలె ధర్మము గూడ వైయక్తికంగా, సాంఘికంగా దినేదినే మన హృదయంలో పెరిగి ప్రసరించవలసిన తత్వమునకు తీరదు. 'ధర్మోధర్మ విదుత్తమః' అని ఆయనకే ఆ బరువంతా మోపి మనం సాధ్యమైనంత ప్రశాంతంగా కాలం గడపవలసి వున్నాము. మన చేత ఏమీ జరగదనే నమ్మకం దినే దినే క్షణే క్షణే పెరుగుతూ వుంది. ఉండనీయండి." (తిరుపతి 12-10-1969)

కాలం గడిచే కొద్దీ శర్మగారికి సమాజంలో, దేశంలో స్వార్థం పెరిగి, చాలామందిలో రాముని సేవ కంటే ఆత్మారాముని సేవే ముఖ్యమై కూర్చుంది, అన్న అభిప్రాయం బలపడుతూ వచ్చింది. సాంఘిక పరిస్థితులు మరింత దుర్భరంగా తోచసాగాయి. అనంతకృష్ణుల వారు సన్మిత్రులు శ్రీమాన్ తోళప్పాచార్యుల వారితో ఈ విషయమే ప్రస్తావించారు - "బైట రాజ్యం, సంఘం రెండూ అవివేక భారంతో వట్టి ద్రవ్యార్థమైన జీవితంలో అల్లకల్లోలంగా వుండే కాలంలో మనమున్నాము. ఎక్కడా త్యాగం కాని, లోక క్షేమ దృష్టి కాని లేక, ఎవరినీ నమ్మి వుండడానికి వీలులేక, యే నిమిషంలో ఏమి మూడుతుందో అని శంకిస్తూ కాలం గడపవలసి వుంది. పురాణ కథలు నిజమైతే మళ్ళీ కృతయుగం పుట్టించడానికి కల్క్యవతారం దిగే దానికి ఇంతకన్నా మంచికాలం వుండదు." (బెంగళూరు 11-10-1974)

రాళ్లపల్లి వారి విమర్శ ప్రాచీన సంస్కృతాంధ్ర కావ్య నాటకాలకే పరిమితం కాలేదు. ఆధునిక రచనలకు పీఠికలు రాసినా, అందుకున్న రచనల గురించి ముచ్చటైన మూడు మాటలు రచయితలకు పంపినా ఆయన చూపు సమకాలీన సాంఘిక పరిస్థితుల వైపు తప్పనిసరిగా మళ్లేది. ముఖ్యంగా పెద్దలతో, పిన్నలతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు సమకాలీన సమాజపు పోకడల్ని నిశితంగా పరిశీలించేవారు, తమ అభిప్రాయాల్ని నిర్భయంగా వెల్లడించేవారు. విషమ పరిస్థితులు దాపురించినప్పుడు వాటిని ఎదుర్కోలేక, నిస్సహాయులై దేవుడికి దండం పెట్టి నిట్టూర్చేవారు.

రాళ్లపల్లి లేఖల్లో మనకు ఆయన ప్రతిపాదించిన, అనుసరించిన విమర్శనా సూత్రాలు స్పష్టంగా దర్శనమిస్తాయి. ప్రసిద్ధ విమర్శకులైన నాగళ్ళ గురుప్రసాద రావుకి రాసిన లేఖలో రాళ్లపల్లి వారి విమర్శనామార్గం బోధపడుతుంది - "నా విమర్శ లేశములను గూర్చి మీరు గొప్పగా భావించితిరి. కృతజ్ఞుడను. నా దృష్టిలో, నా వ్యవహారములో విమర్శ ఒక శాస్త్రము గాదు. ఆ దృష్టితో నా విమర్శలు నేనెప్పుడును సాగింపలేదు. నాకు తోచినది అభిమాన - సంప్రదాయములకు పూర్తిగా లొంగక స్పష్టముగా వినతితో చెప్పవలెనని నా ప్రయత్నము. ఉర్ఫిటడ ఛిటజ్జీజీఛిజీటఱు జీట్పు౹ౖౌౌఙజీౌఙజుౖ౹ఇజిడఅని ఒక తత్వదర్శి అన్నాడని విన్నాను. నా విషయమున అది సరియని యంగీకరిస్తాను. ఇందు ప్రాత-క్రొత్త యను - రాగవిరాగములుండవు. ఉండినను దుర్బలములుగా ఉండునంతే.

"విమర్శకత్వము గూడ కవిత్వము వంటిది. ప్రాతకొత్త రీతుల పులుముడులు నేటి కవిత్వములో ఎంత కలవో విమర్శలందును అంతకు తక్కువ లేవు. కనుక భవభూతి వాక్యమును మరిచిపోని మీ వంటివారికి 'మన మెక్కడకు పోవుచున్నాము?' అను నిర్విణ్ణపు ప్రశ్న రానక్కరలేదు. 'నేనెక్కడ పోవుచున్నా'నని ప్రశ్నించుకొన్నచో చాలును. అది మన సద్గతిని సాగించును. సాహిత్య వీధు లందును 'యశసేరర్థకృతే' అను ఫలదృష్టియే నాటికి నేటికి పలువురిని నడపించు రథము. అది సహజము. సాధ్యమైనచో మనలను మనము వేరుత్రోవల సాగించుకోవచ్చును."



రాళ్లపల్లి వారు చెప్పినట్లు రచయితలు చాలామంది పేరు ప్రసిద్ధుల కోసమో ఆర్థిక లాభం కోసమో రచనా వ్యాసంగం చేసిన, చేస్తున్న మాట నిజమే. నేటి రచయితలు, విమర్శకులు చాలా మంది నుదుటిపై నానారకాల లేబిళ్లను తగిలించుకొని రచనా వ్యాసంగం చేస్తున్నా, నిమగ్నత, నిబిడతలు కనపడుతున్నా నిబద్ధత మాత్రం వాళ్ల రచనల్లో హుళక్కి. ప్రభుత్వానికీ వ్యవస్థకూ విరుద్ధంగా పోరాడుతున్నామని ఘోషిస్తూ వాదాల డాళ్లను అడ్డం పెట్టుకొని అకాడమీల అవార్డుల్ని, ప్రభుత్వ మిచ్చే జీవనసాఫల్య పురస్కారాల్ని మూటకట్టుకోవడం చూస్తూనే వున్నాం.

అనంతకృష్ణుల వారు తమ అభిప్రాయాలు ప్రకటించేటప్పుడు చాలా వరకు నిక్కచ్చిగానే, నిజాన్నే వెలువరిస్తారు. ఏ కొన్ని సందర్భాల్లోనో ధ్వనిని వూతకర్రగా తీసుకుంటారు. అక్కడ కూడా సత్యం దాగకుండా ఆకుచాటు పిందెలా తొంగి చూస్తూ వుంటుంది. ప్రసిద్ధ శతావధాని సి.వి. సుబ్బన్న గారికి రాసిన ఈ వుత్తరం శర్మగారి ఋజుమార్గాని సాక్షి - "అవధాన విద్య అనేకులకు ఆకర్షకమైన వినోదమే. అందులో అడుగుపెట్టిన తర్వాత పైకెత్తుటకు గజప్రయత్నమే కావలయును. జనులు ఎంతో విశ్వాసము తోనే అట్లు ఎత్తనీయరు. ఇది యెఱిగియే మీకు నేను తీవ్రముగా వ్రాయుట. భావమందు, అర్థములందు, శబ్దములందును పునరాలోచన కవకాశమియ్యక పని పూర్తి చేయించు వాడుక కవికి ఆశుకవితావధాన వ్యాసంగపు ఫలమై పరిణమించును. తిరుపతి వేంకటేశ్వరుల వంటి ప్రతిభావంతులగు పండితులు గూడ దీనికి తప్పలేదు గదా, అనగా మీ ప్రతిభ తక్కువయినదని కాదు. కవితాకళ ఆ చౌక రకపు వినోదములతో పర్యవసింపరాదని నా యాశ." (తిరుపతి : 25-1-1962)

శర్మగారు సుసంస్కృతులూ, సుకుమార స్వభావులూనూ. పెద్దల పట్ల గౌరవం, పిన్నల పట్ల స్నేహ సౌహార్ద భావం గల మధుర స్వభావులు. తుమ్మల సీతారామ మూర్తి చౌదరి కావ్యం 'ఆత్మార్పణము' అందుకొని వారికి రాసిన లేఖలోని కొన్ని వాక్యాలు - "ఎందఱో, ఎన్ని విధములనో దాని నిది వఱకు వ్రాసిరి. మీరిప్పుడా కథకు చక్కని మెఱుగు లిచ్చితిరి. మీకు సంస్కృతాంధ్రముల యందు ధారాళమైన శైలి కలదు, మీ గ్రంథమును జదువునప్పుడేదో యొక ప్రాతకాలపు ప్రబంధమును చదువుచున్నట్లు భావము కలుగును. తొడకు లేని శుద్ధమైన శైలిగల మీరు ఇక మీద నాంధ్రసాహిత్యమునకు నెంతయో పరిపోషమునీయగలరు." (మైసూరు 15-7-1929) ప్రతిభను పురస్కరించే సహృదయత రాళ్లపల్లి వ్యక్తిత్వానికి పుట్టుసొమ్మేకాని పెట్టుసొమ్ము కాదని పై మాటలు చెప్తాయి.

బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి ఆహ్వానం మేరకు టీటీడీ సాహిత్య సమావేశంలో పాల్గొనేందుకు తనకు సెలవు లేదనీ, సెలవుల్లో అయితే సంతోషంగా రాగలననీ చెప్తూ రాళ్లపల్లి వారు రాసిన ఈ మాటలు వారి వ్యక్తిత్వ గరిమను చాటుతాయి. - "నేనెవరికీ పూజారిగా ఇది వరకూ బ్రదుక లేదు. ఇప్పుడా ఆగమాన్ని నేర్చుకోలేను." (మైసూరు. 16-3-1949)

శర్మగారి రాతల్లో గుణదోషాల చర్చ సంయమన దృష్టితో దర్శనమిస్తుంది. వారు ముఖ్యంగా విమర్శకులు. వారు రాసిన కవిత్వం తక్కువే అయినా, అందులో భావరామణీయకం, అక్షరరమ్యత ఎక్కువే. ఆయన గద్యంలో పలుచోట్ల పద్యపరిమళం, సౌకుమార్యం మనస్సుకు ఇంపు కలిగిస్తాయి. మిత్రులైన కుంటిమద్ది శేషశర్మకు 'గాథాసప్తశతీ సారం' ప్రతి పంపుతూ రాళ్లపల్లి వారు తిరుపతి నుంచి 6-4-1964న రాసిన లేఖలోని ఈ వాక్యాలు చూడండి - "ఈ దినము నా 'సప్తశతి' ప్రతి యొకటి మీకు పంపినాను. ఈ గజగర్భము ఇంత కాలానికి ఈ శశ ప్రసవమును సాధించినది," అని రాస్తారు. ఏనుగు 22 నెలల పాటు గర్భం ధరించిన తర్వాత ప్రసవిస్తుందట. ఏనుగు కడుపున ఏనుగే పుట్టాలి కదా. శర్మగారు 'సంపూర్ణ శాలివాహన గాథాసప్తశతి సారము' ముగించేందుకు సుమారు నలభై ఏళ్ల సుదీర్ఘ కాలం పట్టింది. మరి ఆ రచన గున్న ఏనుగు కావాలి కదా? కాని రాళ్లపల్లివారు సృష్టించింది సుకుమారమైన, సుందరశోభితమైన కుందేలును. 'వాక్యమ్ రసాత్మకమ్ కావ్యమ్' అంటే ఇదేనేమో!

రాళ్లపల్లి వారు ఏదైనా ఓ విషయం గురించి తనకు తగిన సాక్ష్యాధారాలు పుష్కలంగా లభించినప్పుడే అభిప్రాయాల్ని ఖరాఖండిగా వ్యక్తం చేస్తారు. లేకపోతే 'నాకు తెలిసినంత వరకు' 'నామటుకు తోచినట్లు' అని అంటూ తటస్థంగా వుండిపోతారు. అంతేకాని హద్దు మీరిన స్వభాషాభిమానాన్ని కాని, అభిప్రాయాన్ని కాని ప్రకటించరు. డా. కోవెల సంపత్కుమారాచార్యగారి 'తెలుగు ఛందోరీతులు' గ్రంథంపై తమ అభిప్రాయం కోవెల వారికి తెలుపుతూ, విమర్శకులు కవుల దేశకాల పరిస్థితుల గురించి లోతైన అధ్యయనం చెయ్యకుండా వూహించి తమ అభిమతం తెలుపడం సమంజసం కాదంటూ ఇలా రాస్తారు - "తెలుగు కవి పద్మడును, కన్నడ కవి పద్మడును ఒకడే యను కొనుట (పుట-42) నాకు వట్టి నిరాధారాభిమానముగా తోచుచున్నది. ఆ యభిప్రాయము మనమెంత మరచిన నంతమేలు."

రాళ్లపల్లి వారి లేఖల్లో కనపడే భావసౌజన్యం, భాషా సౌకుమార్యాల మణికాంచన సంయోగం పాఠకుల్ని మురిపిస్తుంది. ఆత్మీయ మిత్రులైన కలుగోడు అశ్వత్థరావుగారు తమ రచనలకు పీఠిక రాయమని పదేపదే బలవంత పెట్టినప్పుడు శర్మగారు ఓ లేఖలో సున్నితంగా మందలిస్తారు. ముద్దుపలుకు ముక్కు తిమ్మన్న మధుర ప్రబంధం 'పారిజాతాపహరణము'లోని పంక్తులు జ్ఞప్తిక తెచ్చుకొని "మెత్తని కినుక తోడ గౌరవ మెనసెడి వాక్యమ్ములతో" శర్మగారిలా రాశారు- "పీఠికలు - అభిప్రాయాలు ప్రకటించుట యందు మీకును నాకును ఐకమత్యము కుదరదేమో! మీ వంటి స్వతంత్రులు, పారమార్థిక చింత గలవారును దానికి లొంగవలసిన పనిలేదు. ఇది మరుగు లేక పలుమారు చెప్పినాను. కాని మీ మనస్సును మార్చలేక పోయినాను." (తిరుపతి, 3-11-67)

రాళ్లపల్లి వారి మాటల్లో మాధుర్యం వుంది, మృదుత్వం వుంది. అప్పుడప్పుడు అక్కడక్కడా మెరుపు తీగలా మెరిసే ధ్వని కూడా వుంది. సహృదయత, స్నేహశీలత, వాత్సల్యం, సద్విమర్శ ఆయన మాటల్లో, రాతల్లో సంగమించి వారి లేఖలు చదువరులకు మనోల్లాసం, మనోవికాసం కలిగిస్తాయి. వారి వ్యక్తిత్వం, కృతిత్వాలను మనోజ్ఞంగా చెప్పాలంటే సి. నారాయణ రెడ్డి గారి వశ్యవాక్కు కంటే నాకు మరొకరి మాటలు స్ఫురించవు:

"మతము వైష్ణవము; అభిమతము సుందర శివము
పలుకులో మార్దవము; తలపులో ఆర్జవము
ఆర్ద్రతకు అతని నయనాంచలమ్ములకు ముడి
ఔచితికి అతని మత్యంతరాళమ్ము ఒడి."

■ ఘట్టమరాజు
☏ 99640 82076



కాలం

శీలమంటే కాలమూ - ఆ
కాలమది విశాలమూ
కవిని కంటది కాలమూ - ఆ
కవిత కల సువిశాలమూ
ప్రకృతి ప్రణవాగ్ని క్రీడల
ప్రాణికోటికి పగలురేయది
తర్కమేదైతేమి ఇలపై
తత్వమది తా నెరుగకుంటె...

కవియు అనగ పొద్దుపొడుపు
పొద్దుతిరుగుడు పూలు కవులు
చెప్పడమే ఎన్నేళ్ళ ధరపై
చేయడం కొంతైన ఉండదు
కాంత కనకము భ్రాంతి లోబడి
కాలిపోదురు నేల పైన
మధుపమది పరుగెత్తి పూల
మధుకరమును సేకరించి
లోకహితమై వెలుగు దిశలా
లేకితనమది ఎలా నేలా...

రాజులను కీర్తించే కవులు
రాలిపోయిరి ఎప్పుడో నిట
రాణులను కొనియాడె కృతుల
రాసలీలల రాగ మాగెను
కన్నరా మా అన్నమయ్యల
రాగయోగుల త్యాగరాజుల
రాములోరినె ఎక్కిరించిన
రామదాసుని రచనలేమది
రాచకొండను ధిక్కరించిన
రాజులకే కవి రాజు పోతన...
ధూర్జటి కవి కంఠమున ముక్కంటి
మంటల గంటమేమది
వీరవీగేకాలమది
చిరైత్తిదూకిన సింహగర్జన
రాజులైతే నేమి ఇల
రారాజులైతే నేమి కవికి
అమ్మజూపను కదరా అమ్మను
ఇమ్మహిని ఉన్నంత కాలం
సానులతో సరసాల ఇల
మొగసానినసలే కాదు నేననే...

కాసుకోసమె కవిత దాసుల
వేషమది వేయేళ్ళ కాలం
కిరీటమని పేరెత్తే కవులకు
కీర్తియన్నది ఎంత కాలం
రాజ్యహింసల రక్తపాతపు
రాజ్యమే కొందరికి గొడుగు
రాజు నీడన బ్రతికె కవులకు
రగిలె రచనల రాదె నుడుగు
కాలమునే శాసించే కవికి
వేలమా నిట వెలిగె రవికి...

■ అందెశ్రీ


ఎనకబడ్డోల్ల బతుకు కతలు

ఎండ్లూరి సుదాకరయ్య గోరు కొందరు పెద్ద మడుసులు కుట్ర జేసి కులం పేరుతో ఊరి శివరకు నెట్టేసిన ఎనకబడ్డ జాతిలో పుట్టిండు. సిన్నప్పుడే ఆకలి రుసి తెలుసుకున్నడు. అగసాట్లు పడే సదూకున్నడు. పెద్ద సదూలే సదివిండు. ఎన్నెన్ని సురుకులు తగులు తుంటే ఓర్సుకోని సదివిండో గానీ శానా కసితో సదివిండు. గొప్ప కొలువు గూడా సంపాయించిండు. పిల్లోడిగా ఉండకాన్నుంచే ఆ అయ్యకు అచ్చర మంటే బో పేనం. ఏడో కలాసు సదివేతప్పుడే మసిబొగ్గుతో గోడల మీన కయితలు రాసేటోరంట. తోటి సావాసగాల్లు ఆయన కైతల్ని తెగ మెచ్చుకొని బుజాల మీన తువ్వాల గప్పేటోల్లంట. ఇంగ అన్నుంచి యీలు సిక్కినప్పుల్లా సుదాకరయ్య కైతలు, కతలు రాత్తానే ఉండు.

అట్టా ఆయన రాసిన బొక్కుల్లో ఒకటి 'మల్లెమొగ్గల గొడుగు'. ఈ కతలన్నీ మాదిగ పల్లె బతుకుల్ని సూపెట్టేయే. వోరు పుట్టి పెరిగిన ఊరు రావికుంటపల్లెంట. ఆడ ఆయన బందూలు, ఇరుగుపొరుగుల బతుకుల్లోని కట్టాలు, అవమానాలు, ఆకలి బాదలు ఈ కతల్లో కనబడతయి. పెకాశం జిల్లాలోని కనిగిరి సుట్టుపక్కల సదూలేని మట్టి మనుసుల బాసను ఏం మార్సకుండా, రంగులెయ్యకుండా వున్నది ఉన్నట్టు రాయడం ఈ కతల్లో పత్తేకం. వాటిల్ల ఒక్కో కత సదూతుంటే.. ఎండు తునకల్లో గోగాకేసి మసాలా ఎట్టి వండుతున్నట్టు గుమగుమ లాడుతుంటది. ఆ అయ్య రాసిన ఒక్కో కత ఇంటుంటే.. ఏడి ఏడిగా కమ్మకమ్మగా ఒక్కో ముద్ద గొంతు దిగుతున్నట్టే ఉంటది.


ఈ కులపిచ్చి యవ్వారం నిన్నటిదో మొన్నటిదో గాదు. ఇప్పటికీ అదే నడుత్తుంది. బూమికి, ఊరికి దూరమై వెలివాడల్లో మగ్గుతుంది. "ఇంగెక్కడి కులం? ఎప్పుడో బొయింది" అనే పెద్ద మనుసులంతా ఒక్క పాలి మా పల్లెల్లోకి వొచ్చి తొంగి సూడండి. మా బతుకుల్లోకి వొచ్చి విశారించండి. మా అవమానాలు, ఆకల్లు, కన్నీలు, మీకు కొత్త నిజాలు సెప్తయి. వేల ఏండ్లుగా సాగుతున్న నిశిద్ధ చరిత్ర కొత్త రంగు పులుముకొని పలకరిత్తది. ఊరి సివర్న వుండే మా గుడిసెల్ని దీసకపోయి మీ ఇల్ల పక్కన వెయ్యండి. మా పిల్లలకు మీ పిల్లలతో లగ్గం సెయ్యండి. అంబేద్కరయ్య సెప్పినట్టు కులాంతర వివాహాలు జరిగితేనే కులం బొయినట్టు. అందుకు మీ పెద్ద మనసులు ఒప్పుకుంటయా? ఆలోసన సెయ్యండి.

ఈ పుత్తకంలో ఏదో ఒక్క విసయం గాదు. అబాగ్యుల దుక్కము, సంతసము, పౌరుశము, పట్టుదల, బలయీనత, ఆశ్యము.. ఇట్టాంటి గునాలు అన్నీ సెప్పుకొచ్చిండ్రు. ఈటిల్లో సగం కతలు డప్పు సుట్టూ సెప్పు సుట్టూ తిరుగుతయి. మాదిగల సారం, సారాంశం పెకటించే గొంతులై మాటాడుతయి. "నేను గాని సుక్కేసుకొని కాక బెట్టిన పలక వాయిస్తే.. దీనెబ్బడాల! సరస్వతి గూడా ఈన అవతల బార్నాకి సిందులెయ్యకపోతే నేను మా యబ్బకి బుట్టలా" అంటడు బోడెయ్య.



కిర్రు సెప్పులు కుట్టడంలో సెయ్ దిరిగిన కోటన్న "సెప్పులు మా కులదేవతలు" అని గొప్పగా సెప్పుకుంటడు. సెప్పులు గుట్టే విద్దె గురించి కోటన్న సెపితే ఇనాల: "సెంద్ర మండలం మీదికి బొయ్యే వోడికి సెప్పులు గావాల. ముండ్ల తుప్పల్లో దిరిగే వోడికీ సెప్పులు గావాల్సిందే. సెంద్రుడు కాడికి యెగిరి బొయ్యినోడు ఎంత గొప్పో నిప్పు దగల కుండా, ముల్లుదగలకుండా ఎన్నెలంత సల్లంగుండే తోలుసెప్పులు గని పెట్టినోడు యెందులో తక్కువా?" ఇది పెద్ద కులపోల్లు బరాయించలేని ప్రశ్న.

తాటి సెక్కలు వుడకేసుకు తినే పుల్లమ్మ గాంధీ మహాత్ముడి గుర్సి: "సచ్చి యాడున్నడో గాండెయ్య! మనోల్ల మీన శానా జాలి సూపిచ్చే వోడంటనే? అట్టయితే మనోల్లని వూరికి అసింట బెట్టిన సంగతి ఆ పెద్దాయనకు బాగా తెలుసుగావల్నే? వూరు వూరంతా ఒకటి గావాలని, అందరు అరిజన్లే అని ఆయన జగడం బెట్టి పోరాటం ఎందుకు జెయ్యలా?" అని పుల్లమ్మ బో తెలివిగ, కుశాలుగ అడుగుద్ది.



> 'మల్లెమొగ్గల గొడుగు' కతలన్నీ మాదిగ పల్లె బతుకుల్ని సూపెట్టేయే. వోరు పుట్టి పెరిగిన ఊరు రావికుంటపల్లెంట. ఆడ ఆయన బందూలు, ఇరుగుపొరుగుల బతుకుల్లోని కట్టాలు, అవమానాలు, ఆకలి బాదలు ఈ కతల్లో కనబడతయి.

కులాల్లో ఎచ్చు తగ్గుల్ని సెపుతూ మనిసి పైసల్లో కూడా కులం ఉంటది అంటడు రాజారావు. రెడ్డీ ఓటల్, చౌదరి ఓటల్, బాపన ఓటల్ అనున్నట్లు మాదిగ ఓటల్ లేకపోవడానికి కారణం పెద్ద కులాలకు మాత్రమే యాపారం జేసి సంపాయించుకొనే అవకాశాన్ని కుల వెవస్థ కలిగించిందని "ఇక్కడ కులానికొక్క ఓటలుంది సార్.." అంటడు.

"మనం కుట్టిన సెప్పులతోనే ఈ పపంచకం మన మాడున కొడతా వుంది", "మా కట్టం ఎవురికి తెలుసుద్ది? ఈ సిల్లకర్రకీ, తప్పెట పుల్లకీ తెల్సుద్ది", "కులమేంది? జాతేంది? ఈ బూమ్మీద రొండే కులాలు. రొండే జాతులు. ఆడా! మగా! దీని మించినయ్యి ఇంగేమీ లెవ్వు", "మా నాయిన నడస్తా వుంటే సీకట్లో సెంద్రవంక కదిలినట్టుండేది. ఆ ఎల్తర్లోనే నాలుగు అచ్చిరాలు నేర్చుకున్నం. అవటాల ముంచి సీకటంటే బయ్యం పొయ్యింది", "అయితే కులముండ్లా! అది సీకటి కంటే సిక్కనైంది. ఇప్పుడు దాన్ని గోసే ఎల్తురు గత్తులు గావాలన్నా".. ఈ కోటేశన్లు అన్నీ సుదాకరు సారు రాసిన 'మల్లె మొగ్గల గొడుగు' బొక్కు లోనియే. ఎంత సక్కంగా రాసిండో? అయ్ సదూతుంటే మన బతుకుల్ని కల్ల ముందు పరిసినట్టే ఉంటది. కడుపులో ఎవురో సెయ్యి బెట్టి కెలికినట్టే ఎడద కలుక్కుమంటది.

ఇంగా, ఇట్టాంటియి ఎన్నో పుత్తకాలు ఏసిండ్రు. వాటిల్ని గూర్సి సెప్పాలంటే.. ఇట్టాంటి కాయితాలు మరిన్ని గావాల. సుదాకరు గోరి మాటలు గూడా ఇనసొంపుగా వుంటాయంట. మాటే గాదు.. బుద్ది గూడా బంగారమే అంటరు ఆయన్ను ఎరిగున్నోల్లు. ఎవురికీ అపకారం సెయ్యలేదు. ఒక మాటని కట్టుపెట్టలేదు. తన పనేందో! తనేందో! మనుసులంతా ఒకే కులమై బతకాలనీ, అంటరాని బుద్దులు పోవాలని బో కలలుగన్నడు. ఎనకబడ్డ కులంలో బుట్టినందుకు ఎన్ని అవుమానాలు అనబగించిండో..! మడిసికి విలువ ఇచ్చేది సదు ఒక్కటేనని 'ఆత్మకత' అనే కైతలో రాసుకుండు. ఆ పాటమిప్పుడు తొమ్మిదో తరగతి పిల్లోల్లకు బొక్కులో పెట్టిండ్రు.

ఇంతాజేసి, ఆ అయ్యకు ఏం తొందరయ్యిందో, ఎవురో పిల్సినట్టు అడావుడిగా ఎల్లిపొయిండు. అయినా మన బెమ గానీ, యాడికి బోతల్లే? ఆకాసం అంచు మీన ఆ సివర్న నులకమంచ మీన గూసొని తన సవాసులతో కైత గోస్టి పెట్టి ఉంటడు. మజ్జె మజ్జెలో తన బిడ్డల్ని, బంధుమిత్రులనీ తల్చుకొని కిందికి సూస్తా ఉంటడు. ఇంకా అంబేద్కరయ్య ఆశించిన రాజ్యం కోసం కలలు కంటా ఉండి ఉంటడు.

లక్షలాది డప్పులకూ
కణకణమండే నిప్పులకూ
తిరగబడ్డ చెప్పులకూ...
తన అచ్చరాలను అంకితం జేసిన సుధాకరుడికి అచ్చర నివాలులు.

(జనవరి 28 ఎండ్లూరి సుధాకర్ ద్వితీయ వర్ధంతి)

■ సునీత గంగవరపు
☏ 94940 84576

'ఇవీ మన మూలాలు'

కల్లూరి భాస్కరం రచన 'ఇవీ మన మూలాలు - జన్యుపరిశోధనల వెలుగులో భారతీయుల మూలాల పరిశీలన' ఆవిష్కరణ సభ జనవరి 28 సా.5గంటలకు సోమాజిగుడ ప్రెస్ క్లబ్ (ఏసీ హాల్), హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో ఆర్. రవికాంత్ రెడ్డి, జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, కె. రామచంద్రమూర్తి, వాడ్రేవు చినవీరభద్రుడు, బి. పి. పడాల, తాడి ప్రకాష్, కుప్పిలి పద్మ, శ్రీశైల్ రెడ్డి పంజుగుల పాల్గొంటారు.

బుక్ రీడర్స్ క్లబ్

'జలతంత్రి'

తైదల అంజయ్య కవిత్వ సంపుటి 'జలతంత్రి' ఆవిష్కరణ సభ జనవరి 28 ఉ.10గంటలకు ప్రెస్ క్లబ్ మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేటలో జరుగుతుంది. సభలో కె. రంగాచారి, కె. శివారెడ్డి, కోయి కోటేశ్వరరావు, నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 944124473.


మంజీరా రచయితల సంఘం

కేంద్ర సాహిత్య అకాడమీ సదస్సు

ఈ సాహిత్య సదస్సు జరుగుతుంది. ఆ ఒక్కరోజు జరిగే కేంద్ర సాహిత్య అకాడమీ, రాజాం రచయితల వేదిక సంయుక్త నిర్వహణలో అబ్బూరి వరద రాజేశ్వరరావు శత జయంత్యుత్సవ సదస్సు జనవరి 28 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుంది. సి. మృణాళిని, గార రంగనాథం, చింతకింది శ్రీనివాసరావు, అవధానుల మణిబాబు, డి.వి.జి. శంకరరావు, బాలసుధాకర మౌళి, ఎం. కృష్ణ కుమారి పాల్గొంటారు. వివరాలకు: 98857 58123.

గార రంగనాథం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
సోమవారం 22 జనవరి 2024




పరకాలలో కాషాయ జెండాలతో బీజేపీ నాయకులు



వనమంతా జనమయం

- సమ్మక్క - సారలమ్మ సన్నిధికి పోటెత్తిన భక్తులు
- 3 లక్షల మందికిపైగా హాజరైన జనం

వనదేవతల వద్దకు భక్తులు పోటెత్తారు. ముందస్తుగానే మొక్కులు సమర్పించుకున్నారు. వచ్చే నెల 21న జాతర ప్రారంభం కానుండగా, ముందుగానే భక్తుల రాక మొదలైంది. ఆదివారం సెలవు కావడంతో జనం పెద్దఎత్తున తరలించ్చారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. తలనీలాలు సమర్పించి ఎత్తు బంగారం తులాభారం వేయించుకున్నారు. అనంతరం గద్దెల వద్ద మొక్కులు తీర్చుకున్నారు. కాగా, భక్తుల రద్దీతో మేడారంలో కొద్ది సేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

- మేడారం

8

వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు



అంతా రామమయం!

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముస్తాబైన ఆలయాలు
- అయోధ్యలో బాలరాముడి విగ్రహప్రతిష్ఠ నేపథ్యంలో పూజలు

'అంతా రామమయం.. జగమంతా రామమయం..' ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా జై శ్రీరామ్ నినాదాలు మార్మోగనున్నాయి. అయోధ్యలో శ్రీరామ మందిరంలో సోమవారం బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరగనున్న నేపథ్యంలో రామ, ఆంజనేయ ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. టీవీల్లో ప్రతిష్ఠాపన జరిగే సమయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించనున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తిపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేసుకున్నారు.

- హనుమకొండ (ఆంధ్రజ్యోతి)

7

సాంకేతిక, కళల సమ్మిళితంగా..

- విజ్ఞానం, వినోదాన్ని పంచిన టెక్నోజియాన్
- ముగిసిన మూడురోజుల వేడుక
- తిరుగు ముఖం పట్టిన విద్యార్థులు
- చివరిరోజు ఆకట్టుకున్న ఈవెంట్లు
- స్ఫూర్తి నింపిన అతిథుల ప్రసంగాలు
- ఆలోచనలు రేకెత్తించిన వర్క్‌షాపులు
- విజేతలకు బహుమతుల ప్రదానం



హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్ కళాశాలలో అంగరంగ వైభవంగా నిర్వహించిన టెక్నోజియాన్-2024 ఆదివారం ముగిసింది. టెక్నోజియాన్‌లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నిటియన్లు గుండెల నింపుకున్న అనుభూతులు, సరికొత్త ఆవిష్కరణ వల్ల కలిగిన అవగాహనలు, ఆలోచనలతో తిరుగు ముఖంపట్టారు. టెక్నోజియాన్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ అంశాలకు సంబంధించి 40కిపైగా ఈవెంట్లను నిర్వహించారు. వందకుపైగా సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. నిట్ విద్యార్థులతోపాటు నగరంలోని పలు పాఠశాలలకు చెందిన రెండు వందల మందికిపైగా విద్యార్థులు సైతం ఆయా సైన్స్‌ఫెయిర్లలో ప్రదర్శించి బహుమతులను గెలుచుకున్న ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈవెంట్లు, ఎగ్జిబిట్లు, స్పాట్ ఈవెంట్లు, వర్క్‌షాపులు, అతిథి ప్రసంగాలు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాస్త్ర, సాంకేతికరంగాల్లో ఇటీవలకాలంలో చోటు చేసుకున్న సరికొత్త ఆవిష్కరణలను ఆకళింపు చేసుకునేందుకు, తమకు కలిగిన ఆలోచనలను తోటి విద్యార్థులతో పంచుకునేందుకు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల స్ఫూర్తిదాయక ప్రసంగాలను వినేందుకు టెక్నోజియాన్ వేదికగా నిలిచింది. ఈవెంట్లలో విద్యార్థులు పోటాపోటీగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులను ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న ప్రసంగాలు, వర్క్‌షాపులు

టెక్నోజియాన్ రెండోరోజు శనివారం రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం చేసిన ప్రసంగం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపింది. టి-వర్క్ ప్రోటోటైపింగ్, త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాపులు విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇందులో పాల్గొన్నవారు తయారీరంగానికి సంబంధించి ఒక ప్రపంచాన్ని చూశారు. ప్రఖ్యాత వక్త డాక్టర్ నరసమ్మ మిట్లపల్లి వైజ్ఞానిక ప్రసంగం ప్రేక్షకులను కట్టిపడవేసింది. ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ ఈవెంట్, ఎఫ్‌పీవి రేసింగ్, ఎస్కేప్ రూమ్ ఈవెంట్లు ఆకట్టుకున్నాయి. ఇన్నోవేటివ్ స్పియర్ ఎక్స్‌పోకు హాజరైనవారు సృజనాత్మకతలో మునిగిపోయారు. విభిన్న రంగాల్లో కొత్త ఆవిష్కరణలు ఆలోచనల హద్దులను చెరిపేసింది. పాఠశాల విద్యార్థులు రూపొందించిన పలు రోబోలతో నిర్వహించిన రోబోటిక్స్ ఎగ్జిబిషన్ యువ మనస్సులను ఆకట్టుకున్నాయి.

సాంకేతిక, కళల సమ్మేళనం

మూడోరోజు టెక్నోజియాన్‌లో ప్రముఖ ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎస్ సురేష్‌కుమార్ అతిథి ప్రసంగం హైలైట్‌గా నిలిచింది. మరో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బిజిలీ బాలక్రిష్ణన్ సెషన్ విద్యార్థులను కట్టిపడేసింది. స్పాట్‌లైట్ ఈవెంట్లలో జహాజ్ అందరిని విశేషంగా ఆకట్టుకున్నది. వీఆర్ క్రికెట్ ఈవెంట్ సంప్రదాయ ఆటకు వర్చువల్ ట్విస్టునిచ్చింది. కోడ్‌మేజ్ ఈవెంట్‌లో పాల్గొన్న విద్యార్థులు కోడింగ్‌లో నైపుణ్యాన్ని పెంచుకునేందుకు వీలుకల్పించింది. సాంకేతికత, వినోదం కలగలిసిన ఈ సమ్మేళనం మొత్తం మీద విద్యార్థులకు కొత్త అనుభూతిని ఇచ్చింది. ట్రెండింగ్ ఫిట్ ఈవెంట్ మార్కెట్ ఔత్సాహికులతో సందడి చేసింది. మెకానికల్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ నమూనా ప్రదర్శన రంగంలో అత్యాధునిక పరిణామాలను దర్శింప చేసింది. మేధోపరమైన విజ్ఞానాన్ని పెంపొందించడంలో టెక్నోజియాన్ లక్ష్యాన్ని హైలైట్ చేస్తూ, అలాగే పరిశోధనాపత్రాల ప్రదర్శనలపై దృష్టి సారిస్తూ చివరి రోజు కార్యక్రమం ముగిసింది. సాంకేతికత, కళల సంగమంగా త్రీడీ ప్రింటింగ్ పిక్సెల్స్ టు పోర్ట్రేయిట్ ఈ టెక్నోజియాన్‌లో అత్యంత ఆసక్తికరమైన అంశంగా నిలిచింది. స్పర్దక్ వాహన ప్రదర్శన మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభకు అద్దం పట్టింది. ఆల్ టేర్రేయిన్ వాహనం వరంగల్ నిట్ మెకానికల్ విద్యార్థుల నైపుణ్యానికి ప్రతీకగా నిలిచింది.


ఏజాజ్ ఈవెంట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థి


డాక్టర్ సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న నిట్ ప్రొఫెసర్లు



మెకానికల్ అసెంబ్లింగ్‌లో పాల్గొన్న విద్యార్థినులు

నెల్లుట్ల సర్పంచ్ దంపతులకు బంపర్ ఆఫర్

- రాష్ట్రపతి ఎట్‌హోంకు నామినేషన్ పంపాలని ఉత్తర్వులు
- రిపబ్లిక్‌డే సందర్భంగా రాష్ట్రపతితో కలిసి తేనీటి విందు


చిట్ల స్వరూపారాణి, భూపాల్‌రెడ్డి

లింగాలఘణపురం, జనవరి21: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామ సర్పంచ్ దంపతులు చిట్ల స్వరూపారాణి భూపాల్‌రెడ్డికి అద్భుతమైన అవకాశం వచ్చింది. నెల్లుట్ల గ్రామపంచాయతీ కీర్తి పతాకాన్ని ఢిల్లీ గడ్డపై రెపరెపలాడించి 2021-22 ఆర్థిక సంవత్సరానికిగాను నీటి సమృద్ధి విభాగంలో జాతీయ పురస్కారాన్ని అందుకున్న తొమ్మిది నెలల్లోనే తాజాగా రాష్ట్రపతి ఎట్‌హోంకు హాజరయ్యే మరో అవకాశం దక్కింది. ఈనెల 26న గణతంత్ర వేడుకల సందర్భంగా నిర్వహించే ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఎట్‌హోం వేడుకలకు రావాలంటూ ఆహ్వానం అందింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కేంద్రపంచాయితీరాజ్ విభాగం నుంచి తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆదేశాలు అందాయి. దీంతో యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేపట్టాల్సిందిగా జిల్లా పంచాయితీ అధికారిని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. నెల్లుట్ల సర్పంచ్ దంపతులు స్వరూపారాణిభూపాల్‌రెడ్డికి సంబంధించిన పూర్తి డేటాతో కేంద్ర పంచాయతీ రాజ్ విభాగానికి వెంటనే నామినేషన్ సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. దీంతో సర్పంచ్ దంపతుల్లో అవధులు లేని ఆనందం నెలకొంది.

గతేడాది ఏప్రిల్ 17న వారు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ఉత్తమసేవలకు సంబంధించి జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. అంతేగాకుండా గ్రామానికి కేంద్రం అందించిన రూ.కోటి నగదుతో ఊరంతా సీసీ రోడ్లు వేశారు. తాజాగా ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా ఎట్‌హోంకు జాతీయ స్థాయి ప్రముఖుల వరుసల్లో నెల్లుట్ల సర్పంచ్ దంపతులు కూడా ఆసీనులు కానుండటం పట్ల జిల్లా ప్రజలు గర్వంగా భావిస్తున్నారు. జాతీయ స్థాయిలో కేవలం 8 మంది సర్పంచ్‌లకు మాత్రమే ఈ అవకాశం దక్కగా అందులో తెలంగాణ నుంచి నెల్లుట్ల సర్పంచ్‌కు స్థానం లభించడం విశేషం.

ఓటమితో మతిభ్రమించి మాట్లాడుతున్న కేటీఆర్

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న సాంబశివరావు

సుబేదారి, జనవరి 21: బీఆర్ఎస్ ఓటమి తర్వాత మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. ఒకవైపు రాష్ట్రంలో రోజుకో శాఖ నుంచి శ్వేతపత్రం బయటకు వస్తుంటే తట్టుకోలేని కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎలా దించేయాలా అని చూస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నాయకులు దొంగాట ఆడుతున్నారని, అసలు ఈ రెండు పార్టీలు ఒక్కటేనని అన్నారు. కరెంట్ బిల్లులు ఎవరు కట్టొదని, సోనియాకు పంపాలని కేటీఆర్ చెప్పడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కేవలం 46రోజులే కావొస్తోందని, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు వంద రోజుల వరకు వేచి చూడలేరా? అని ప్రశ్నించారు. గతంలో దళితుడికే ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టూ పీజీ విద్య, డబుల్ బెడ్‌రూమ్, దళితబంధు, నిరుద్యోగ భృతిలాంటి బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నెరవేర్చారా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడినా బీఆర్ఎస్ నాయకుల అహంభావం, నియంతృత్వ పోకడలు తగ్గలేదన్నారు.

వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని కోరుతున్నాం..

పార్లమెంట్ ఎన్నికలలోనూ కాంగ్రెస్ స్నేహధర్మాన్ని పాటిస్తుందని భావిస్తున్నామని, రాష్ట్రంలోని ఒక పార్లమెంట్ స్థానాన్ని కోరుతున్నామని సాంబశివరావు చెప్పారు. తాము కోరుతున్న 5 స్థానాలలో వరంగల్ పార్లమెంట్ స్థానం కూడా ఉందని తెలిపారు. అందుకే ఇక్కడ తొలి సమావేశాన్ని నిర్వహించి సీపీఐ పార్టీ కమిటీని వేసుకుంటున్నామని తెలిపారు. కాగా, బీజేపీది రామ జపం కాదని, మోదీ జపం అని, ప్రజల్లో హిందుత్వ సెంటిమెంట్ రెచ్చగొట్టి తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్నారన్నారు. రాముడు అందరి దేవుడైనా బీజేపీ రాముడి పేరుతో ఓట్లు కొల్లగొట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె భిక్షపతి, సీహెచ్ రాజారెడ్డి, బి.విజయసారథి, మేకల రవి, కె.రాజ్‌కుమార్, రాష్ట్ర, జిల్లాల నాయకులు పంజాల రమేష్, మండ సదాలక్ష్మీ, మారుపాక అనిల్, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, గుండె భద్రి, షేక్ బాషుమియా, వలీ ఫుల్లాఖాద్రీ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న స్వామికి మొక్కులు చెల్లింపు

- మొదటి ఆదివారం జాతరకు లక్షమంది భక్తుల రాక

ఐనవోలు, జనవరి 21: ఐనవోలు మల్లికార్జునస్వామి మహాజాతర పూర్తయ్యాక మొదటి ఆదివారం వారాంతపు జాతరకు భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు వివిధ జిల్లాల నుంచి సుమారు లక్ష మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఉదయం మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి రుద్రాభిషేకాలు జరిపారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో విడిదిచేసి పట్నాలు వేసి బోనం వండి స్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాలు వేసి పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కెలు తీర్చమని మల్లన్నను వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు భక్తులు ఒడి బియ్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. మరికొందరు రథసేవను నిర్వహించారు. రథంలో ఉత్సవవిగ్రహాలను పెట్టి ఆలయం చుట్టూ లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


నజర్ పట్నం వేయించుకుంటున్న భక్తులు

వణికిస్తున్న శునకాలు

- కుక్కల దాడులతో జనం బెంబేలు
- ఎల్బీనగర్ ఘటనతో కలవరపెడుతున్న స్మృతులు
- బల్దియా నిర్లక్ష్యం.. చర్యలు శూన్యం..
- మంత్రి కొండా సురేఖ సీరియస్
- చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు ఆదేశాలు


ఎల్బీ నగర్‌లో కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 21: వరంగల్ మహానగరాన్ని వీధి కుక్కలు వణికిస్తున్నాయి. కుక్కలు దాడులు నిత్యకృత్యమయ్యాయి. ప్రాణాలు బలవుతున్నా.. వరంగల్ మహానగర పాలక సంస్థ చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. తాజాగా ఆదివారం వరంగల్ 21వ డివిజన్‌లోని ఎల్బీనగర్‌లో అలీ అక్బర్, అనాస్ అనే ఇద్దరు చిన్నారులపై కుక్కల దాడి ఘటన ప్రజలను మరింత భయందోళనలకు గురి చేస్తోంది. దాడిలో ఇద్దరు పిల్లలు తీవ్ర గాయాల పాలై ఎంజీఎంలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై మంత్రి కొండా సురేఖ సీరియస్ అయ్యారు. కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాకు నియంత్రణ చర్యలపై ఆదేశాలిచ్చారు.

విజృంభిస్తున్న కుక్కలు

కుక్కల దాడులు భయానక స్మృతులు ప్రజలను వెంటాడుతున్నాయి. గతంలో హనుమకొండ యాదవనగర్ సమీప ప్రాంతాల్లో కుక్కలు మూకుమ్మడిగా దాడి చేసి గంటన్నర వ్యవధిలోనే 29 మందిపై దాడి చేశాయి. హనుమకొండలోని రెడ్డికాలనీ, యాదవనగర్, గౌతంనగర్, పెగడపల్లి డబ్బాలు తదితర ప్రాంతాల్లో పలువురిని తీవ్రంగా గాయపడ్డారు. ముఖ్యంగా యూపీ బనారస్‌కు చెందిన ఆరేళ్ల బాలుడు చోటు గతంలో కాజీపేటలో కుక్కల దాడిలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన నగర వాసులను తీవ్ర కలవరానికి, విచారానికి గురి చేసింది. అంతకు ముందే అభినవ్ అనే బాలుడిని సైతం కాజీపేటలో కుక్కలు వెంటాడాయి. జనం కుక్కలను తరవడంతో బాలుడు తప్పించుకున్నాడు. హనుమకొండ ఎన్‌జీవోస్ కాలనీలో కీర్తన్ అబ్రహం కుక్కల దాడికి గురయ్యాడు. 72కు పైగా కాట్లు పడ్డాయి. ఖిలా వరంగల్ విద్యానగర్, ఉర్సులో నలుగురు చిన్నారులపై కుక్కలు దాడి చేశాయి. దాడిలో ప్రణీత పళ్లు ఊడాయి. ఉర్సులో పాల్, శ్రీరామ్, మోహిత్, సరోజన, రేణులపై కుక్కలు పరుగెత్తించి దాడి చేశాయి. వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగి మేకల సులోచన హనుమకొండ నక్కలగుట్టలో కుక్కల దాడికి గురయ్యారు. వాహనం వెనకాల కూర్చున ఆమె కిందపడ్డారు. హైదరాబాద్ తీసుకెళ్లి చికిత్స జరిపినా ఫలితం లేదు. బ్రెయిన్ డెడ్‌తో మరణించారు. ఖిలా వరంగల్‌లో చిన్నారులపై కుక్కలు దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు.

జీడబ్ల్యూఎంసీ నిర్లక్ష్యం

కుక్కల నివారణకు సీడీఎంఏ విడుదల చేసిన ప్రత్యేక నిబంధనావళిని అమలు చేయడంలో

మిగతా 8వ పేజీలో..

మంత్రి కొండా సురేఖ సీరియస్

వరంగల్ ఎల్‌బీనగర్ ఘటనపై మంత్రి కొండా సురేఖ జీడబ్ల్యూఎంసీపై సీరియస్ అయ్యారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషాను ఆదేశించారు. కుక్కల నియంత్రణకు మ్యాన్‌పవర్ పెంచుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి సురేఖ ఆదేశాలపై స్పందించిన కమిషనర్ రిజ్వాన్ బాషా ఎల్‌బీనగర్‌లో పిల్లలపై దాడి చేసిన కుక్కలను పట్టుకునేందుకు బృందాలను పంపినట్లు తెలిపారు. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు 6వేల కుక్కలకు శస్త్ర చికిత్సలు జరిపినట్లు వివరించారు. మరో ఏబీసీ బర్త్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగర వాసులు వేసవిని దృష్టిలో పెట్టుకొని తమ ఇళ్ల వద్ద కుక్కలు నీరు తగే చర్యలు తీసుకోవాలని సూచించారు.

బౌద్ధమే సమాజానికి దిక్సూచి

వడ్డెపల్లి, జనవరి 21 : బౌద్ధమే సమాజానికి దిక్సూచి అని ప్రముఖ బౌద్ధ ప్రచారిణి బంతే సద్దా రక్షిత అన్నారు. ఆదివారం హనుమకొండలోని గౌతమ బుద్ధుడి విగ్రహం వద్ద బౌద్ధ ధర్మ ప్రచారంలో భాగంగా బుద్ధ వందనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు బొమ్మల్ల అంబేద్కర్, మిద్దెపాక ఎల్లయ్య, చిట్యాల బాబు, ఇమ్మడి కొమురయ్య, ఏనుట్ల రవీందర్, దుర్గం స్వామి, సోమ రాంమూర్తి, కేడల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న రైల్వే కార్మికుల పిల్లలు

రైల్వే కార్మికుల పిల్లలకు క్రీడా పోటీలు

కాజీపేట, జనవరి 21: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జనవరి 26ను పురస్కరించుకుని రైల్వే క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఆదివారం రైల్వే కార్మికుల పిల్లలకు పెయింటింగ్, వ్యాసరచన, క్విజ్, క్రికెట్ పోటీలను నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి పి.రవీందర్, ఏడీఈ ఎం.భాను ప్రసాద్ హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం రైల్వే స్టేడియంలో ఆర్పీఎఫ్, ఫ్రెండ్స్ 11 టీంల మధ్య జరిగిన పోటీలలో ఆర్పీఎఫ్‌టీం విజయం సాధించింది. మధ్యాహ్నం ఆపరేటింగ్ 1, ఆలేర్ పేపే టీంల మధ్య జరిగిన పోటీలలో ఆపరేటింగ్‌టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం. రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్ రావు, ఇనిస్టిట్యూట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

లెనిన్ ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 21 : సమసమాజ స్థాపన, పీడిత ప్రజల హక్కుల కోసం కృషి చేసిన మహనీయుడు కామ్రేడ్ లెనిన్ అని, ఆయన ఆశయ సాధనకు విద్యార్థులు ఉద్యమించాలని అఖిల భారత కార్మిక సమాఖ్య జాతీయ అధ్యక్షుడు మారెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వెంకట్‌రెడ్డి ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లెనిన్ చనిపోయి వందేళ్లు గడుస్తున్నా అయనను అనుసరిస్తున్నామంటే ఆయన ఎంత త్యాగవంతుడో అర్థం చేసుకోవచ్చన్నారు. లెనిన్ ఆశయ సాధన కోసం విద్యార్థులు, యువత ముందుండి నడవాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను మార్చడం సిగ్గుచేటని మండిపడ్డారు. అలాగే ప్రజల హక్కులను కాలరాస్తూ పరిపాలన కొనసాగించడం బాధాకరమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలను తిప్పికొట్టే విధంగా లెనిన్ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని ఆయన వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు, సామాజికవేత్త మాడిశెట్టి అరుణ్ కుమార్, ఆల్ ఇండియా కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి ఎం.చంద్రారావు, ప్రజా సంఘాల నాయకులు ఎల్.శ్రీనివాస్‌రెడ్డి, బాబు, చంద్రశేఖర్, సాంబయ్య, మాదం తిరుపతి, మాలోతు రాజేష్ నాయక్, ఉదయ్ కుమార్, గణేష్, సునీల్‌చారి, రంగస్వామి, సందీప్, రాకేష్, సతీష్, సురేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు సైతం అందుబాటులో ఇస్రో

▸▸ ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌కుమార్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : సామాన్యులకు సైతం అంతరిక్ష పరిశోధనా కేంద్రం(ఇస్రో) అందుబాటులో ఉందని, ఆసక్తి కలిగిన వారు అంతరిక్ష పరిశోధనల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎస్ సురేష్‌కుమార్ అన్నారు. వరంగల్ నిట్‌లో టెక్నోజియాన్ ముగింపు రోజైన సోమవారం విద్యార్థులనుద్ధేశించి అతిథి ప్రసంగం చేశారు. అంబేద్కర్ లెర్నింగ్ హాల్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. తన లాంటి సాధారణ వ్యక్తి ఇస్రోలో పని చేయగలిగితే మీలాంటి తెలివైన వారు ఎందుకు రాలేరు? అని విద్యార్థులనుద్ధేశించి అన్నారు. కేవలం ప్యాకేజీలను మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా దేశాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఇస్రో లాంటి పరిశోధనా కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. నిట్ విద్యార్థులు అంతరిక్ష పరిశోధనా రంగం వైపు కూడా దృష్టి సారించాలని, ఇస్రోలో కీలక భూమిక పోషించాలని పిలుపునిచ్చారు. రియల్ టైమ్(నిజ సమయం) అనుభవాన్ని పొందడానికి ఇస్రో కేంద్రానికి రావాలని ఆహ్వానించారు. సాంకేతిక అభివృద్ధిలో కమ్యూనికేషన్ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ భూగోళంపై తాను ఇప్పటికే దాదాపు అన్ని దేశాలను తిరిగానని, తాను సందర్శించాల్సిన దేశాలు ఇంకా 25 మాత్రమే మిగిలి ఉన్నాయని, వాటిని రెండేళ్లలో పూర్తి చేస్తానన్నారు. సబ్ మెరైన్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి శాస్త్రవేత్తనుతానేనన్నారు. కరోనా కాలంలో తాను తన పరిశోధనతో కలిసి రేడియో ధార్మికతలు కరోనానుఏమైనా తగ్గిస్తాయా అన్న అంశంపై పరిశోధనలు చేశామన్నారు.


టెక్నోజియాన్‌లో మాట్లాడుతున్న ఇస్రో రిటైర్డ్ సైంటిస్టు డాక్టర్ సురేష్‌కుమార్

అలాగే ఇస్రోలో ఇంజనీరింగ్ ప్రవంతిలోగల అవకాశాల గురించి డాక్టర్ సురేష్‌కుమార్ వివరించారు. భావసారూప్యత కలిగిన వ్యక్తులు ఒక్కటై అంతరిక్ష సాంకేతికతలో స్టార్టప్‌ల ఏర్పాటుగల అవకాశాలనుఅన్వేశించాలన్నారు. అంతరిక్ష పరిశోధన, ఇస్రో భవిష్యత్తులో చేపట్టనున్న ప్రయోగాలు తదితర అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు, వెలిబుచ్చిన సందేహాలకు సురేష్‌కుమార్ సమాధానాలు ఇచ్చారు. అనంతరం నిట్ ప్రొఫెసర్లు ఆయనను సత్కరించారు.

జహాజ్..

జహాజ్ ఈవెంట్‌ను కాలేజీ ప్రభాన భవనం ఎదురుగా నీటి కొలనులో నిర్వహించారు. చేతితో తయారు చేసిన రిమోట్ నియంత్రిత పడవ ఇందులో హైలెట్. ఈ పడవ నీళ్లలో ఏర్పాటు చేసిన అడ్డంకులన్నిటినీ అధిగమించి గమ్యస్థానానికి చేరుకునేలా రిమోట్‌తో నడపాలి. ఎవరైతే విజయవంతంగా పడవను నిర్ధిత లక్ష్యానికి చేర్చుతారో వారే విజేత. ఈ స్పాట్ లైట్ ఈవెంట్‌ను ప్రతి సంవత్సరం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



ఆకట్టుకున్న జహాజ్

▸▸ స్టాక్ వాతావరణం సృష్టించిన వరంగల్ ట్రేడింగ్ రింగ్

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : టెక్నోజియాన్ చివరి రోజు నిర్వహించిన కొన్ని ఈవెంట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. జహాజ్., వరంగల్ ట్రేడింగ్ రింగ్ ఇందులో కొన్ని.

వరంగల్ ట్రేడింగ్ రింగ్

సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి రియల్‌టైమ్ స్టాక్ వాతావరణాన్ని ఈ ఈవెంట్ సందర్భంగా సృష్టించారు. ఇందులో పాల్గొనేవారికి వ్యాపారం చేయడానికి ఖాతాలు కూడా ఇచ్చారు. ఇందులో పాల్గొన్నవారు నిజంగా స్టాక్ ఎక్స్ఛేంజ్ కార్యకలాపాల్లోన్న అనుభూతికి లోనయ్యారు. ఎక్కువ డబ్బు సంపాదించినవారిని విజేతలుగా ప్రకటించారు.



మెకానికల్ కిట్ అసెంబ్లీ

ఈ ఈవెంట్‌లో పాల్గొనేవారు మెకానికల్ ఇంజనీరింగ్‌లోని ప్రతీ గేర్, స్క్రూ, విడి భాగాలను అసెంబ్లింగ్ చేయడంలో తమ ప్రతిభను చాటారు. తక్కువ సమయంలో విడిభాగాలను అసెంబ్లింగ్ చేసిన వారికి రివార్డు ఇచ్చారు.



మల్లన్నకు పట్నం భక్తుల పబ్బతి


మల్లన్నకు హారతి ఇస్తున్న అర్చకుడు


మల్లన్న ఆలయ ఆవరణలో భక్తజన సందోహం

▸▸ కొమురవెల్లిలో హోరెత్తిన పట్నంవారం

▸▸ భక్తజనసంద్రంగా ఆలయ పరిసరాలు

▸▸ బోనాలు, పట్నాలతో దండిగా భక్తుల మొక్కులు

చేర్యాల, జనవరి 21: కోరమీసాల కొమురవెల్లి మల్లికార్జున స్వామికి పట్నం భక్తులు పబ్బతి పట్టారు. మది నిండా మల్లన్న నామస్మరణతో పాటు డప్పుచప్పుళ్ల దరువుల నడుమ శివసత్తుల సిగాలు, పూనకాలు, పోతురాజుల చిందులతో కొమురవెల్లి విజయాచల గుట్టలు హోరెత్తాయి. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చిన మొదటి వారాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్నంవారాన్ని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ నుంచి సుమారు లక్ష మంది భక్తులు తరలిరావడంతో కొమరవెల్లి జనసంద్రంగా మారింది. శనివారం సాయంత్రం ధూళిదర్శనం చేసుకున్న భక్తులు ఆదివారం దండిగా మొక్కులు తీర్చుకున్నారు. భక్తిప్రపత్తులతో బోనాలు తయారు చేసి నైవేద్యాన్ని నివేదించారు. బస చేసిన ప్రాంతంలో, ఆలయ గంగరేగు చెట్టు ప్రాంతంలో, ముఖ మండపంలో మల్లన్నకు చిలుకపట్నం, నజరు, ముఖమండప పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని చీర, సారెలతో ఒడిబియ్యాలు పోశారు. తమ కోరికలు నెరవేర్చమని గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. సంతానం కలిగించాలంటూ మహిళలు వల్లుబండ వద్ద వరం పట్టారు.

ఎల్లమ్మ దేవతకు బోనాలు

స్వామి వారి సహోదరి అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు నివేదించారు. డప్పుచప్పుళ్ల నడుమ సిగాలతో శివమెత్తుతూ ఎల్లమ్మతల్లి నామస్మరణతో గుట్టపైకి ఎక్కి అమ్మవారికి బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.. బెల్లంపానకం, కల్లును నైవేద్యంగా సమర్పించి తమ పసుపుకుంకుమలు చల్లంగా చూడమని వేడుకున్నారు.

క్యూలైన్లలో పడిగాపులు

భారీగా భక్తులు హాజరవడంతో క్యూలైన్లన్నీ కిక్కిరిసిపోయాయి. పట్నాల మందిరంలోని క్యూలైన్లు నిండిపోయాయి. గంటల తరబడిగా క్యూలైన్లలో పడిగాపులు కాశారు. ఆలయ ఈవో బాలాజీ, పునరుద్ధరణ కమిటీ సభ్యులు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్ పర్యవేక్షణలో చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 500 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

నేడు పట్నం, అగ్నిగుండాలు

ఆలయ తోటబావి ప్రాంగణంలో సోమవారం హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం రచించి అగ్నిగుండాలు దాటనున్నారు. వంటినిండా పసుపు ధరించి భక్తులు పట్నంతొక్కి అగ్నిగుండాలలో చిందేయనున్నారు.

అసెంబ్లీలో ఒక్కరున్నా..

కార్యకర్తల బలం ఉంది

▸▸ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

సుబేదారి, జనవరి 21 : అసెంబ్లీలో సీపీఐ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే ఉన్నా.. బయట లక్షలాది మంది కార్యకర్తల బలం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆదివారం సీపీఐ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకార్యదర్శి కర్రె బిక్షపతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సాంబశివరావు మాట్లాడుతూ.. పేదలు, కార్మికులు, కష్టజీవుల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు లేనని అన్నారు. సమస్యలు ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని, కమ్యూనిస్టులను మించిన త్యాగధనులు లేరన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు సాధిస్తామనే విశ్వాసం తనకు ఉందని, లేదంటే పోరాటమే మార్గమని అన్నారు. పేదల హక్కుల కోసం అసెంబ్లీలో, బయట పోరాడుతానన్నారు. కేంద్రంలో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టుపెట్టిన బీజేపీని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధంలో భాగంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ సీపీఐ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా 101 మందితో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సీపీఐ ఉమ్మడి వరంగల్ జిల్లాల కార్యదర్శులు కర్రె బిక్షపతి, సీహెచ్. రాజారెడ్డి, బి.విజయసారథి, మేకల రవి, కె.రాజ్‌కుమార్, రాష్ట్ర, జిల్లాల నాయకులు పంజాల రమేష్, మంద సదాలక్ష్మి, మారుపాక అనిల్, ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్‌లు సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

▸▸ చికిత్స పొందుతూ భర్త మృతి

కమలాపూర్, జనవరి 21: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంప తులను కారు ఢీ కొట్టడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మండలంలోని అంబాల వద్ద జరిగింది.. పోలీసు ఇన్స్‌పెక్టర్ బొలిమల్ల సంజీవ్ తెలిపి న వివరాలు ఇలా ఉన్నాయి.

మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలంలోని రామకృ ష్ణాపూర్‌కు చెందిన బోయిని రవి(50) తన భార్య లతతో కలసి ద్విచక్ర వాహనంపై హనుమకొండకు బయలు దేరారు. హనుమ కొండలోని వారి బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆస్పత్రికి వెళ్ళి పరామర్శించారు. అనంతరం మండలంలోని గుండేడు గ్రామంలోని తమ బంధువుల ఇంటికి అదే ద్విచక్రవాహనంపై వస్తుండగా అంబాల గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా అజాగ్రత్తగా, అతి వేగంగా వస్తున్న హనుమకొండకు చెందిన కారు, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో దంపతులిద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో చుట్టు పక్కల వారు సమాచారం ఇవ్వడంతో 108లో దంపతులను వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రవి చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడని తెలిపారు. కాగా, తీవ్రగాయాలైన లత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైనా వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారని తెలిపారు. కాగా, మృతుడు ఎల్ఐసీ ఏజెంటుగా పని చేస్తున్నారని తెలిపారు. మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. కారు డ్రైవర్ పరారీలో ఉన్నారని రవికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారని ఇన్స్‌పెక్టర్ తెలిపారు.


ఆస్పత్రిలో మృతి చెందిన రవి

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మడికొండ. జనవరి 21 : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మడికొండలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మడికొండ నెహ్రూనగర్ కాలనీకి చెందిన బానోత్ మల్లేష్, బానోత్ యాకూబ్ ఇద్దరూ బైక్‌పై ధర్మసాగర్‌కు వెళ్ళి తిరిగి మడికొండకు వస్తున్నారు. ఈ క్రమంలో మడికొండలోని మా ఫంక్షన్ హాల్ సమీపంలోకి రాగానే మడికొండకు చెందిన జనగాం అరవింద్, ఏదుల రాకేష్ ఇద్దరూ బైక్‌పై వేగంగా వచ్చి బానోత్ మల్లేష్ బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో నలుగురు కిందపడిపోయారు. ప్రమాదంలో బానోత్ యాకూబ్, బానోత్ మల్లేష్, ఏదుల రాకేష్‌కు తీవ్ర గాయాలు కాగా జనగాం అరవింద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు గాయపడిన వ్యక్తులను 108లో ఎంజీఎంకు తరలించారు. బైకులను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



గాయపడిన ఏదుల రాకేష్, బానోత్ యాకూబ్

మరిపెడ సంతకు వచ్చి..

▸▸ గుండెపోటుతో రైతు మృతి

▸▸ మృతుడు ఖమ్మం జిల్లా వాసి

మరిపెడ, జనవరి 21 : కూరగాయల అమ్మకానికి మరిపెడ సంతకు వచ్చిన ఓ రైతు గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర విషాదం నింపింది. ఆ రైతు తను పండించిన టమాటలను ఆదివారం ఆటోలో మరిపెడ సంతకు తరలించి వాటిని దించుతుండగా కుప్పకూలాడు. చుట్టుపక్కల వారు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోపే కన్నుమూశాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామానికి చెందిన రమణబోయిన రామస్వామి (56) తన టమాట తోట నుంచి టమాటలను ఆటోలో మరిపెడ సంతకు తీసుకొచ్చారు. వాటిని ఆటో నుంచి దించే క్రమంలో ఆయన గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వారం వారం జరిగే మరిపెడ సంతకు ప్రతీ ఆదివారం రమణయ్య పిండిప్రోలు ఊరు నుంచి కూరగాయలను ఆటోలో తీసుకొచ్చి అమ్ముకునేటోడు. ఈ ఆదివారం సైతం కూరగాయలను తెచ్చి అందరూ చూస్తుండగానే రమణయ్య మృత్యు ఒడికి చేరాడని సహచర చిరు వ్యాపారులు తమ కళ్ల ముందే జరిగిన రమణయ్య మృతి ఘటనతో కన్నీటి పర్యంతం చెందారు. కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలుపడంతో మృతదేహాన్ని సొంతూరుకు తరలించారు.


రామస్వామి మృతదేహం

అంతా రామమయం!

▸▸ ఉమ్మడి జిల్లాలో ముస్తాబవుతున్న రామాలయాలు

▸▸ అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ నేపథ్యంలో పూజలు

▸▸ ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు ఏర్పాట్లు

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : అయోధ్యలో శ్రీ రామ మందిర ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా అంతటా పండుగ వాతావరణ నెలకొనబోతున్నది. ప్రతీ ఇల్లు ఓ పూజా మందిరంగా మారనున్నది. ఊరు వాడా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామాలయాలన్నీ ఇప్పటికే అందంగా ముస్తాబయ్యాయి. వీటితో పాటు అంజనేయస్వామి గుళ్లన్నింటినీ ప్రత్యేక పూజల నిర్వహణకు సిద్ధం చేశారు. అయోధ్యలోని శ్రీ రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సమయంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓం పతాకాలతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

పలు ఆలయాల్లో..

హనుమకొండ చౌరస్తా సమీపంలోని రాగన్న దర్వాజలోని పెద్ద కోవెల, చిన్న కోవెల, రాజ్‌పుత్‌వాడలోని రామాలయం, హనుమకొండ ఏకశిల పార్క్‌ను అనుకొని ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, చేర్యాల మండలం ఆకునూరి రామాలయం, ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాచీన వేణుగోపాల స్వామి ఆలయం, వరంగల్ ఎల్లంబజారులోని సీతా రామచంద్రస్వామి ఆలయం, కాజీపేట రైల్వేస్టేషన్ సమీపంలోని రామాలయం, వరంగల్ కాశిబుగ్గలోని రంగనాథ ఆలయం, వరంగల్ రైల్వేస్టేషన్ సమీపంలోని గుట్టపై ఉన్న గోవిందరాజస్వామి ఆలయం, జనగామ జిల్లా జీడికల్లులోని సుప్రసిద్ధ శ్రీరామ క్షేత్రం(వీరాచల క్షేత్రం), హనుమకొండ మచిలీబజార్‌లోని హనుమదాలయం, వరంగల్ కోటలోని రామాలయం, ధర్మసాగర్ మండలం వేలేరులోని రామాలయం, వరంగల్ శివనగర్‌లోని రామాలయం, హనుమకొండ రెవెన్యూ కాలనీలో రామాలయం, పరిమళ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయం తదితర ఆలయాల్లో సోమవారం అయోధ్య రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సమయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

అక్షింతలు

ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అయోధ్య రామ మందిరం అక్షింతలు అన్ని ఆలయాలకు చేరుకున్నాయి. వాటిని విశ్వహిందూ పరిషత్, బీజేపీ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. వీటిని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. సోమవారం అయోధ్యలో రామ మందిరంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరిగే సమయంలో తమ ఇళ్లలో కూడా పూజలు నిర్వంచి తాము స్వయంగా తయారు చేసుకున్న అక్షింతల్లో వీటిని కూడా కలిపి తలలపై చల్లుకోనున్నారు. పరస్పరం పంపిణీ చేసుకోనున్నారు. ఆలయాల్లో పూజల సందర్భంగా కూడా వీటిని భక్తులకు పూజారులు అందచేయనున్నారు. పక్షం రోజులుగా అయోధ్య రామ మందిరం అక్షింతల పంపిణీ జరుగుతోంది.

టీవీలలో వీక్షణం

రామ మందిరంలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని టీవీలు, ఇతర మాధ్యమాల్లో ప్రత్యక్షంగా ప్రసారం చేయనున్నారు. దీనితో టీవీల్లో వీక్షించేందుకు భక్తులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రతిష్ఠాపన సమయంలో అందరూ ఇళ్లలో టీవీల ముందు కూర్చోనుండగా, ఆరు బయట ప్రదేశాల్లో, ఆలయాల ప్రాంగణాల్లో, పబ్లిక్ పార్కులు, టీవీ షోరూములు, వ్యాపార సంస్థలు, ఆధ్యాత్మిక మందిరాలలో భారీ డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులు ప్రశాంతంగా కూర్చొని వీక్షించేందుకు వీలుగా టెంట్లను ఏర్పాటు చేస్తున్నారు. హాజరైన భక్తులకు పంపిణీ చేసేందుకు తీర్థ ప్రసాదాలను కూడా తయారు చేస్తున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాలను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా భక్తి గీతాలాపనలు, భజనలు, సంకీర్తలను, నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు. పలువురు భక్తులు పక్షం రోజులుగా భక్తి గీతాల ఆలపన సాధన చేస్తూ శ్రీ రాముడిపై తమకున్న భక్తితత్వాన్ని చాటి చెబుతున్నారు. శ్రీరాముడి ఘట్టాల ప్రదర్శనకు నగరంలోని కొన్ని నృత్య శిక్షణా సంస్థల నిర్వాహకులు తమ వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రత్యేక ప్రదర్శనకు చాలా రోజుల కిందటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు.



జాతి జీవనాన్ని సన్మార్గాన నడిపింది రామతత్వమే..

హనుమకొండ కల్చరల్, జనవరి 21: అనాదికాలం నుంచి భారతజాతి జీవనాన్ని సన్మార్గాన నడిపింది రామతత్వమేనని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు, జాతీయ సాహిత్య పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అయోధ్య శ్రీరామ జన్మభూమిలో బలరామమూర్తి ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఏకశిల వైభవ మండలి ఆధ్వర్యంలో హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్న శ్రీమద్రామాయణం సప్తాహం ప్రవచనామృతం ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవులు దివ్య మానవులుగా మారడానికి రామాయణం కారణభూతమైందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏకశిల వైభవ మండలి బాధ్యులు సౌమిత్రి లక్ష్మణాచార్యా, దుండిగళ్ల సుధీర్‌కుమార్, కుందావర్జుల కృష్ణమూర్తి, ఆచార్య గిరిజామనోహర్ బాబుతో పాటు మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి
ఎమ్మెల్యేకు భీమారం గ్రామస్థుల వినతి



ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న భీమారం వాసులు

భీమారం, జనవరి 21: 55వ డివిజన్ భీమారంలో అభివృద్ధి పనులు చేపట్టాలని భీమారం గ్రామవాసులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు ఆదివారం వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం భీమారం బస్టాండ్ నుంచి చింతగట్టు వరకు రూ.4కోట్ల పనులు మొదలుపెట్టి ఏళ్లు గడిచినా పనులు పూర్తి కావడం లేదన్నారు. బస్టాండ్ నుంచి బొడ్రాయి వరకు రోడ్ల నిర్మాణంతో పాటు శంకుస్థాపన చేసి వదిలేసిన డ్రైయినేజీ, సీసీ రోడ్ల పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గడ్డం శివరాం, ఆకుల కుమార్, బూర శరత్, తోట ప్రకాశ్, రాజేశ్వర్‌రావు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ అర్బన్, జనవరి 21: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం సమర్పించారు. ఆదివారం నిర్వహించిన వరంగల్ పార్లమెంటరీ సన్నాహక సమావేశానికి ఆయన హనుమకొండకు విచ్చేశారు. హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మెల్యేను కలిసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నూర సంపత్ కుమార్, సీహెచ్.పృథ్వీరాజ్, నూకల అంజయ్య, సీహెచ్.ప్రవీణ్ కుమార్, సందీప్ కుమార్, సాంబయ్య ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏకశిలాపార్కు వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

సుబేదారి, జనవరి 21: ఏకశిలాపార్కు వాకర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం ఉదయం పార్కులో జరిగాయి. వంగా రాజిరెడ్డి ప్యానెల్, ఉషారెడ్డి ప్యానెల్‌లు పోటీపడగా ఉషారెడ్డి ప్యానెల్‌పై రాజిరెడ్డి ప్యానెల్ ఘన విజయం సాధించింది. రాజిరెడ్డి ప్యానెల్‌లోని ఏడుగురు గెలిచి క్లీన్ స్వీప్ చేశారు. వంగా రాజిరెడ్డి అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా పడాల సోమయ్య, ఉపాధ్యక్షులుగా బొద్దిరెడ్డి రాజిరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా బోనాల వీరస్వామి, కోశాధికారిగా శుంచికాల రవీందర్‌రావు, ఈసీ మెంబర్లుగా కుందారపు అరుణ, పట్నంశెట్టి సుమతిలు గెలిచారు.

కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఎన్నిక

హసన్‌పర్తి: కిట్స్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నికల అధికారి పాపిశెట్టి వెంకటేశం ప్రకటించారు. కిట్స్ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా పాపిశెట్టి శ్రీధర్, అధ్యక్షుడిగా పుల్లా దుర్గారాం, ప్రధాన కార్యదర్శిగా నాగమళ్ల సుధీర్, కోశాధికారిగా గూడూరు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా చకిలం చంద్రశేఖర్, మురాల శంకర్‌రావు, గుండమీది విజయమోహన్, ముఖ్య సలహాదారుగా పల్లె సంజీవ్, సంయుక్త కార్యదర్శిగా పొన్నోజు శివప్రసాద్, డైరెక్టర్లు గంగినేని రవికుమార్, కాలె యాదగిరి, వేల్పుల తిరుపతి, ఏరుకొండ రమేశ్ ఎన్నికయ్యారు.

సీబీసీ సేవాభావం స్ఫూర్తిదాయకం

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి సంఘం ప్రతినిధులు

హనుమకొండ సిటీ, జనవరి 21: హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి సేవాభావంతో చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. ఆధ్యాత్మికంగానే కాకుండా అనాథలకు ఆశ్రయ కల్పన, విద్యనందించడం, పేదలకు విద్యను చేరువ చేయడం, పలువిధాలుగా సహాయ, సహకారాలు అందించడం గొప్ప విషయమన్నారు. ఆదివారం హనుమకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి సంఘం ఆధ్వర్యంలో గోల్డెన్ జూబ్లీహాల్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి సన్మాన కార్యక్రమం జరిగింది. సంఘం అధ్యక్షుడు రూబెన్ క్రిష్టఫర్, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి విజయ స్వరూప్ సంయుక్త అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డిని సంఘంలోని పలు విభాగాలు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెంటినరీ బాప్టిస్టు చర్చితో తనకు బాల్యం నుంచే అనుబంధం ఉందని తెలిపారు. ఆస్పత్రి పూర్వవైభవానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాస్టరు రెవ.జీ.జె నిరంజన్‌బాబు, అసిస్టెంట్ పాస్టర్లు, రెవ.సీఎస్.మైఖల్, రెవ. ఆర్.మోజెస్‌తో పాటు జాయింట్ కమిషనర్ అడ్మిన్ పోలీస్ హైదరాబాద్ పరిమళ హనా నూతన్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోజెస్ ఆనంద్ పాల్, డాక్టరు పులి అనిల్‌కుమార్, డాక్టర్ పాలూరి శ్రవన్‌కుమార్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, బంక సంపత్‌యాదవ్, సీబీసీ కోశాధికారి విద్యాకర్, ఉపాధ్యక్షులు డాక్టర్ విల్సన్ వినయ్‌కుమార్, జాన్సన్ ప్రసాద్, సునిల్ సోమసుందరం, మహిళా, యూత్ విభాగం ప్రతినిధులుసండే స్కూల్ సూపరింటెండెంట్ సందీప్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహ్మత్‌నగర్ మసీద్ వద్ద స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. రూ.50లక్షలతో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామన్నారు. స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, నాయకులు మేరుగు రాజయ్య, రఫీ, ఖాజీ, అజీముద్దీన్, హజ్గర్, రఫీ, జలీల్, రషీద్, సర్వర్, గౌస్, అక్తర్, జాంగీర్, డా. పి. శ్రావణ్, యాసీన్, అంకూస్‌తోపాటు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కాగా, కాజీపేట 47వ డివిజన్ నుంచి ఆదివారం హనుమకొండ విశాల్‌భవన్‌లో వివిధ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సిరిల్ లారెన్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, జి.రాంబాబు, పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హనుమకొండ రూరల్ : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు హనుమకొండ జిల్లా శాఖ రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎమ్డీ. అబ్దుల్లా, జిల్లా అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి అలీ, కె.రాజ మహేందర్, కె.సారయ్య, జి.విష్ణుమూర్తి, మంజులాల్, శిరీష, కిషన్ నాయక్, చక్రు తదితరులు పాల్గొన్నారు.

● సుబేదారి: హనుమకొండలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం భక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈసందరర్భంగా సంఘం అధ్యక్షుడు మార్కండేయ మందిర నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరగా స్పందించిన నాయిని త్వరలోనే మందిరం నిర్మాణానికి స్థలం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు బత్తుల రమేష్, నాయకులు తౌటం రవీందర్, నల్ల సత్యనారాయణతోపాటు పెద్ద సంఖ్యలో పద్మశాలి కులస్థులు పాల్గొన్నారు.

మేడారం జనసంద్రం

వనదేవతల సన్నిధికి పోటెత్తిన భక్తులు
3 లక్షల మందికి పైగా తరలివచ్చిన జనం

మేడారం, జనవరి 21: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం ఆదివారం కిక్కిరిసిపోయింది. వనదేవతలను దర్శించుకోవడానికి 3 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు జరగనుండగా ముందస్తుగానే మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగు వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను అందుబాటులోకి తేవడంతో వాగులో నీటి ప్రవాహం లేకున్నప్పటికీ పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం నిలువెత్తు బంగారం (బెల్లం)తో తులాభారం వేయించి గద్దెల వద్దకు చేరుకున్నారు. క్యూలైన్ల ద్వారా వనదేవతలను దర్శించుకున్నారు.

పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీరె, సారె, కొబ్బరికాయలు సమర్పించుకుని చల్లగా చూడాలని తల్లులను వేడుకున్నారు. మేకలు, గొర్రెలు, కోళ్లను పెద్దసంఖ్యలో బలిచ్చారు. భారీగా భక్తుల రాకపోతమేడారం చుట్టుపక్కల పరిసరాలు, అటవీప్రాంతం, విడిది చేసిన ప్రదేశం కిక్కిరిసిపోయింది. భక్తులు ఇక్కడే వంటలు చేసుకుని బంధుమిత్రులతో విందు భోజనాలు ఆరగించారు. సంక్రాంతి సెలవుల సమయంలో మొదలైన భక్తుల రద్దీ క్రమేపీ పెరుగుతోంది. జాతర సమయం దగ్గరపడుతున్న క్రమంలో బుధ, గురు, ఆదివారాలు, సాధారణ సెలవురోజుల్లో భక్తుల సంఖ్య లక్షలకు చేరే అవకాశం ఉంది. ఈమేరకు అధికార యంత్రాంగం సౌకర్యాలను మెరుగుపరచాలని సర్వత్రా కోరుతున్నారు.

గంటపాటు ట్రాఫిక్ జామ్

వనదేవతలను దర్శించుకోవడానికి భక్తులు రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తెల్లవారుజాము నుంచే మేడారం చేరుకున్నారు. భక్తుల రద్దీని అధికార యంత్రాంగం అంచనా వేయలేకపోయింది. దీంతో ఉదయం కొత్తూరు-జంపన్నవాగు మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఆదివారం వారాంత సెలవు కావడంతో మహాజాతరకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ క్రమంలో జంపన్నవాగు నుంచి హరితహోటల్ వరకు సుమారు కిలోమీటరున్నర వరకు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక పార్కింగ్ స్థలాల్లోకి వాహనాలను తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సామాజిక న్యాయవేదిక క్యాలెండర్ ఆవిష్కరణ

వడ్డెపల్లి, జనవరి 21 : సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఏశబోయిన సాంబయ్య యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను హనుమకొండ రాంనగర్‌లోని తన నివాసంలో రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర, జిల్లా నాయకులు కొమ్మినేని భూపాల్‌రావు పటేల్, కూరాకుల భారతి, దామెరుప్పుల శంకర్, అచ్చ వినోద్‌కుమార్, డాక్టర్ ఆకోజు పూర్ణచందర్, దొడ్డిపాటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నిక

హనుమకొండ రూరల్, జనవరి 21: హనుమకొండలోని పరిమళ కాలనీ రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం తేజ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలో ఆదివారం జరిగాయి. పరిమళ కాలనీ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బొమ్మినేని సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అర్జుల రామ్‌రెడ్డి, సెక్రటరీగా సిహెచ్.వనాకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా సిహెచ్.రవీందర్‌రెడ్డి, కోశాధికారిగా జి.రాజిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా గంగుల రాజిరెడ్డి, కొత్త రవీందర్‌రెడ్డి, జి.రవీందర్‌రెడ్డి, గరిమిల్ల దేవేందర్‌రెడ్డి, పి.సత్యనారాయణరెడ్డి ఎన్నికయ్యారు.

అనుమతులు లేని నిర్మాణాలను కూల్చివేస్తాం..

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 21: అనుమతులు లేని నిర్మాణాలను కూల్చివేస్తామని వరంగల్ మహానగర పాలక సంస్థ సిటీ ప్లానర్ వెంకన్న స్పష్టం చేశారు. ఆదివారం వరంగల్‌లోని ఎన్ఎన్‌నగర్, బీఆర్‌నగర్ ప్రాంతాల్లో నాలాను ఆక్రమించి జరిగి అనధికార నిర్మాణాలను ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా సీపీ వెంకన్న మాట్లాడుతూ.. టీఎస్‌బీపాస్ అనుమతులు పొందాకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే కూల్చివేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీపీబీవో అనిల్, డీఆర్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుభ్రం చేసిన రామభక్తులు

సుబేదారి, జనవరి 21: హనుమకొండ న్యూశాయంపేటలోని భక్తాంజనేయస్వామి దేవాలయాన్ని ఆదివారం న్యూశాయంపేటకు చెందిన రామభక్తులు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రామభక్తుడు పెరుగు సురేష్ మాట్లాడుతూ.. సోమవారం అయోధ్యలో రామమందిర పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్నందున ప్రతీ ఒక్కరు తమ ఇండ్లలో 5 దీపాలు వెలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రపాల్, శోభన్, శేఖర్, సతీష్ పాల్గొన్నారు. అలాగే న్యూశాయంపేట జంక్షన్ నుంచి సుభాష్ బొమ్మ వరకు ఉన్న ప్రతీ ఇంటికి పెరుగు సురేష్ ఆధ్వర్యంలో శ్రీరాముని జెండాలు పంపిణీ చేశారు. ప్రతీ ఇంటిపై శ్రీరాముని జెండా ఎగురవేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

చిన్నారులు చూడాల్సిన సినిమా 'హనుమాన్'

సుబేదారి, జనవరి 21 : చిన్నారులందరు చూడాల్సిన సినిమా హనుమాన్ అని సులక్ష్యం సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మండువ సంతోష్ అన్నారు. సులక్ష్య సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అనాథ పిల్లలకు, ప్రభుత్వ పాఠశాల పిల్లలకు హనుమకొండలోని ఏషియన్ మాల్‌లో హనుమాన్ సినిమా చూపించారు. ఈ సందర్భంగా పిల్లలు ఎంతో సంతోషంగా కేరింతలు కొడుతూ సినిమా చూస్తూ ఎంజాయ్ చేశారు. ఈ కార్యక్రమంలో సులక్ష్య సేవా సమితి బాధ్యులు కోడం వినయ్, దేవులపల్లి జయంత్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బంజారా సంస్కృతిని భావితరాలకు అందించాలి



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న బంజారా నేతలు

వడ్డెపల్లి, జనవరి 21 : బంజారా సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత బంజారా సమాజంపై ఉందని ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డీఎస్. వెంకన్ననాయక్ అన్నారు. ఆదివారం హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లా బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్. నాయక్ అధ్యక్షతన నిర్వహించిన బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని, సేవా మందిరాలను ప్రతీ తండాలో నిర్మించాలని, బంజారా పోరాట యోధుడు రాను నాయక్ విగ్రహాన్ని హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం బంజారా గోత్రాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో బంజారా నేతలు డాక్టర్ రూప్ శంకర్, బానోతు వెంకన్న నాయక్, గుగులోత్ సజ్జన్ నాయక్, జైసింగ్ రాథోడ్, చందూలాల్, ధనుంజయ్, ధరావత్ గిరిమోజి, పోరిక రమేష్, రవీందర్ నాయక్, నూనావత్ జవహర్‌లాల్ నాయక్, భూక్య సాంబయ్య నాయక్, కొడకండ్ల జడ్పీటీసీ సత్యవతి, అర్పిత, బంజారా మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత సంత్‌సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



1967-70 డిగ్రీ బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు

నయీంనగర్, జనవరి 21: హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1967-70 సంవత్సరంలో డిగ్రీ(బీఎస్సీ-బీజెడ్‌సీ) పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య విద్యాసంస్థల అధినేత పురుషోత్తంరెడ్డి స్వగృహంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతస్థాయికి చేరేలా తీర్చిదిద్దిన గురువులకు కృతజ్ఞతలు తెలియజేశారు. దాదాపు 54 యేళ్ల తర్వాత మిత్రులందరం కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. డిగ్రీ చదివే రోజుల్లో జరిగిన తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. 1967-70 డిగ్రీ బ్యాచ్‌లో 18 మంది వరకు తన మిత్రులు చనిపోవడం బాధాకరమన్నారు. చనిపోయిన మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. 1967-70 డిగ్రీ బ్యాచ్ మిత్రులను కలవడానికి కృషి చేసిన డాక్టర్ టాకూర్ రతన్ సింగ్ (రిటైర్డ్ రీడర్ ఇన్ జువాలజీ, సీకేఎం కళాశాల)కు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ పురుషోత్తంరెడ్డిని శాలువా కప్పి జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో అష్టావధానం



అష్టావధానంలో మాట్లాడుతున్న కంది శంకరయ్య, భానుప్రకాశాచారి

వడ్డెపల్లి, జనవరి 21 : వరంగల్ భద్రకాళి రోడ్డులోని శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ జ్ఞాన ధ్యానమండపంలో ఆదివారం సంచాలకులు కంది శంకరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. అక్కెర సదానందచారి, అవుసుల భానుప్రకాశాచారి, తాడూరు మోహనాచారి, కొమ్మోజు శ్రీధర్, లక్ష్మణాచారి, మారడోజు సదానందచారి తదితరులు అష్టావధానాన్ని నిర్వహించారు. వరంగల్ నగరంలోని ప్రముఖ వేద పండితులు హాజరై తమ అష్టావధానాన్ని వినిపించారు. కార్యక్రమంలో దేవరకొండ భగవాన్, అక్కెర కరుణాసాగర్, కొక్కొండ శంకరయ్యచారి, రుద్రోజు సుగ్రీవాచారి, జల్లిపల్లి పెంటయ్య చారి, సిద్దోజు విద్యాసాగర్, వేల్పుల దేవాచారి, గూటోజు కేదారేశ్వర చారి, అలుగోజు కృష్ణమూర్తి తదితరులు పాల్గొని అష్టావధానాన్ని విజయవంతం చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వణికిస్తున్న శునకాలు

5వ పేజీ తరువాయి

వరంగల్ మహానగర పాలక సంస్థ వైఫల్యం చెందింది. నిర్లక్ష్యంతో వ్యవహరించింది. కుక్కలు ప్రధానంగా వేసవిలోనే దాడులు చేస్తాయంటూ నిబంధనల పేరిట ప్రకటనలు చేసి చేతులు దులుపేసుకున్నారు. ఆహారం అందక, నీరు దొరకక కుక్కలు ఉద్రేకానికి గురై దాడి చేస్తామని స్వయంగా బల్దియా అధికారులే ప్రచారం చేశారు. ఈ మేరకు కరపత్రాలను కూడా విడుదల చేశారు. నివారణ కోసం నగరంలో పలుచోట్ల కుక్కలకు తాగునీటి వసతి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ వసతి కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పాఠశాల్లో పిల్లలకు కుక్కల దాడి నుంచి బయటపడే మార్గాల అవగాహన కల్పించే చర్యలు అటకెక్కించారు.

కుక్కల దాడి సమస్య నివారణ కోసం పురపాలక శాఖ ఫంక్షన్‌హాల్స్, హాస్టళ్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు తదితర తినుబండారాల విక్రయషాపులకు నోటీసుల ఇవ్వాలని బల్దియాను ఆదేశించింది. తూతూమంత్రంగా బల్దియా చేపట్టి చేతు లు దులుపేసుకుంది. తినుబండారాలు రోడ్డు, జన సంచారం ప్రాంతాల్లో వేయకుండా షాపుల యజమానులను కట్టడి చేయడంలో విఫలమైంది. డివిజన్లలో, కాలనీల్లో కుక్కల నివారణ, రక్షణ జాగ్రత్తలు కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తామని చెప్పిన బల్దియా ఆచరణలో విఫలమైంది. నగరంలో ఏదైనా ఘటనలు జరిగినప్పుడే బల్దియా హడావుడి చేస్తోంది. ఆపై షరామామూలే. ఈ వైఖరి నగర ప్రజల ప్రాణాలకు ముప్పును తెస్తోంది. కుక్కల నివారణ కోసం లక్షలు వెచ్చిస్తున్న బల్దియా ఆ మేరకు ఫలితాలు చూపెట్టలేకపోతుంది.

ముదిరాజ్‌లకు మంత్రి పదవి ఇవ్వాలి

కాజీపేట, జనవరి 21: రాష్ట్రంలో మక్తల్ ఎమ్మెల్యేగా గెలిచిన ఏకైక ముదిరాజ్ కులానికి చెందిన వాకిటి శ్రీహరి ముదిరాజ్‌కు మంత్రి పదవి ఇవ్వాలని మెపా రాష్ట్ర కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. కాజీపేటలోని డీజిల్‌కాలనీలో ఆదివారం ముదిరాజ్‌కులస్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ముదిరాజ్ కులానికి మంత్రి పదవి ఇస్తే ముదిరాజ్ కులస్థుల సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో మెపా నాయకులు అమ్మగారి శ్యామ్, కనుకుంట్ల రవి, సుంచు ప్రశాంత్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడి శోభాయాత్రలో పాల్గొనండి

హనుమకొండ కల్చరల్, జనవరి 21: అయోధ్య శ్రీరాముడి శోభాయాత్రలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని వరంగల్ ఫర్నిచర్ మర్చంట్ అసోసియేషన్, శ్రీభద్రకాళి పరపతి సంఘం ప్రతినిధి గట్టు మహేష్ బాబు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సోమవారం అలంకార్ జంక్షన్‌లో మధ్యాహ్నం 1 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో సభ్యులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సాయంత్రం 6గంటలకు ఐదు దీపాలను వెలిగించి శ్రీసీతారాముల ఆశిస్సులను కోరాలని వారు కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు కాపీ అందజేత

కాజీపేట టౌన్, జనవరి 21: కాజీపేట 61వ డివిజన్‌కు చెందిన బాధితురాలు పెండ్యాల మౌనిక ఆపరేషన్ కోసం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన కాపీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాధితుల విన్నపం మేరకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షలను మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్‌కు జీవన సాఫల్యత పురస్కారం అందజేత



చంద్రశేఖర్‌కు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ రూరల్, జనవరి 21: శ్రీ భువనేశ్వరి మాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృత పర్చాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హనుమకొండలో ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్‌కు శ్రీ భువనేశ్వరి మాత చారిటబుల్ ట్రస్ట్ 2024 జీవన సాఫల్యత పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వేయిస్తంభాల దేవాలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకుడు శేషు, తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘం సమాఖ్య అధ్యక్షుడు జగన్‌మోహన్‌శర్మ, వరంగల్ జిల్లా జడ్పీ సీఈవో రాంరెడ్డి, భూపాల్‌రెడ్డి, వద్దిరాజు గణేష్, ట్రస్టు చైర్మన్ మోత్కూరి రాము, ప్రధాన కార్యదర్శి కంచనకుంట్ల పద్మజ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

నేడు బల్దియా ప్రజావాణి

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 21: వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరగనుంది. హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ప్రజావాణి ప్రారంభం కానుంది. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారు.



ఆమె గమ్యం... సురక్షిత ప్రయాణం

పదిహేడేళ్ళ కూతుర్ని పోగొట్టుకున్న విషాదాన్ని... మరెవరికీ అలాంటి బాధ కలగకుండా చూడాలనే సంకల్పంగా మార్చుకున్నారు మృదుల్ భాసిన్. రహదారి భద్రతపై అవగాహన కల్పించడానికి ఇరవై మూడేళ్ళుగా నిరంతర కృషి సాగిస్తున్నారు. "బయటకు వెళ్ళినవారు ఇంటికి సురక్షితంగా తిరిగి రావాలి. మనందరిదీ అదే లక్ష్యం కావాలి" అంటున్న మృదుల్ ప్రయాణమిది.

"దుర్వాని తలుచుకుంటే 'తను దూరమై అప్పుడే పాతికేళ్ళు గడిచిపోయాయా?' అనిపిస్తుంది. తన నవ్వు ముఖం, ఆ చురుకుతనం ఇంకా కళ్ళముందు కదులుతూనే ఉన్నాయి. 'మమ్మీ' అనే తన పిలుపు నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది. మా జీవితాల్ని మార్చేసిన ఒక దుర్ఘటన గురించి చెప్పే ముందు... మా కుటుంబం గురించి చెప్పాలి. మాది రాజస్థాన్‌లోని జైపూర్. నాకు బాల్యం నుంచి సాహిత్యం అంటే ఆసక్తి. రచయిత్రిని కావాలనుకొనేదాన్ని. జైపూర్‌లో ఎం.ఏ. అయ్యాక... అమెరికాలోని ఎమోరీ యూనివర్సిటీ నుంచి అమెరికన్ సాహిత్యంలో పిహెచ్‌డి చేశాను. ఐటీసీ గ్రూప్‌లో పబ్లిక్ రిలేషన్స్ మేనేజర్‌గా చేరాను. నా భర్త ప్రమోద్ సొంత వ్యాపారం నిర్వహించేవారు. మాకు ఇద్దరు పిల్లలు, శాంతను, దుర్వా. చిన్నప్పటి నుంచీ దుర్వా చురుకైనది. చదువులో ఫస్ట్. క్రీడల్లో ఫస్ట్ కథక్ నృత్యంలో ప్రావీణ్యత సంపాదించడమే కాదు... ఆ నృత్య రీతి ద్వారా కథలు చెప్పే 'కథాకార్' సంప్రదాయంలోనూ శిక్షణ పొందింది. ఆమె కలలు, మా బతుకులు ఒకే సారి కుప్పకూలిపోతాయని అప్పుడు మేం ఊహించలేదు.

ఆ టీచర్ రూపంలో...

అది 1999 మే మూడో తారీకు. కాలేజీకి వెళ్తున్న పదేహేడేళ్ళ దుర్వాను... వెనుక నుంచి వస్తున్న ప్రభుత్వ స్కూల్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదానికి కారకుడైన ఆ గవర్నమెంట్ డ్రైవర్ అప్పటికి కొన్ని నెలల కిందటే తాగి వాహనం నడిపి సస్పెండ్ అయ్యాడు. ముందురోజే మళ్ళీ డ్యూటీలో చేరి, ఈ యాక్సిడెంట్ చేశాడు. ప్రమాదంలో దుర్వాకు తీవ్రంగా గాయాలయ్యాయి. ఆ డ్రైవర్, బస్సులోని టీచర్లు, రోడ్డుపై జనం... చూస్తూ నిలబడ్డారే తప్ప.. ఒక్కరూ దుర్వాకు సాయం చెయ్యడానికి ముందుకు రాలేదు. అంబులెన్స్‌కైనా ఫోన్ చెయ్యలేదు. పోలీసులు వచ్చి ఆమెను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దుర్వా ప్రాణాలు పోయాయి. ఆ వార్త తెలిసి మేం కుప్పకూలిపోయాం. ఎందరో వస్తున్నారు. ఓదార్చి, ధైర్యం తెచ్చుకోవాలని చెప్పి వెళుతున్నారు. నిర్లిప్తతలోనే కొన్నాళ్ళు గడిచింది. అలాగే ఉంటే ఏమైపోయేవాళ్ళమో! కానీ దుర్వా టీచర్ సందీప్ సేథీ రూపంలో... భగవంతుడు మా బాధను కొంతైనా మరచిపోయే మార్గం చూపించాడు. "మీ అమ్మాయి మీ జ్ఞాపకాల్లో ఎప్పుడూ శాశ్వతంగానే ఉంటుంది. కానీ ఆమెకు జరిగిన ప్రమాదంలో తప్పెవరిది? నిబంధనలు పాటించని డ్రైవర్‌దా? ఫిట్‌నెస్‌ను నిర్ధారించకుండా వాహనం నడిపేందుకు అనుమతించిన స్కూలు వర్గాలదా? అధికారులదా? వేడుక చూస్తూ ఉండిపోయిన ప్రజలదా? నా దృష్టిలో అందరూ అపరాధులే. నాకు ఆప్తులైన చాలామంది రోడ్డు ప్రమాదాల్లో మరణించారు. ఈ దుర్ఘటనలను కొంతమేరకైనా ఆపాలంటే... సమాజంలో అవగాహన కల్పించాలి. దాని కోసం మీరొక ఎన్జీవో ఎందుకు ఏర్పాటు చేయకూడదు?" అని అడిగారు.



ఆ సూచన మాకు ఎంతగానో నచ్చింది. 'ముస్కాన్ ఫౌండేషన్ ఫర్ రోడ్ సేఫ్టీ'కి అలా బీజం పడింది. రహదారి భద్రతపై అవగాహన, శిక్షణ, సూచనలు అందించడానికి కృషి చేసే లాభాపేక్షలేని ఛారిటబుల్ ట్రస్ట్‌గా 2001లో దాన్ని రిజిస్టర్ చేశాం. 'ఏదైనా పని తలపెట్టినప్పుడు... పూర్తిగా దానిమీదే దృష్టి పెట్టాలి. అప్పుడే దానికి న్యాయం చెయ్యగలం' అనేది నా విశ్వాసం. అందుకే ఉద్యోగం మానేశాను. సమయం అంతటినీ ట్రస్టుకే కేటాయిస్తున్నాను. కొన్నాళ్ళ తరువాత నా భర్త ప్రమోద్ కూడా ట్రస్టుకే అంకితమయ్యారు. మా అబ్బాయి శాంతను వారానికి మూడు రోజులపాటు మాతో కలిసి పని చేస్తున్నాడు.

ఎన్నో వర్గాల భాగస్వామ్యం

ట్రాఫిక్, రవాణా, రహదారి భద్రతలకు సంబంధించి మనం నిర్లక్ష్యం చేస్తున్న అంశాలు ఎన్నో ఉన్నాయి. వాటిని ప్రజలకు వివరించి, చైతన్య పరచడం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. ప్రపంచంలోని రోడ్డు ప్రమాదాల్లో 11 శాతం మన దగ్గరే చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రహదారి భద్రతపై అన్ని వర్గాలవారూ మరింత దృష్టి కేంద్రీకరించవలసిన అవసరం ఉంది. దానికోసం మా కార్యకలాపాల్లో పోలీసులను, ఉపాధ్యాయులను, విద్యార్థులను, సాధారణ ప్రజానీకాన్నీ భాగస్వాములుగా చేశాం. ట్రాఫిక్ పోలీసులు, రహదారి భద్రతా నిపుణులు, విద్యావేత్తల అభిప్రాయాలు తీసుకొని... బడి పిల్లలకు బోధించడానికి ఒక ప్రణాళిక తయారు చేశాం. రోడ్ షోలు, వీధి నాటకాలు, పాటలు, పప్పెట్ షోలు, ఇంద్రజాల ప్రదర్శనలు లాంటి వాటి ద్వారా రహదారి భద్రత గురించి అవగాహన కల్పిస్తున్నాం. 2020లో మొదటిసారిగా దాదాపు పదిహేను సంస్థలు, ప్రభుత్వ విభాగాలతో కలిసి రోడ్డు ప్రమాదాల్లో మరణించినవారికి నివాళిగా ఒక కార్యక్రమం నిర్వహించాం. ఆ కార్యక్రమంలో... బాధిత కుటుంబాలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నాయి. రాజస్థాన్‌లోనే కాదు, ఇతర ప్రాంతాల్లో కూడా ప్రజల్లో చైతన్యం తేవడానికి మా ట్రస్ట్ ఇలాంటి కార్యక్రమల ద్వారా ప్రయత్నిస్తోంది. ప్రమాదాలకు సాక్షులుగా ఉన్నవారు 'తమకెందుకులే' అని నిర్లిప్తంగా ఉండడానికి ప్రధాన కారణం... పోలీస్ స్టేషన్లకూ, కోర్టులకూ వెళ్ళాల్సి ఉంటుందన్న బెరుకు, ప్రమాదకారకుల నుంచి ముప్పు కలుగుతుందేమోననే భయం. వాటిని పోగొట్టడానికి పటిష్ఠ చట్టాలు అమలు కావాల్సిన అవసరం ఉంది. దానికోసం వివిధ సంస్థలతో కలిసి పని చేస్తున్నాం.

సమాజాన్ని కోరుతున్నది అదే...

ఈ రంగంలో ఇంతకాలంగా పని చేస్తున్న ఎన్జీవో దేశంలో మాదే. ప్రమాద సమయాల్లో తక్షణ సాయం అందే మౌలిక సదుపాయాల కోసం, వాహన చోదకుల ప్రవర్తనల్లో మార్పు కోసం దక్షిణాసియాలో పని చేస్తున్న వారిలో ఒకరుగా నన్ను పలు సంస్థలు గుర్తించాయి. అయితే మాలాంటి వారు ఎన్ని కార్యక్రమాలు నిర్వహించినా... పౌర చైతన్యం, వాహనాలు నడిపేవారి ధోరణుల్లో మార్పు రాకపోతే ప్రయోజనం ఉండదు. మత్తు పదార్థాలు సేవించి వాహనాలు నడపడం, అతి వేగం, నిర్లక్ష్యం, నియమాలు ఉల్లంఘనలతో వాహనాలు నడిపేవారు బాధిత కుటుంబాల వేదన గురించి ఆలోచించాలి. వాహనచోదకులు కూడా తాము లేకపోతే తమ కుటుంబం పరిస్థితి ఏమిటనేది దృష్టిలో పెట్టుకోవాలి. మా అమ్మాయి దుర్వా ఎప్పుడూ నవ్వుతూ ఉండేది. ఎవరికైనా బాధ కలిగితే అల్లాడిపోయేది. ఆమె స్ఫూర్తిని కొనసాగించడం, సురక్షిత ప్రయాణం గురించి వీలైనంతగా ప్రచారం చెయ్యడం ద్వారా అందరి ముఖాల్లో చిరునవ్వులు చూడాలన్నదే మా తాపత్రయం."



ది హార్ట్ ఆఫ్ రామాయణ్



పర్యావరణ హితం... రామాయణ ఘట్టం... ఒకే కాన్వాస్‌పై అత్యద్భుతంగా ఆవిష్కృతమైన నిలువెత్తు 'చిత్రం' ఇది. 'సమస్త సృష్టికి ఆధారభూతమైన భూమి పట్ల మానవాళి కృతజ్ఞతతో ఉంటే ప్రకృతి ఆశీర్వాదం లభిస్తుంది' అనే సందేశాన్ని ఇస్తూ... ప్రముఖ చిత్రకారుడు వెంకటేశ్ కందునూరి ఈ అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ వేశారు.

కృతజ్ఞతకు చిహ్నంగా నమస్కరిస్తున్న హనుమంతుడు... ఆశీర్వాదానికి చిహ్నంగా అభయహస్తంతో శ్రీరాముడు... ఇందులో మనకు కనిపిస్తారు. అంతేకాదు... త్రిమూర్తులు, దశరథ, కౌసల్య, సుమిత్ర, కైకేయి, సీతమ్మవారు, వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, మారీచుడు, మాయలేడీ, రావణ విభీషణ కుంభకర్ణాదులు, వానరులు... శ్రీరామ జననం నుంచి లవకుశల పట్టాభిషేకం వరకు రామాయణాన్ని మలుపు తిప్పిన పాత్రలు... ప్రకృతితో మమేకమైన మానవాళి జీవన విధానానికి గుర్తుగా చెట్లు చేమలు, పక్షులు, భూమి, సూర్య చంద్రాదులు ఈ చిత్రంలో దర్శనమిస్తాయి.

అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం నిధుల సేకరణలో భాగంగా 'రామతీర్థ ట్రస్టు' వారు చేపట్టిన కార్యక్రమానికి తనవంతు బాధ్యతగా వెంకటేశ్ ఈ పెయింటింగ్ వేశారు. దీన్ని గీయడానికి ఆరు మాసాలకు పైగా సమయం పట్టింది. శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని... ఈ చిత్రాన్ని ట్రస్టుకు బహూకరించారు. దీని ద్వారా వచ్చిన మొత్తాన్నీ మందిరం నిర్మాణానికి విరాళంగా ఇవ్వనున్నారు. మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచ గ్రామానికి చెందిన వెంకటేశ్... జేఎన్‌టీయూ ఫైన్‌ఆర్ట్స్‌లో బీఎఫ్ఏ చేశారు. ఆయన రామ భక్తుడు.

స్వశక్తి

అప్పుడు గాల్లో తేలినట్టు ఉంటుంది!

నాన్న చెప్పినట్టు లాయర్‌గా కేసులు వాదించాలా..? మనసు కోరుకున్నట్టు కెమెరా ముందు అభినయించాలా..? ఆమె ముందు రెండు దారులు... చివరకు మనసు మాటే విన్నది చాందినీ భబ్డా. ఇప్పుడు అదే ఆమెను రొటీన్ ఉద్యోగాలకు భిన్నంగా... నలుగురిలో ప్రత్యేకంగా నిలబెట్టింది. కామెడీ కంటెంట్ క్రియేటర్‌గా... మిమిక్రీ ఆర్టిస్ట్‌గా... లక్షల మందికి నెట్టింట వినోదాన్ని పంచుతున్న 24 ఏళ్ల చాందినీ జర్నీ ఇది...

"చెబితే నమ్మరు కానీ... పదేళ్ల కిందటే నేను ఈ కంటెంట్ రూపొందించడం మొదలుపెట్టాను. అంటే నేను బడికి వెళ్లే రోజుల్లో. యూట్యూబ్ చానల్స్ ఇన్‌స్టాల వంటి వాటిపై అప్పుడు నాకు పెద్దగా అవగాహన కూడా లేదు. కెమెరా ముందు నిల్చొని ఏదో నాకు నచ్చింది... నాకు తోచింది... చేసుకొంటూ వెళ్లిపోయాను. ఎలా అబ్బిందో తెలియదు కానీ... నాకు మిమిక్రీ అంటే చాలా ఇష్టం. టీవీల్లో సినిమాలు చూస్తూ... వాటిలో డైలాగులు అనుకరించేదాన్ని. నాకు బాగా నచ్చిన తార అలియాభట్. ఆమె మీద ఉన్న ఇష్టంతో ఆమె చిత్రాల్లోని డైలాగులతో వీడియోలు చేసేదాన్ని. స్కూల్లో మా టీచర్లను, స్నేహితుల్లా హావభావాలు ప్రదర్శించేదాన్ని. అలా పదిహేనేళ్ల వయసులో మొదలుపెట్టిన మిమిక్రీ వీడియోలు ఇవాళ నన్ను మరో స్థాయికి తీసుకువెళ్లాయి. లక్షలమంది ఆదరణకు కారణమయ్యాయి.

చదువుకొంటూనే...

నా అభిరుచే నా కెరీర్ అవుతుందని ఎన్నడూ ఊహించలేదు. నేను పుట్టి పెరిగింది ముంబయిలో. మా నాన్న క్రిమినల్ లాయర్. ఆయన స్ఫూర్తితోనే నేను కూడా లాయర్ కావాలనుకున్నాను. అయితే నాకు స్కూల్లో ఎక్కువ స్నేహితులు ఉండేవారు కాదు. నాలో నేనుగా... ఒంటరిగానే గడిపేదాన్ని. ఆ సమయంలో నాకున్న ఒకే ఒక్క ప్రియ నేస్తం... కెమెరా. నటనంటే నాకు విపరీతమైన ఇష్టం. సినిమాల్లోని ఓ సన్నివేశాన్ని తీసుకొని... వారి గొంతుతో మిమిక్రీ చేస్తూ, సరదాగా నటించేదాన్ని. ఇదంతా రికార్డు చేసుకొనేదాన్ని. చదువుతో పాటు ఒక పక్క ఇవన్నీ నడుస్తూ ఉండేవి. వీడియో జాకీగా కొన్నాళ్లు పని చేశాను. చాలా లైవ్ షోలకు యాంకర్‌గా వ్యవహరించాను.

నచ్చింది చేయాలని...

ఎప్పుడూ నా లోకంలో నేను ఉండేదాన్ని. ఇంట్లో అమ్మానాన్నలు కూడా నాకు స్వేచ్ఛనిచ్చారు. ఎందుకంటే... వారి ఆకాంక్షకు తగ్గట్టుగా చదివేదాన్ని. వీటన్నిటి నేపథ్యంలో నాకు అర్థమైంది ఏంటంటే... కంటెంట్ క్రియేషన్‌లో స్వేచ్ఛ ఉంటుందని... దాని ద్వారా ఎదుటివారి మోముపై నవ్వులు పూయించవచ్చని! ఈలోగా నా ఐదేళ్ల లా పూర్తయింది. అప్పుడు నా ముందు ఉన్నవి రెండు దారులు... నాన్న వారసత్వాన్ని కొనసాగిస్తూ... ఆయన ఆకాంక్షను గౌరవిస్తూ లాయర్‌గా కొనసాగడం. రెండోది... నా మనసుకు నచ్చినట్టు కెమెరా ముందు నటనాభినయంతో నలుగురినీ నవ్వించడం. ఎటు వైపు వెళ్లాలి? నేను నా మనసు చెప్పిన బాటలోనే నడిచాను. నిజంగా తేల్చుకోవడం చాలా క్లిష్టమైన విషయం. పెద్దవాళ్లు చూపిన మార్గాన్ని తోసిపుచ్చలేం. ఎందుకంటే తమ పిల్లల బంగారు భవిష్యత్తు గురించే వాళ్లు కలలు కంటారు. మన ఎదుగుదలలోనే వారి సంతోషాన్ని వెతుక్కొంటారు. అంతే తప్ప వాళ్ల మాటే చెల్లుబాటు కావాలనే పట్టుదలతో కాదు. అది నేను అర్థం చేసుకోగలను. అదే సమయంలో మన మనసు మాట కూడా వినడం ముఖ్యం. అందుకే వారి కోణం నుంచి కూడా ఆలోచించి... నా అభిరుచి గురించి వివరించాను. వాళ్లు అంతే పెద్ద మనసుతో నన్ను అర్థం చేసుకున్నారు. నా మార్గం నేను నిర్మించుకోవడానికి స్వేచ్ఛనిచ్చారు. అన్నిటికీ మించి ఉదయం ఐదింటికి వెళ్లి సాయంత్రం ఐదింటికి వచ్చే మూస ఉద్యోగాలు నాకు అస్సలు నచ్చవు. ఎప్పుడూ కొత్తదనం ఉండాలనుకొంటాను.

ప్రయత్నించి చూద్దామని...

అమ్మా నాన్నల అంగీకారంతో... నాకు ఇష్టమైన కంటెంట్ సృష్టించే మార్గంలో నా అన్వేషణ మొదలైంది. అప్పటికే లెక్కకు మించి యూట్యూబ్ చానల్స్ ఉన్నాయి. వాటిని దాటి నా వరకు రావాలంటే... నాకంటూ ఒక ప్రత్యేకత ఉండాలి కదా. దాన్ని దృష్టిలో పెట్టుకుని... ఎప్పటికప్పుడు విభిన్నమైన కంటెంట్ ఇవ్వాలని నిర్ణయించుకున్నా. కెమెరా నాకు కొత్తేమీ కాదు. నెటిజనులకు ఏమి కావాలో తెలుసుకోగలిగితే చాలు. కొన్నాళ్లు ప్రయత్నించి చూద్దామనుకున్నా. ఒకవేళ విజయం సాధించలేకపోతే ఎలాగూ చేతిలో లా డిగ్రీ ఉంది కదా. ఆ ధైర్యంతోనే మొదలు పెట్టాను. అమ్మానాన్నలను రెండేళ్ల సమయం ఇవ్వమని కోరాను. ఈ రెండేళ్లలో నేను అనుకున్నది సాధించలేకపోతే తరువాత మీరు ఎటు నడవమంటే అటు నడుస్తానని చెప్పాను. అదృష్టం కావచ్చు... నా కంటెంట్‌లో కొత్తదనం కావచ్చు... మొత్తానికి 'చాందిని మిమిక్' పేరుతో నేను ప్రారంభించిన యూట్యూబ్ చానల్‌కు విశేషం ఆదరణ లభించింది.



అలియాభట్‌లా...

నావన్నీ సరదాగా సాగిపోయే వీడియోలే. ముఖ్యంగా బాలీవుడ్ అందాల తార అలియాభట్‌ను అనుకరిస్తూ చేసే ఏకపాత్రాభినయాలు అధికం. నటనలో, మిమిక్రీలో ఎక్కడా శిక్షణ తీసుకోలేదు. యూట్యూబ్‌లో పాఠాల కోసం వెతకలేదు. నాకు నేనుగా నేర్చుకున్నాను. ఏడేళ్ల కిందట ప్రారంభించిన నా యూట్యూబ్ చానల్‌కు ఇప్పుడు దాదాపు రెండున్నర లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అత్యధిక వీడియోలకు లక్ష పైనే వ్యూస్ వచ్చాయి. 250కి పైగా వీడియోలు అప్‌లోడ్ చేశాను. ఇన్‌స్టాగ్రామ్‌లో నాలుగున్నర లక్షలమందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. అందులో రీల్స్‌కు కూడా విశేష ఆదరణ లభిస్తోంది. 'తరువాతి వీడియో ఎప్పుడు పెడతారు' అని నెటిజనులు ఆసక్తిగా అడుగుతుంటే... అది నాకు ఎంతో ప్రేరణగా అనిపిస్తుంది. బాలీవుడ్ స్టార్స్ నుంచి అప్పుడప్పుడూ అభినందనలు అందుతుంటాయి. అప్పుడైతే గాల్లో తేలిన అనుభూతి కలుగుతుంది.

ఆదాయం... ఆనందం...

ఏదీ నేను ముందుగా అనుకొని చేయను. ఏదైనా మంచి ఆలోచన తడితే... వెంటనే డ్రెస్ మార్చేసుకొని షూటింగ్ మొదలుపెట్టేస్తాను. దీనివల్ల విభిన్నమైన కంటెంట్ వస్తుంది. బహుశా అదే నా ప్రత్యేకత అనుకొంటున్నాను. ఒక ప్రణాళిక వేసుకొని... దాని ప్రకారం వెళితే రొటీన్ అయిపోతుందనేది నా అభిప్రాయం. చాలా బ్రాండ్ల ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరిస్తున్నాను. ఇటీవల 'అమెజాన్ మినీ టీవీ'లో వచ్చిన కామెడీ షో 'కానిస్టేబుల్ గిరప్తే'లో నటించాను. ప్రస్తుతం కార్పొరేట్ ఉద్యోగానికి మించి సంపాదిస్తున్నాను. నాకు నచ్చింది నాకు కుదిరినప్పుడు నేను చేసుకొంటున్నాను. ఈ సంతృప్తిని... ఈ స్వేచ్ఛనే నేను కోరుకున్నది."

నవ్య | చిత్రజ్యోతి



అయోధ్య రాముడికి హను-మాన్ 2.6 కోట్లు

ప్రస్తుతం బాక్సాఫీస్ దగ్గర 'హను-మాన్' ప్రభంజనం వీస్తోంది. భారీ వసూళ్లతో ఈ సినిమా దూసుకుపోతోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే దాదాపుగా 150కోట్ల గ్రాస్ వసూళ్లను ఈ సినిమా రాబట్టిందని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. 'హను-మాన్' విజయానందాన్ని వెలిబుచ్చుతూ, రెండుకోట్ల 66లక్షల 41వేల 55 రూపాయిల మొత్తాన్ని అయోధ్యలో శ్రీరామ చంద్రమూర్తి విగ్రహ ప్రాణప్రతిష్ఠామహోత్సవ శుభసందర్భంలో, అయోధ్య రామమందిరానికి అందజేయనున్నట్టు 'హను-మాన్' చిత్రబృందం ప్రకటించింది. అమ్ముడైన టికెట్ ధర నుంచి 5రూ.ని అయోధ్య రామాలయానికి అందిస్తామని విడుదలకు ముందే నిర్మాత ప్రకటించిన విషయం తెలిసిందే. మాట నిలబెట్టుకుంటూ.. ఇప్పటివరకూ విక్రయించిన 53లక్షల 28వేల 211 టికెట్లలో, ఒక్కో టికెట్ నుంచి 5రూ. చొప్పున మొత్తం రెండుకోట్ల 66లక్షల 41వేల 55 రూపాయిలు రామమందిరానికి నిర్మాత అందించనున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాత నిరంజన్‌రెడ్డి, దర్శకుడు ప్రశాంత్‌వర్మ, కథానాయకుడు తేజా సజ్జా ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఉత్కంఠభరితంగా ఉర్వి




మహేశ్, శ్రుతీశంకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఉర్వి'. కిరణ్ వై దర్శకుడిగా పరిచయమవుతున్నారు. గిరి పయ్యావుల నిర్మాత. ఫిబ్రవరి 2న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్, నవీన్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'తెలంగాణ నేపథ్యంలో రూపొందిన హారర్ చిత్రమిది. నేటి సమాజం ఎదుర్కొంటున్న ఓ సమస్యను తీసుకొని ఆసక్తికరంగా తెరకెక్కించాం. మూడు పాటలూ, నేపథ్య సంగీతం ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని తెలిపారు. అంతా కొత్తవాళ్లమే అయినా కష్టపడి సినిమాను తెరకెక్కించాం అని మహేశ్ చెప్పారు. ఈ చిత్రానికి లక్ష్మణ సాయి సంగీతం అందిస్తున్నారు.

స్ఫూర్తినిచ్చే కథతో 'కంచర్ల'



సమాజానికి స్ఫూర్తినిచ్చే కథతో రూపుదిద్దుకుంటున్న 'కంచర్ల' చిత్రం టాకీ పార్ట్ పూర్తి చేసుకుంది. కంచర్ల ఉపేంద్ర హీరోగా, మీనాక్షి జైస్వాల్, ప్రణీత హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి రెడ్డెం యాదకుమార్ దర్శకుడు. చిత్ర నిర్మాత కంచర్ల అచ్యుతరావు చిత్ర వివరాలు వెల్లడిస్తూ 'యువత రాజకీయాల్లోకి రావాలని, భూస్వాముల దగ్గరున్న భూమిని పేద ప్రజలకు పంచాలన్నది ఈ చిత్రకథాంశం. దీనికి కమర్షియల్ అంశాలు జోడించి ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ప్రస్తుతం పాటల చిత్రీకరణ కేరళ, గోవా, శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లో జరుగుతోంది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి' అన్నారు. 'ఉపేంద్రగాడి అడ్డా' చిత్రంతో తను ప్రేక్షకులకు దగ్గరయ్యానని, ఈ సినిమాతో మరింత గుర్తింపు తెచ్చుకుంటాననీ హీరో ఉపేంద్ర చెప్పారు. సామాజిక స్పృహతో సమాజాన్ని జాగృతం చేసే అంశాలను ఇందులో పొందుపరుస్తునట్లు దర్శకుడు యాదకుమార్ తెలిపారు. సుమన్, అజయ్ ఘోష్, కాశీ విశ్వనాథ్, సుధ, రాజా రవీంద్ర, సుమన్ శెట్టి, దువ్వాసి మోహన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: రఘు కుంచె, ఫొటోగ్రఫీ: గుణశేఖర్, మాటలు: ప్రసాదుల మధుబాబు, సహ నిర్మాతలు: కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత.

బాలరాముడికి అంకితం



తేజేశ్వర్, ప్రజ్ఞ నయన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మిషన్ సి 1000'. కబీర్‌సింగ్, సంజయ్ పాండే, అనీష్ కురువిల్లా కీలకపాత్రలు పోషించారు. తేజేశ్వర్ దర్శకుడు. ఎస్ వీ క్రియేషన్స్ బేనర్‌పై నిర్మించారు. ఈ చిత్రం నుంచి శ్రీరాముని గుణాలను కీర్తిస్తూ సాగే ప్రత్యేక గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. శ్రీధర్ ఆత్రేయ స్వరాలందించగా, విజయ్ ప్రకాశ్ ఆలపించారు. అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఈ పాటను బాల రాముడికి అంకితం ఇస్తున్నామని తేజేశ్వర్ తెలిపారు. మార్చిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని యూనిట్ తెలిపింది. సినిమాటోగ్రఫీ: సుధాకర్.



నటరత్నాల క్రైమ్ కామెడీ..

ఇయన సల్తానా, సుదర్శన్‌రెడ్డి, 'రంగస్థలం' మహేశ్, తాగుబోతు రమేశ్ ప్రధానపాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'నటరత్నాలు'. శివనాగు ఈ చిత్రానికి దర్శకుడు. చంటి యాలమాటి నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను ఘనంగా విడుదల చేశారు. 'క్రైమ్ కామెడీ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు కావల్సినంత వినోదాన్ని పంచుతుంది. సినిమా తీయాలనే ఆశతో పరిశ్రమకు వచ్చినవాళ్లు ఎలా విఫలమవుతున్నారు? ఎలా సఫలమవుతున్నారు? అనే ప్రశ్నలకు సమాధానమే ఈ సినిమా. అడిగినవన్నీ సమకూర్చిన నిర్మాతకు, అన్ని విధాలా సహకరించిన యూనిట్ సభ్యులకూ థ్యాంక్స్ చెప్పుకుంటున్నాను' అని దర్శకుడు శివనాగు అన్నారు. సినిమా విజయం పట్ల నిర్మాత ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన నిర్మాతలు దామోదరప్రసాద్, టి.ప్రసన్నకుమార్, డి.ఎస్.రావు, రామసత్యనారాయణ దర్శకులు కె.ఎస్.రవికుమార్‌చౌదరి, సముద్ర కూడా మాట్లాడారు.

కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్నాం

రాజు దుస్సా

'పాటలు, ఫైట్లు, కామెడీ లాంటివి లేకుండా ఒక కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా '105 మినిట్స్'. డైలాగ్స్ కూడా ఉండవు. అయినా ప్రేక్షకులను అలరిస్తుంది' అని దర్శకుడు రాజు దుస్సా అన్నారు. హన్సిక లీడ్‌రోల్‌లో రాజు దుస్సా తెరకెక్కించిన ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా రాజు దుస్సా సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.



- స్క్రీన్‌ప్లే ఈ సినిమాకు బలం. తర్వాత ఏం జరగబోతోందో ప్రేక్షకులు ఊహించలేరు. ఒక కనిపించని మనిషి పంచభూతాలను గుప్పిట్లో పెట్టుకొని ఓ అమ్మాయిని ఇబ్బందిపెట్టే క్రమంలో ఏం జరిగిందనేది ప్రధాన కథ.
- ఒకటే పాత్రపైన లెంగ్తీ షాట్ తీస్తే ఎలా ఉంటుంది అనే ఆలోచన నుంచి '105 మినిట్స్' చిత్రం పుట్టింది. సింగిల్ క్యారెక్టర్‌తో రెండున్నర గంటలు ప్రేక్షకులను కూర్చోబెడతాం. ప్రేక్షకులకు రియల్ టైంలో ఎదురుగా కూర్చొని చూస్తున్న అనుభూతినిస్తుంది.
- మా సినిమాటోగ్రాఫర్ ఇచ్చిన సూచనతో ఈ సినిమాకు సింగిల్ షాట్ అనే కాన్సెప్ట్ జతయ్యింది. దీనికి చాలా గ్రౌండ్ వర్క్ చేశాం. హన్సిక కథ వినగానే ఓకే చెప్పారు. చెప్పింది చెప్పినట్లు చేసుకుంటూ వెళ్లారు. ఇందులో ఆమె నటన ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుంది.

మురిసిన మేడారం



ములుగు జిల్లాలోని మేడారం మహాజాతరకు నెలరోజుల గడువు ఉండగానే భక్తుల రాక అధికమైంది. సమ్మక్క, సారలమ్మలను దర్శించుకునేందుకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండగా ఆదివారం 3 లక్షల మందికి పైగా వచ్చారు. దీంతో ఉదయం కొత్తూరు-జంపన్నవాగు మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. - మేడారం

హోరెత్తిన కొమురెల్లి



కోరమీసాల కొమురవెల్లి మల్లన్నకు హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు బోనమెత్తారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పట్నంవారాన్ని ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేలాదిమంది భక్తులు తరలిరావడంతో కొమురవెల్లి జనసంద్రమైంది. - చేర్యాల

లోకం తీరు





చౌడాపూర్‌లో అమ్మకానికి ఉంచిన అంగన్‌వాడీ కోడి గుడ్లు

అంగట్లో అంగన్‌వాడీ కోడి గుడ్లు

» వికారాబాద్ జిల్లా చౌడాపూర్‌లో చోద్యం

కులకచర్ల, జనవరి 21: అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పంపిణీ చేయాల్సిన కోడి గుడ్లు అవి. తెల్లగా మెరిసిపోతున్న ఆ గుడ్లపై నీలి రంగులో ఉన్న తెలంగాణ సర్కారు ముద్ర కొట్టొచ్చినట్టు కనబడుతోంది. అయితేనేం.. దర్జాగా వాటిని రోడ్డు మీద పెట్టి.. రండి బాబూ రండి అంటూ అగ్గువకు అమ్మేస్తున్నారు. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపాల్ గ్రామానికి చెందిన పెంటయ్య డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఇంటి ముందు ఓ స్టాండ్ ఏర్పాటు చేసిన అతడు.. దానిపై అంగన్‌వాడీ గుడ్లను పెట్టి అమ్మకాలు మొదలుపెట్టాడు. రూ.5కే గుడ్డు అంటూ బోర్డు పెట్టాడు. గమనించిన గ్రామస్థులు 600 కోడి గుడ్లను స్వాధీనం చేసుకుని పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, తహసీల్దార్ ప్రభుకు సమాచారం ఇచ్చారు. ఆ గుడ్లను ఐసీడీఎస్ సిబ్బందికి అప్పజెప్పినట్లు తహసీల్దార్ తెలిపారు.

రుతుపవనాలపై వాతావరణ మార్పు ప్రభావం

» దేశంలో 55% తాలూకాల్లో 10% పెరిగిన వర్షపాతం

» వాతావరణ, పర్యావరణ నిపుణుల అధ్యయనంలో వెల్లడి

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 'వాతావరణ మార్పు ప్రభావం' (క్లైమేట్ చేంజ్ ఎఫెక్ట్)తో వాతావరణ పరిస్థితుల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దేశంలో నైరుతి, ఈశాన్య రుతుపవనాల సీజన్‌లలో మార్పులు సంభవించాయని ఒక అధ్యయనం వెల్లడించింది. ఆకస్మికంగా కుంభవృష్టి వర్షాలు, వరదలు.. ఇదే సమయంలో తీవ్రమైన వర్షాభావంతో కరువు పరిస్థితులు, తీవ్ర వడగాడ్పులు వంటివి సంభవిస్తున్నాయని పేర్కొంది. భారత వాతావరణ శాఖ నుంచి తీసుకున్న అంశాలపై స్వతంత్ర అధ్యయన సంస్థ 'ది కౌన్సిల్ ఆఫ్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ (సీఈఈడబ్ల్యూ) 1982 నుంచి 2022 వరకు నిర్వహించిన ఈ అధ్యయనంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. గడచిన దశాబ్ద కాలంలో (2012-2022) ఏర్పడిన వాతావరణ మార్పుల వల్ల నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశంలో 5,650 తాలూకాలకుగాను 4,419 తాలూకాల్లో (55 శాతం) 10 శాతం వర్షపాతం పెరగగా 11 శాతం తాలూకాల్లో వర్షపాతం తగ్గింది. ఇక అక్టోబరులో దేశంలో 48 శాతం తాలూకాల్లో 10 శాతానికిపైగా వర్షపాతం పెరగడంతో ఖరీఫ్‌లో చేతికి వచ్చిన పంటలు నష్టపోతుండడం, రబీ సాగు ఆలస్యం కావడం వంటివి జరుగుతున్నాయని అధ్యయనంలో వెల్లడైంది. గత పదేళ్లలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో తమిళనాడులో 80 శాతం, ఆగ్నేయ తెలంగాణలో 44 శాతం, ఏపీలోని మూడు జిల్లాల్లో 39 శాతం వర్షపాతం పెరిగింది.

కేటీఆర్‌వి ఓర్వలేని మాటలు: జీవన్ రెడ్డి

» కాళేశ్వరం దోపిడీ బిల్లులు కేసీఆర్‌కు పంపాలా?: విజయశాంతి

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దావోస్ సదస్సులో తెలంగాణకు రూ.40 వేల కోట్ల పెట్టుబడులు రావడాన్ని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. లండన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన దాంట్లో తప్పేముందంటూ ప్రశ్నించారు. ఆదివారం అసెంబ్లీ మీడియా హాల్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ద్రోహం చేస్తే పాతిపెట్టాలన్న కాళోజీ మాటలు బీఆర్ఎస్ నేతలకు వర్తిస్తాయని, అందుకే సీఎం రేవంత్ అలా మాట్లాడారని చెప్పారు. కేసీఆర్ ధనదాహానికి కాళేశ్వర కుంగుబాటే ప్రత్యక్ష ఉదాహరణ అన్నారు. కరెంటు బిల్లులు కట్టవద్దని చెప్పడానికి కేటీఆర్‌కు ఏం హక్కు ఉందని నిలదీశారు. రాష్ట్రంలో అదానీ పెట్టుబడులు పెడితే బీఆర్ఎస్ వాళ్లకేం నొప్పని ప్రశ్నించారు. కరెంటు బిల్లులు సోనియా గాంధీకి పంపించమంటున్న కేటీఆర్.. కాళేశ్వరం దోపిడీ బిల్లులు కేసీఆర్ ఇంటికి పంపాలని చెప్పాలంటూ కాంగ్రెస్ నేత విజయశాంతి ఎద్దేవా చేశారు.

ప్రదేశ్ ఎన్నికల కమిటీ భేటీ వాయిదా..

రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి గాంధీభవన్‌లో సోమవారం జరగాల్సిన తెలంగాణ ప్రదేశ్ ఎన్నికల కమిటీ సమావేశం వాయిదా పడింది. అలాగే, సోమవారం జరగాల్సిన టీపీసీసీ ఎన్నికల మేనిఫెస్టో కమిటీ భేటీ మంగళవారానికి వాయిదా పడింది.

కార్మికుల కష్టార్జితం..

కాంట్రాక్టర్ల జేబులోకి..!

నెలకు రూ.2.60 కోట్ల దోపిడీ.. వేతనాలు, పీఎఫ్‌లో కోత.. జీతంలోనే నెలకు వెయ్యి ఎగవేత

» సర్కారీ దవాఖానాల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది గగ్గోలు

» జీవోలో వారి జీతం రూ.15,600

» ఇచ్చేది మాత్రం రూ.11,000

» రాష్ట్రంలో 10 వేల మంది వర్కర్లు

» ఫిబ్రవరిలో ఆందోళనలకు నిర్ణయం



హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సర్కారీ దవాఖానల్లో పనిచేసే కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది కష్టాన్ని కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారు. ఇచ్చే అరకొర జీతంలోనూ కోత పెడుతున్నారు. లెక్కల్లో మాత్రం పూర్తిగా చెల్లిస్తున్నట్లు చూపుతున్నారు. ఇలా నెలకు రూ.2.60 కోట్ల దోపిడీకి పాల్పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సర్కారీ దవాఖానాల్లో 10 వేల మందికిపైగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ విభాగాల్లో పనిచేస్తున్నారు. ఇందులో ఒక్క హైదరాబాద్‌లోనే 4 వేల మంది ఉన్నారు. మొదట్లో వీరికి వేతనాలు చాలా తక్కువ. ఆ తర్వాత పీఆర్సీ మేరకు వేతనాలు పెంచారు. ఈ మేరకు 11 జూన్ 2021న అప్పటి ప్రభుత్వం జీవో నంబరు 60 విడుదల చేసింది. గ్రేడ్-1 వర్కర్ల కింద వచ్చే వీరికి రూ.15,600 వేతనం ఇవ్వాలని పేర్కొంది. ఇందులో పీఎఫ్, ఈఎస్ఐ కింద రూ.3,507 కట్ చేయాలి. మిగిలిన రూ.12,093ను వర్కర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలి. కానీ అలా జరగడం లేదు. ప్రస్తుతం కేవలం రూ.11,000 జమ చేస్తున్నారు. మిగిలిన రూ.1,093 మ్యాన్‌పవర్ ఏజెన్సీల కాంట్రాక్టర్లు నొక్కేస్తున్నారు. ఇదొక్కటే కాదు నిబంధనల మేరకు వర్కర్ల వేతనాల నుంచి పీఎఫ్ కింద 12 శాతం, ఈఎస్ఐ కింద కింద 0.75 శాతం మాత్రమే కట్ చేయాలి. దీనికి మ్యాన్‌పవర్ ఏజెన్సీ పీఎఫ్‌లో తన వాటా కింద 13.25 శాతం, ఈఎస్ఐ కోసం 4 శాతం జమ చేయాలి. వర్కర్లు, ఏజెన్సీ వాటా కలిపి 30 శాతం ఉండాలి. కానీ మొత్తం 30 శాతాన్ని వర్కర్ల వేతనాల్లోనే కోత పెడుతున్నారు. ఇలా కార్మికులు ప్రతి నెలా రూ.2.60 కోట్లు కోల్పోతున్నారు. దీనిపై కార్మిక సంఘాల నేతలు పలుమార్లు వైద్య విద్య సంచాలకులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. గతేడాది కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శిని కలసి జీవో ప్రకారం వేతనాలు అందడం లేదని, చర్య తీసుకోవాలని కోరారు. అయితే గత సర్కారు స్పందించలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో మరోమారు కార్మికులంతా ఇటీవల డీఎంఈని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ విషయంలో వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర కార్మిక శాఖ ఉన్నతాధికారులకు కూడా లేఖలు రాశారు. కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ పేరిట కట్ చేస్తున్న మొత్తాన్ని కూడా సరిగా జమ చేయడం లేదు. ఉద్యోగుల్లో 56 దాటిన వారికి పీఎఫ్ కట్టడం లేదని తెలిసింది. ఫిబ్రవరి మొదటి వారం వరకు సమయం ఇచ్చి ఆపై ఆందోళనలు నిర్వహించాలని వారు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

పడకల సంఖ్యకు తగ్గట్లు సిబ్బంది ఏరీ?

ప్రభుత్వం నిబంధనల ప్రకారం సర్కారీ దవాఖానల్లో ప్రతి వంద పడకలకు కచ్చితంగా 45 మంది శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ సిబ్బంది ఉండాలి. కానీ ఎక్కడా ఈ నిష్పత్తిలో వర్కర్లు ఉండటం లేదు. ఉదాహరణకు గాంధీ ఆస్పత్రిలో 1,690 పడకలు ఉన్నాయి. నిబంధనల మేరకు 750 మంది వర్కర్లు ఉండాలి. కానీ అధికారిక లెక్కల ప్రకారం 1,012 పడకలే చూపుతున్నారు. దాని ప్రకారం 450 మంది వర్కర్లు మాత్రమే పనిచేస్తున్నారు. ఉస్మానియాతో పాటు మిగతా ఆస్పత్రుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

కొత్త ప్రభుత్వమైనా న్యాయం చేయాలి

పీఎఫ్, ఈఎస్ఐ వాటాను కూడా వర్కర్ల వేతనాల నుంచే కట్ చేయడం అన్యాయం. దీనిపై పలుమార్లు గత డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశాం. కార్మిక శాఖ కమిషనర్ దృష్టికీ తీసుకెళ్లాం. కొత్త ప్రభుత్వమైనా న్యాయం చేయాలని కోరుతున్నాం.

- ఎం.నర్సింహ, అధ్యక్షుడు, కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ

ఆది, సోమవారాల్లో నిర్విరామంగా రాజన్న దర్శనం

» మేడారం జాతర ముగిసే వరకు వేములవాడలో అమలు



వేములవాడ, జనవరి 21: మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నేపథ్యంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇకపై, ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు భక్తులకు నిర్విరామంగా రాజన్న దర్శనం కల్పించనున్నారు. రాబోయే నాలుగు వారాల పాటు ఈ నిర్ణయం అమలులో ఉంటుంది. ప్రతీ ఏటా ఫిబ్రవరిలో జరిగే మేడారం జాతరకు వెళ్లే భక్తులు ముందుగా రాజన్నను దర్శించుకుంటారు. మరోవైపు, మహా శివరాత్రి కూడా సమీపిస్తుండడంతో వేములవాడలో భక్తుల రద్దీ క్రమంగా పెరుగుతోంది. సర్వదర్శనం కోసం మూడు నుంచి నాలుగు గంటలు, కోడెమొక్కు చెల్లింపు కోసం ఐదు నుంచి ఆరు గంటలకు పైగా భక్తులు క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉంది. రాబోయే రోజుల్లో రద్దీ మరింత పెరగనుంది. దీంతో రాబోయే నాలుగు వారాల్లో ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు స్వామివారి ఆలయాన్ని భక్తుల కోసం తెరిచి ఉంచాలని నిర్ణయించారు. ఆదివారం రాత్రి నిశి పూజ అనంతరం కూడా స్వామి వారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఈనెల 28వ తేదీ, ఫిబ్రవరి 4, 11, 18 తేదీల్లో రాత్రి వేళల్లో కూడా భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని, కోడె మొక్కు చెల్లించుకోవచ్చని ఆలయ ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు వెల్లడించారు.

బుక్కిన బియ్యాన్ని కక్కిస్తున్న విజిలెన్స్!

రైస్ మిల్లుల్లో బృందాలుగా తనిఖీలు.. కేసుల నమోదు కంటే.. రికవరీపై దృష్టి

» బకాయిలను పూర్తి చేయాల్సిందేనంటూ ఒత్తిళ్లు

» తంటాలు పడుతున్న రైస్ మిల్లర్లు

» పక్క రాష్ట్రాల నుంచి బియ్యం కొనుగోళ్లు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): రైస్‌మిల్లర్లు అప్పనంగా బుక్కేసిన బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కక్కిస్తోంది. కేసులు పెడితే.. నిత్యావసరాల చట్టంలోని సెక్షన్ 6(ఏ), ఐపీసీలోని సెక్షన్ 420(చీటింగ్) మాత్రమే మార్గాలు. ఇవి కోర్టుల్లో సులభంగా బెయిల్ వచ్చే సెక్షన్లు. దీంతో కేసులు, దర్యాప్తులంటూ సాగదీయకుండా.. రికవరీ లక్ష్యంగా విజిలెన్స్ బృందాలు పనిచేస్తున్నాయి.

42 లక్షల మెట్రిక్ టన్నులు..!

మిల్లర్లు 2022-23 వానాకాలం సీజన్‌కు 7 లక్షల మెట్రిక్ టన్నులు, యాసంగిలో 35 లక్షల టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంది. ఈ బకాయిల రికవరీ విషయంలో గత సర్కారు తాత్సారం చేసింది. రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చాక.. పౌరసరఫరాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పలు దఫాలుగా సమీక్షలు నిర్వహించారు. పౌరసరఫరాల కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి డీఎస్ చౌహాన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. పలు భేటీల తర్వాత మిల్లర్లు బుక్కిన బియ్యాన్ని రికవరీ చేయాల్సిందేనని నిర్ణయించారు. ఆ టాస్కును విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి అప్పగించారు. ఈ నెలాఖరులోగా రికవరీ చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ రంగంలోకి దిగడంతో పౌరసరఫరాల యంత్రాంగంలోనూ ఒక్కసారిగా కదలిక వచ్చింది. ఇంతకాలం మిల్లర్లతో మిలాఖత్ అయ్యారనే ఆరోపణలను ఎదుర్కొంటున్న వారు కూడా ఇప్పుడు ముక్కు పిండి మరీ రికవరీ చేయడానికి నడుంబిగించారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు, పౌరసరఫరాల శాఖ డీఎస్‌వోలు, రెవెన్యూ అధికారులు మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. "మీరు ఏం చేస్తారో తెలియదు..! ఈ నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అప్పగించాల్సిందే.." అని తెగేసి చెబుతున్నారు. తనిఖీలు పెరగడం.. బియ్యం రికవరీకి ఒత్తిళ్లు వస్తుండడంతో వారు కుదేలవుతున్నారు. రికవరీకి సహకరిస్తున్నారు. ఇప్పటికే కొందరు మిల్లర్లు తమ వద్ద ఉన్న నిల్వల్లోంచి మిల్లింగ్ చేయడంపై దృష్టి పెట్టారు. మరికొందరు రేషన్ బియ్యాన్ని అడ్డదారుల్లో కొని రీసైక్లింగ్ చేసి, టార్గెట్‌ను పూర్తిచేస్తున్నారు. ఇంకొందరు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, అప్పగించే పనిలో నిమగ్నమయ్యారు. ధాన్యం అందుబాటులో లేని మిల్లర్లు పక్కరాష్ట్రాలపై ఆధారపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొందరు బియ్యాన్ని తీసుకువస్తుంటే.. మరికొందరు ఏకంగా ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలపై ఆధారపడ్డారు. అక్కడి నుంచి రోజుకు 500 లారీల మేర ధాన్యం, బియ్యం లోడ్లు రాష్ట్రానికి వస్తున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో బియ్యం కొనుగోళ్లకు మిల్లర్లు క్వింటాకు రూ.3,150 నుంచి రూ.3,250 వరకు వెచ్చిస్తుండడం గమనార్హం..! అలా తెస్తున్న బియ్యంలో తేమ ఉంటే.. ఎఫ్‌సీఐ నుంచి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఉండేందుకు దాన్ని డ్రై చేస్తున్నారు.

ఏప్రిల్‌లో లోక్‌సభ ఎన్నికలు

» తెలుగు రాష్ట్రాల్లో ఒకేసారి జరిగే చాన్స్

» బీఆర్ఎస్‌కు ఓటేస్తే మూసీలో వేసినట్లే

» కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ మొదటి వారంలో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని చెప్పారు. కిందటిసారి ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ మొదటి వారంలో ఎన్నికలు జరగవచ్చని అన్నారు. ఎవరు బాధపడ్డా మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయమని తెలిపారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదని తెలిపారు. ఆరు గ్యారెంటీలపై రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లేదని.. ఎప్పుడు అమలు చేయాలో వారికే తెలియడం లేదని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క ఓటు వేసినా మూసీలో వేసినట్లే అని, ఆ పార్టీ తరపున ఒక్క ఎంపీ గెలిచినా రాష్ట్రానికి వచ్చే లాభమేమీ ఉండదని చెప్పారు.

కొత్త మ్యూజియాల ఏర్పాటుకు కేంద్రం సాయం

చార్మినార్/బర్కత్‌పుర, జనవరి 21(ఆంధ్రజ్యోతి): దేశంలో కొత్త మ్యూజియాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాలార్ జంగ్ మ్యూజియంలో ఐదు కొత్త గ్యాలరీలను ప్రారంభించారు. ఆదివారం రాత్రి బీజేపీ హైదరాబాద్ కార్యాలయంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలే లక్ష్యంగా పని చేస్తున్నామని, దీనిలో భాగంగా ఈ నెల 28న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వస్తున్నారని చెప్పారు.

పరిశీలనతోనే కొత్త ఆవిష్కరణలు

శాస్త్ర, సాంకేతిక రంగాలకు కేంద్రం పెద్దపీట.. నిట్ టెక్నోజియాన్‌లో ఈవెంట్లు బాగున్నాయి

» 'ఆంధ్రజ్యోతి'తో ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ సురేశ్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హనుమకొండ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'ఒక కొత్త ఆవిష్కరణను తీసుకురావాలంటే మొదట కావలసింది పరిశీలన.. అధ్యయనం. తర్వాత వాటిని సమన్వయ పరచుకుంటూ జరిపే కృషి. ఇవి ఉంటే పరిశోధన రంగంలో అనుకున్నది సాధించవచ్చు' అంటున్నారు ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త డాక్టర్ టీఎస్ సురేశ్ కుమార్. ఇస్రో అంతరిక్ష కార్యకలాపాల విస్తరణలో కీలక భూమిక పోషించిన, పలు శాటిలైట్ల రూపకర్త అయిన డాక్టర్ సురేశ్ కుమార్ ఆదివారం వరంగల్ నిట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ఆయనతో ముచ్చటించింది. మన దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి, ఇస్రో విజయాలు తదితర అనేక విషయాలపై ఆయన మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

విజయ పరంపరలో ఇస్రో..

ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో) అంతరిక్షానికి సంబంధించి అనేక ప్రయోగాలు విజయవంతంగా చేసింది. చంద్రయాన్ ద్వారా చంద్రుడిపై కాలు మోపాం. మంగళ్‌యాన్‌ను పూర్తి చేశాం. సూర్యుడి రహస్యాలను కనుగొనేందుకు ఆదిత్య ఎల్-1 ప్రాజెక్టును చేపట్టాం. గగన్‌యాన్ లక్ష్యం నెరవేరితే ఇస్రో అంతరిక్ష పరిశోధన రంగంలో మరింత ముందుకు వెళుతుంది. అంతరిక్షంలోకి మనుషులను పంపడానికి అనువైన వ్యోమనౌకలను తయారుచేయగలుగుతుంది.

ఇంకుబేషన్లతో సత్ఫలితాలు..

విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి తగిన ప్రోత్సాహం ఇవ్వడానికి ఏర్పాటు చేసిన ఇంకుబేషన్ సెంటర్లు సత్ఫలితాలను ఇస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని ఏర్పాటు చేసే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. విద్యార్థులు ప్రయోగాలు చేసేందుకు ఇంకుబేషన్ సెంటర్లు ఎంతగానో దోహదపడతాయి. పరిశోధన రంగానికి కేంద్ర ప్రభుత్వం ఎంతో సహకారాన్ని, చేయూతను అందిస్తోంది. అనేక కొత్త ప్రాజెక్టులకు అవసరమైన వనరులను సమకూరుస్తోంది. మన దేశంలో అత్యున్నత విద్యా ప్రమాణాలతో కూడిన నిట్, ఐఐటీ వంటి సాంకేతిక విద్యాసంస్థలు ఉన్నాయి. వీటి నుంచి వచ్చే విద్యార్థులు వజ్రాలతో సమానం.

ఎన్ఈపీలో సైన్స్‌కు అగ్రాసనం

జాతీయ విద్యా విధానంలో సైన్స్‌కు పెద్దపీట వేసేందుకు అన్ని అవకాశాలను కల్పించారు. దేశంలోని నిట్‌లు, ఐఐటీలను మరింత పటిష్ఠం చేసేందుకు కృషి జరుగుతోంది. నిట్, ఐఐటీలో అధునాతన ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలపై రూ.కోట్లు వెచ్చించడం ఇందులో భాగమే.

ప్రతిభకు కేరాఫ్.. వరంగల్ నిట్

దేశంలోని నిట్ కళాశాలల్లో వరంగల్ నిట్‌కు విద్య, పరిశోధనల పరంగా ప్రముఖ స్థానం ఉంది. ఈ టెక్నోఫెస్ట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన సైంటిఫిక్ ఎగ్జిబిట్లు, నిర్వహించిన ఈవెంట్లు, సమర్పించిన పరిశోధనా పత్రాలన్నీ అద్భుతంగా ఉన్నాయి. నిట్ విద్యార్థుల నైపుణ్యానికి ఇవి నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. ఇలాంటి టెక్నోజియాన్లు మరిన్ని జరగాలి.



సాత్విక్/చిరాగ్ రన్నరప్‌తో సరి

కొరియా జోడీకి టైటిల్
సింగిల్స్ విజేతలు షి యు కి, తై జు యింగ్
ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: స్వదేశంలో టైటిల్ ఫేవరెట్‌గా బరిలో దిగిన స్టార్ ద్వయం సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి ఇండియా ఓపెన్ సూపర్ 750 టోర్నీలో రన్నరప్‌గానే సరిపెట్టుకుంది. అయితే ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ప్రత్యర్థి ద్వయం, వరల్డ్ చాంపియన్స్ కాంగ్ మిన్ యుక్/సొ సెంగ్ జే (కొరియా)కి భారత జోడీ సులువుగా లొంగలేదు. 65 నిమిషాలు ఉత్కంఠ భరితంగా జరిగిన టైటిల్ ఫైట్‌లో సాత్విక్/చిరాగ్ 21-15, 11-21, 18-21తో కొరియా జంట చేతిలో పరాజయం చవిచూశారు. ఈ సీజన్‌లో రెండో టోర్నీలోనూ భారత ద్వయం రన్నరప్‌గానే నిలిచింది. గతవారం జరిగిన మలేసియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లోనూ సాత్విక్/చిరాగ్ ఫైనల్లో ఓటమి చవిచూసిన సంగతి తెలిసిందే. మరోవైపు కొరియా జోడీ ఎప్పుడూ భారత ద్వయానికి కొరకరాని కొయ్యగానే ఉంటోంది. రెండు జోడీలు ఐదుసార్లు పరస్పరం తలపడితే మనోళ్లు ఒక్కసారే గెలవడం గమనార్హం. ఇక..ఈ ఫైనల్ తొలి గేమ్‌లో అద్భుతమైన నెట్ గేమ్‌తో ప్రత్యర్థిని బెంబేలెత్తించిన సాత్విక్/చిరాగ్ 11-9తో ఆపై 19-13తో ఆధిక్యం ప్రదర్శించడంతోపాటు అదే ఊపులో గేమ్‌ను సొంతం చేసుకున్నారు. కానీ రెండో గేమ్‌లో భారత ద్వయం ఆట దిగజారగా..ఇదే అదనుగా విజృంభించిన కాంగ్/సెంగ్ ఆ గేమ్‌ను చేజిక్కించుకుంది. నిర్ణయాత్మక గేమ్ మళ్లీ పుంజుకున్న భారత్ జోడీ ప్రత్యర్థిని ముప్పు తిప్పలు పెట్టింది. విరామం తర్వాత రెండు జోడీలు తగ్గేదేలే అనేలా ఆడడంతో ఆధిక్యం తరచూ చేతులు మారుతూ వచ్చింది. చివరగా కొరియా జోడీదే పైచేయి అయింది. మహిళల సింగిల్స్‌లో తై జు యింగ్ విజేతగా నిలిచింది. ఫైనల్లో తైపీ అమ్మాయి తై జు 21-16, 21-12తో రెండో సీడ్ చెన్ యూఫీ (చైనా) చిత్తు చేసింది. పురుషుల సింగిల్స్ తుది పోరులో వరల్డ్ నెం.2 షి యు కి 23-21, 21-17తో లీ చుక్ ఇయు (హాంకాంగ్)ని ఓడించి టైటిల్ అందుకున్నాడు.



సబలెంక

జోకో.. అలవోకగా

- క్వార్టర్స్‌లో ప్రవేశం
- సబలెంక, గాఫ్ సైతం
- పోరాడి నెగ్గిన రుబ్లెవ్



జొకోవిక్

మెల్‌బోర్న్: కెరీర్‌లో 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేసిన వరల్డ్ నెంబర్‌వన్ నొవాక్ జొకోవిక్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించాడు. అలాగే మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్, రష్యన్ బ్యూటీ సబలెంక, నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా)సైతం తమ ప్రత్యర్థులపై నెగ్గారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో జొకో 6-0, 6-0, 6-3 తేడాతో అడ్రియన్ మన్నారినో (ఫ్రాన్స్)ను చిత్తుగా ఓడించాడు. సెర్బియా సూపర్‌స్టార్‌కిది 58వ గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్. దీంతో గతంలో ఇదే ఫీట్‌తో టాప్‌లో ఉన్న రోజర్ ఫెడరర్‌తో జొకో సమంగా నిలిచాడు. అలాగే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుసగా ఇది 32వ విజయం. బుధవారం జరిగే క్వార్టర్స్‌లో అతను టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో తలపడతాడు. గంటా 44 నిమిషాలపాటు సాగిన ప్రీక్వార్టర్‌ఫైనల్లో 17 ఏస్‌లతో బెంబేలెత్తించిన జొకో ఏడు బ్రేక్ పాయింట్లు సాధించాడు. తొలి 13 గేమ్‌లపాటు జొకోవిక్‌కు ఎదురులేకుండా పోయింది. ఆఖరి సెట్‌లో మాత్రం మన్నారినో మూడు గేమ్‌లతో ఉనికి చాటుకున్నాడు. ఇక ఇతర సింగిల్స్ నాలుగో రౌండ్‌ల్లో ఐదో సీడ్ రుబ్లెవ్ (రష్యా) 6-4, 6-7, 6-7, 6-3, 6-0తో అలెక్స్ డి మినార్ (ఆసీస్)పై చెమటోడ్చి నెగ్గాడు. అలాగే గతేడాది సెమీఫైనలిస్ట్, ఏడో సీడ్ స్టెఫనోస్ సిట్సిపాస్ (గ్రీస్)కు షాక్ తగిలింది. అతడిపై టేలర్ ఫ్రిట్జ్ 7-6, 5-7, 6-3, 6-3 తేడాతో గెలవగా, నాలుగో సీడ్ జన్నిక్ సిన్నర్ (ఇటలీ) 6-4, 7-5, 6-3తో ఖచనోవ్ (రష్యా)పై నెగ్గాడు.

మహిళల సింగిల్స్‌లో: డిఫెండింగ్ చాంపియన్ ఎరీనా సబలెంక ఎలాంటి పోటీ లేకుండా 6-3, 6-2 తేడాతో అమండా అనిసిమోవా (అమెరికా)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించింది. అలాగే గాఫ్ 6-1, 6-2తో మగ్దలేనా ఫ్రెక్ (పోలెండ్)పై, తొమ్మిదో సీడ్ క్రెజికోవా (చెక్) 4-6, 6-3, 6-2తో ఎండ్రీవా (రష్యా)పై, కోస్త్యుక్ (ఉక్రెయిన్) 6-2, 6-1తో టిమోఫీవా (రష్యా)పై గెలిచి ముందంజ వేశారు.



మీది బజ్‌బాల్ ఐతే.. మాకు 'విరాట్‌బాల్'

న్యూఢిల్లీ: టెస్టు ఫార్మాట్‌లో ఇంగ్లండ్ జట్టు బజ్‌బాల్ వ్యూహంతో ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగుతుంటుంది. దీనికి దీటుగా భారత్ కూడా విరాట్‌బాల్ గేమ్‌తో వారిని అడ్డుకుంటుందని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ తెలిపాడు. 'విరాట్ ప్రస్తుతం అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అందుకే బజ్‌బాల్‌కు విరాట్‌బాల్‌తో కౌంటర్ ఇస్తాం. భారీ స్కోర్లను ఎలా సాధించాలో కోహ్లీకి తెలుసు. పరిస్థితి ఎలా ఉన్నా ఇంగ్లండ్ దూకుడుగానే ముందుకెళ్తుంటుంది. కానీ ఈ తరహా ఆట భారత్‌లో పనికొస్తుందో? లేదో? చూడాలి. ముఖ్యంగా వారు స్పిన్‌ను ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికర అంశం' అని సన్నీ చెప్పాడు.



షోయబ్‌తో ఎప్పుడో విడాకులు తీసుకుంది

సానియా మీర్జా కుటుంబం వెల్లడి

న్యూఢిల్లీ: షోయబ్ మాలిక్‌తో సానియా మీర్జా గతంలోనే విడాకులు తీసుకుందని ఆమె కుటుంబం ఆదివారం స్పష్టంజేసింది. పాకిస్థాన్ నటి సనా జావెద్‌తో తన నిఖాకు సంబంధించిన ఫొటోను పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షోయబ్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న నేపథ్యంలో..సానియా కుటుంబం స్పందించింది. 'తన వ్యక్తిగత జీవితంలో సానియా ఎప్పుడూ గోప్యతనే పాటించింది. కానీ ఇప్పుడు ఓ విషయాన్ని బహిర్గతం చేయాల్సిన సమయం వచ్చింది. సానియా, షోయబ్ కొన్ని నెలల క్రితమే విడిపోయారు' అని మీర్జా కుటుంబం విడుదలజేసిన ప్రకటనలో వెల్లడించింది. ఇక.. కొత్తగా వివాహ బంధంలోకి అడుగుపెట్టిన షోయబ్‌కు సానియా శుభాకాంక్షలు తెలుపుతూ అతడి నూతన ప్రయాణం సాఫీగా సాగాలని కూడా ఆకాంక్షించినట్టు ఆ ప్రకటనలో తెలిపింది.



రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసైని ఆదివారం కలిసిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు ఉప్పల్ స్టేడియంలో జరిగే భారత్-ఇంగ్లండ్ టెస్టు మ్యాచ్‌కు రావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు.



తలైవాస్ అదుర్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రైడర్లు నరేందర్ (14 పాయింట్లు), అజింక్యా పవార్ (11 పాయింట్లు) చెలరేగడంతో ప్రొ కబడ్డీలో తమిళ్ తలైవాస్ జట్టు అదరగొట్టింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తలైవాస్ 45-28తో బెంగుళూరు బుల్స్‌పై గెలిచింది. బుల్స్ రైడర్ అక్షిత్ (12 పాయింట్లు) ఒంటరి పోరాటం వృథా అయింది. ఆట ప్రారంభంలోనే తలైవాస్ 10-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. తొలి అర్ధ భాగం ముగిసేసరికి 18-9తో స్పష్టమైన ఆధిక్యాన్ని తలైవాస్ సాధించింది. ద్వితీయార్థంలోనూ తలైవాస్ అదే జోరు కొనసాగించడంతో బుల్స్‌కు పరాభవం ఎదురైంది. మరో మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 34-24తో గుజరాత్ జెయింట్స్‌పై నెగ్గింది.

పాక్‌కు ఓదార్పు విజయం

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్‌తో ముగిసిన ఐదు టీ20ల సిరీస్‌లో పాకిస్థాన్ ఎట్టకేలకు విజయం రుచి చూసింది. ఆదివారం జరిగిన ఆఖరిదైన ఐదో మ్యాచ్‌లో పాక్ 42 పరుగులతో నెగ్గింది. అయితే ఈ సిరీస్‌ను కివీస్ 4-1తో దక్కించుకుంది. ముందుగా పాక్ 20 ఓవర్లలో 134/8 స్కోరు చేసింది. రిజ్వాన్ (38) టాప్‌స్కోరర్. స్వల్ప ఛేదనలో కివీస్ తడబడి 17.2 ఓవర్లలో 92 పరుగులకే కుప్పకూలింది. ఫిలిప్స్ (26), అలెన్ (22) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇఫ్తికార్‌కు 3 వికెట్లు దక్కాయి. అలెన్‌కు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ లభించింది.



భారత్‌తో సిరీస్‌కు బ్రూక్ దూరం

లండన్: భారత్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆరంభానికి ముందే ఇంగ్లండ్ జట్టుకు గట్టి షాక్ తగిలింది. మిడిలార్డర్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వ్యక్తిగత కారణాలతో ఈ సిరీస్‌కు దూరమవుతున్నట్టు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ప్రకటించింది. ఈనెల 25 నుంచి జరిగే సిరీస్‌కు బ్రూక్ స్థానంలో డాన్ లారెన్స్‌ను తీసుకుంటున్నట్టు పేర్కొంది. బ్రూక్ ఆడిన 12 టెస్టుల్లో 62.15 అద్భుత సగటుతో 1181 పరుగులు సాధించాడు.

ధిల్లాన్ జంటకు కాంస్యం

కువైట్: ఆసియా ఒలింపిక్ క్వాలిఫికేషన్ షాట్‌గన్‌లో యువ షూటర్ రైజా ధిల్లాన్ జోడీ కాంస్యం పతకం సాధించింది. ఆదివారం జరిగిన మిక్స్‌డ్ స్కీట్ రెండో కాంస్య పోరులో ధిల్లాన్-గుర్‌జోత్ కంగురా జంట 41-39తో కువైట్‌కు చెందిన అల్‌రషీద్ అబ్దుల్లా-అల్‌షమా ఎమాన్ జోడీపై గెలిచింది.

రవి కంచు 'పట్టు'



న్యూఢిల్లీ: ఒలింపిక్ రజత పతక విజేత రవికుమార్ దహియా ఫ్రాన్స్‌లోని నైస్‌లో జరిగిన గ్రాండ్ ప్రీ రెజ్లింగ్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో పతకంతో సత్తా చాటాడు. 61 కిలోల ఫ్రీస్టయిల్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు.

టీమిండియా ముమ్మర ప్రాక్టీసు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా ఈనెల 25 నుంచి ఉప్పల్‌లో జరిగే భారత్-ఇంగ్లండ్ తొలి టెస్టు మ్యాచ్ కోసం టీమిండియా నగరానికి చేరుకుంది. శనివారమే కోచ్ ద్రవిడ్ సహా పలువురు ఆటగాళ్లు రాగా, ఆదివారం తెల్లవారుజామున కెప్టెన్ రోహిత్, కోహ్లీ హైదరాబాద్ చేరుకున్నారు. అనంతరం ఉప్పల్ స్టేడియంలో భారత క్రికెటర్లు రెండు జట్లుగా విడిపోయి ముమ్మరంగా ప్రాక్టీసు చేశాయి. ఇక, అబుధాబి నుంచి బయలుదేరిన ఇంగ్లండ్ జట్టు ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకుంది.

బిజినెస్

మూలధన పెట్టుబడులకే అగ్రప్రాధాన్యం



మౌలిక వసతుల రంగానికి ఉత్తేజం
ఫిబ్రవరి 1న తాత్కాలిక బడ్జెట్

న్యూఢిల్లీ: దేశంలో ప్రైవేటు పెట్టుబడులు ఇప్పటికీ ప్రోత్సాహకరంగా లేకపోవటంతో బడ్జెట్లో ప్రభుత్వం మూలధన పెట్టుబడులను (క్యాపెక్స్) మరింతగా పెంచటంపై దృష్టి సారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆర్థిక వృద్ధిని ఉత్తేజితం చేయడం కోసం మౌలిక వసతులపైనే అధికంగా దృష్టి పెట్టే వీలుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.. ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఫిబ్రవరి ఒకటో తేదీన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాత్కాలిక బడ్జెట్ ప్రతిపాదించనున్నారు. కొవిడ్-19 తర్వాత ప్రభుత్వం క్యాపెక్స్‌కే ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా ఆర్థిక రంగం నిద్రాణ స్థితి నుంచి మేల్కొని పరుగులు తీయడం ప్రారంభించింది. ఫలితంగా గత మూడేళ్ల కాలంలో 7 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోంది. ప్రపంచంలోని పెద్ద ఆర్థిక వ్యవస్థలన్నింటిలో ఇదే అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం మూలధన పెట్టుబడులకు రూ.10 లక్షల కోట్లు కేటాయించింది. 2020-21లో ఇది రూ.4.39 లక్షల కోట్లు కాగా 2022-23లో 35 శాతం పెంచి రూ.7.5 లక్షల కోట్లు కేటాయించారు. 2023-24 బడ్జెట్లో ఇది 37.4 శాతం పెరిగింది. ఆ రకంగా చూసినట్టయితే రాబోయే బడ్జెట్లో కూడా భారీ మొత్తంలో నిధులు ఇందుకు కేటాయించే ఆస్కారం ఉందన్నది కొందరి అంచనా. ప్రభుత్వం క్యాపెక్స్‌పై అత్యధికంగా దృష్టి సారిస్తుందని, దీనివల్ల విభిన్న రంగాల్లో సామర్థ్యాలు ఉత్తేజితం అవుతాయని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం హెడ్ శేషాద్రి సేన్ అన్నారు. పెట్టుబడుల మద్దతుతో ఉత్పాదకత పెరిగి తద్వారా ఉపాధి కల్పన, డిమాండు, ఎగుమతులు జోరందుకుంటాయని, వీటన్నింటి ప్రభావం ఆర్థిక వృద్ధిపై ఉంటుందంటున్నారు.

ఇక్రా అంచనా ఇదీ...

అయితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం కాపెక్స్ కోసం రూ.10.2 లక్షల కోట్లు మాత్రమే కేటాయించే ఆస్కారం ఉన్నదని ఇక్రా అంటోంది. మూలధన పెట్టుబడిలో స్వల్ప వృద్ధి ప్రభావం ఆర్థిక కార్యకలాపాల పైన, జీడీపీ పైన ఉండవచ్చునంటోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరు నెలల మధ్య కాలంలో క్యాపెక్స్ 31 శాతం పెరిగి రూ.5.9 లక్షల కోట్లకు చేరింది. 2024 సంవత్సరపు బడ్జెట్ అంచనాల కన్నా ఇది 58.5 శాతం అధికం. వృద్ధి అత్యధికంగా ఉన్న కారణంగా పెట్టుబడి వ్యయాలు 2023 అక్టోబరులో 14.9 శాతం తగ్గాయి. గత ఏడాది ఏప్రిల్ తర్వాత ఇదే తొలి క్షీణత. కాగా నవంబరులో మాత్రం 1.6 శాతం పెరిగాయి. నెలవారీ సగటు క్యాపెక్స్ రూ.73,210 కోట్లు ఉంది.

బడ్జెట్లో నిర్దేశించిన రూ.10 లక్షల కోట్ల లక్ష్యం చేరాలంటే నెలవారీ సగటు రూ.83,400 కోట్లు ఉండాలి. భారత దేశం మౌలికంగా ఇన్‌ఫ్రా కొరత ఉన్న దేశం. ఈ లోటును పూడ్చడానికి ప్రభుత్వం ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తూ ఉంటుంది. ఇటీవల వృద్ధి పుంజుకోవడంతో కొన్ని రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులు ఊపందుకున్నాయి. వాటిలో స్టీల్, సిమెంట్, పెట్రోలియం రంగాలున్నాయి.

పారిశ్రామిక, లాజిస్టిక్ వసతులకు డిమాండ్ అదుర్స్

సీబీఆర్ఈ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో పారిశ్రామిక, లాజిస్టిక్ వసతులకు డిమాండ్ జోరుగా ఉంది. ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఏడాది డిమాండ్ 8 శాతం పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరిందని రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ సీబీఆర్ఈ చెబుతోంది. 2022లో పారిశ్రామిక లాజిస్టిక్ వసతుల లీజింగ్ 3.6 కోట్ల చదరపు అడుగులుండగా 2023లో అది 3.88 కోట్ల చదరపు అడుగులున్నట్టు తాజా నివేదికలో తెలిపింది. ప్రధానంగా థర్డ్ పార్టీ లాజిస్టిక్ కంపెనీలే (3పీఎల్) ఈ డిమాండుకు కారణమని పేర్కొంది. 2023లో పారిశ్రామిక, లాజిస్టిక్ విభాగం లీజింగ్‌లో ఈ కంపెనీల వాటా 45 శాతం ఉంది. ప్రపంచ ఆర్థిక సవాళ్లను కూడా ఈ రంగాలు తట్టుకుని నిలబడ్డాయనేందుకు ఇది నిదర్శనమని సీబీఆర్ఈ చైర్మన్, సీఈఓ (ఆగ్నేయాసియా, పశ్చిమాసియా, ఆఫ్రికా) అన్షుమన్ మాగజైన్ అన్నారు. ఈ-కామర్స్, రిటైల్, తయారీ రంగ కంపెనీలు సరఫరా వ్యవస్థ కార్యకలాపాలను 3పీఎల్ కంపెనీలకు ఔట్‌సోర్సింగ్ ఇవ్వడమే అవి అధిక మొత్తంలో స్థలాలు లీజింగ్ తీసుకోవడానికి కారణమని ఆయన చెప్పారు. స్టోరేజి అవసరాలు, వ్యయ నియంత్రణ, కార్మిక శక్తిని సమీకరించడంలో గల కష్టాల నుంచి బయటపడేందుకే పెద్ద కంపెనీలన్నీ ఔట్‌సోర్సింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్టు చెబుతున్నారు. ఇంజనీరింగ్, తయారీ రంగ కంపెనీలో మొత్తం లీజింగ్‌లో 17 శాతం వాటా కలిగి ఉన్నాయి. అధిక నాణ్యత గల స్థలాలకు డిమాండ్ పెరగడంతో అలాంటి ప్రదేశాల్లో భూమి వ్యయాలు, అద్దెలు కూడా పెరిగాయని సీబీఆర్ఈ తెలిపింది.

హైదరాబాద్‌లో: నగరాలవారీగా చూస్తే పారిశ్రామిక, లాజిస్టిక్ స్థలాల డిమాండ్ ముంబైలో చారిత్రక గరిష్ఠస్థాయిలో ఉంది. 2023లో ముంబైలో 99 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజింగ్‌కు తీసుకున్నారు. 2022లో ఇది 73 లక్షల చదరపు అడుగులుంది. హైదరాబాద్‌లో డిమాండ్ 37 లక్షల చదరపు అడుగుల నుంచి 43 లక్షల చదరపు అడుగులకు పెరిగింది. అయితే ఢిల్లీ ఎన్‌సీఆర్, బెంగళూరు, కోల్‌కతాల్లో డిమాండ్ క్షీణించగా చెన్నై, పుణె, అహ్మదాబాద్‌లలో పెరిగింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ		విజయవాడ	550
హైదరాబాద్	531	విశాఖపట్నం	560
22 జనవరి		వరంగల్	533
చిత్తూరు	548	దజను గుడ్లు రూ.72	
గోదావరి	550		



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

హైదరాబాద్	97	గోదావరి	106
వరంగల్	97	విజయవాడ	106
కరీంనగర్	97	గుంటూరు	107
మహబూబ్‌నగర్	97	ఒంగోలు	107
కర్నూలు	97	చిత్తూరు	103
విశాఖపట్నం	101		



ఫిబ్రవరి 1 నుంచి కార్ల ధరల పెంపు

టాటా మోటార్స్

న్యూఢిల్లీ: ప్యాసింజర్ కార్ల ధరలను ఫిబ్రవరి 1 నుంచి పెంచుతున్నట్లు టాటా మోటార్స్ ప్రకటించింది. ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ) సహా మొత్తం ప్యాసింజర్ వాహన శ్రేణి ధరలను సగటున 0.7 శాతం మేర పెంచుతున్నట్లు వెల్లడించింది. ఇన్‌పుట్ వ్యయాలు పెరిగిపోవటంతో ధరలను పెంచాల్సి వస్తోందని తెలిపింది.

నేడు మార్కెట్లకు సెలవు

అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం నాడు స్టాక్ మార్కెట్లకు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సెలవు ప్రకటించాయి. మంగళవారం మార్కెట్లు యధావిధిగా కార్యకలాపాలు సాగిస్తాయి.

ఈ ఏడాదే న్యూ ఎనర్జీ గిగా కాంప్లెక్స్ ప్రారంభం

రిలయన్స్ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ: గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న కొత్త ఎనర్జీ గిగా కాంప్లెక్స్‌ను ఈ ఏడాది ద్వితీయార్థంలో ప్రారంభించనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ప్రకటించింది. జామ్‌నగర్‌లో 5,000 ఎకరాల్లో ఈ గిగా కాంప్లెక్స్‌ను రిలయన్స్ అభివృద్ధి చేస్తోంది. ఈ గిగా కాంప్లెక్స్‌లో ఫోటో వోల్టాయిక్ ప్యానల్స్, ఫ్యూయల్ సెల్ సిస్టమ్, గ్రీన్ హైడ్రోజన్, ఎనర్జీ స్టోరేజ్, పవర్ ఎలక్ట్రానిక్స్ కోసం ఐదు గిగా ఫ్యాక్టరీలను రిలయన్స్ ఏర్పాటు చేస్తోంది. న్యూ ఎనర్జీ గిగా కాంప్లెక్స్‌లో పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది ద్వితీయార్థంలో వీటిని ప్రారంభించాలని చూస్తున్నట్లు ఇన్వెస్టర్లతో జరిగిన ఎర్నింగ్స్ కాల్‌లో కంపెనీ వెల్లడించింది. ధీరూభాయ్ అంబానీ గ్రీన్ ఎనర్జీ గిగా కాంప్లెక్స్.. ప్రపంచంలోనే అతిపెద్ద సమీకృత పునరుత్పాదక ఇంధన తయారీ కేంద్రంగా ఉండనుందని రిలయన్స్ పేర్కొంది. స్వచ్ఛమైన ఇంధనాలను అందించటంలో రిలయన్స్ న్యూ ఎనర్జీ బిజినెస్ కీలక పాత్ర పోషించనుందని తెలిపింది.

రూ.5 లక్షల కోట్ల పెట్టుబడితో 100 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్లాంట్లను ఏర్పాటు చేయటానికి గుజరాత్ ప్రభుత్వంతో రిలయన్స్ ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. కాగా గ్రీన్ హైడ్రోజన్ కోసం కచ్ ప్రాంతంలో 74,750 హెక్టార్ల భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వంగా సూత్రప్రాయంగా అనుమతులు మంజూరు చేసింది.

21,850 పైన బుల్లిష్

(జనవరి 23-25 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ అనాలిసిస్

గత వారం నిఫ్టీ:21,572 (-322)

నిఫ్టీ గత వారం 22,124-21,360 పాయింట్ల మధ్యన కదలాడి 322 పాయింట్ల నష్టంతో 21,572 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 21,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,499, 20,892, 19,944, 19,495 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఏ 200 డిఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,300
బ్రేక్‌డౌన్ స్థాయి: 21,500
నిరోధ స్థాయిలు: 21,775, 21,875, 21,975 (21,675 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 21,375, 21,275, 21,175 (21,475 దిగువన బేరిష్)

అమెరికా మార్కెట్లోకి కెంట్ ఆర్ఓ సిస్టమ్స్

వచ్చే మూడేళ్లలో రూ.2,000 కోట్ల టర్నోవర్ టార్గెట్

న్యూఢిల్లీ: వాటర్ ప్యూరిఫైయర్ తయారీదారు కెంట్ ఆర్ఓ సిస్టమ్స్.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమెరికా మార్కెట్లోకి అడుగుపెట్టనుందని కంపెనీ సీఎండీ మహేశ్ గుప్తా వెల్లడించారు. అంతేకాకుండా ఉత్పత్తుల పోర్టుఫోలియోను మరింగా పెంచుకోవటం ద్వారా వచ్చే మూడేళ్లలో రూ.2,000 కోట్ల టర్నోవర్‌ను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గడచిన మూడేళ్ల కాలంలో విస్తరణ కార్యకలాపాల కోసం రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టగా తాజాగా మరో రూ.300 కోట్లతో ఉత్తరప్రదేశ్‌లోని యమునా ఎక్స్‌ప్రెస్‌వే వద్ద కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు గుప్తా పేర్కొన్నారు. కాగా అమెరికా మార్కెట్లోకి అడుగుపెట్టేందుకు యూఎస్‌కు చెందిన బ్లాక్ అండ్ డెకెర్ కంపెనీతో బ్రాండ్ లైసెన్సింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఆయన చెప్పారు. భారత్‌లో బ్లాక్ అండ్ డెకెర్ బ్రాండ్ కింద వాటర్ ప్యూరిఫైయర్లను తయారు చేసి అమెరికాకు ఎగుమతి చేయనున్నట్లు తెలిపారు.

ప్రస్తుతం కంపెనీ వాటర్ ప్యూరిఫైయర్స్‌తో పాటు ఎయిర్ ప్యూరిఫైయర్లు, వాక్యూమ్ క్లీనర్స్, కిచెన్ అప్లయెన్సెస్, కుక్‌వేర్ సహా మరికొన్ని ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తోంది. విస్తరణలో భాగంగా ఫ్యాన్ విభాగంతో పాటు చిన్న కిచెన్ ఉత్పత్తుల విభాగంలోకి అడుగుపెట్టాలని కంపెనీ భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి కంపెనీ టర్నోవర్ రూ.1,200 కోట్లుగా ఉంది.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టిన మదుపర్లు తమ డీమ్యాట్ ఖాతాలోని లావాదేవీలు, షేర్ల వివరాలను తమ ప్రాంతీయ భాషలో తెలుసుకోవడానికి ప్రాంతీయ భాషల్లోనే కన్సాలిడేటెడ్ అకౌంట్ స్టేట్‌మెంట్లను సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) లిమిటెడ్ (సీడీఎస్ఎల్) అందించనుంది. తెలుగు సహా 23 భాషల్లో స్టేట్‌మెంట్లను పొందవచ్చు. 1999లో ప్రారంభమైన సీడీఎస్ఎల్ వద్ద 10 కోట్ల డీమ్యాట్ అకౌంట్లు ఉన్నాయి.

కన్సాలిడేషన్ ట్రెండ్

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభమైనా మానసిక అవధి 22,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమయింది. ఆ తర్వాత బలమైన కరెక్షన్‌లో పడినా 21,300 స్థాయిలో మైనర్ రికవరీ సాధించి చివరికి ముందు వారంతో పోల్చితే 320 పాయింట్ల నష్టంతో 21,570 వద్ద వారం కనిష్ఠ స్థాయిలో ముగిసింది. అయినా స్వల్పకాలిక మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. 22,000-21,300 పాయింట్ల మధ్యనే కదలాడుతూ గత నాలుగు వారాలుగా మార్కెట్ స్వల్పకాలిక కన్సాలిడేషన్ ట్రెండ్‌లో ఉంది. గత 12 వారాలుగా 19,000 స్థాయి నుంచి 3,000 పాయింట్ల మేరకు ర్యాలీ సాధించింది. గత కొద్ది వారాలుగా అనిశ్చిత ధోరణి కనిపిస్తోంది. కొత్త ధోరణిని సూచించాలంటే 21,800 వద్ద బ్రేకౌట్ లేదా 21,400 వద్ద బ్రేక్‌డౌన్ తప్పనిసరి. అయితే 21,350 వద్ద మద్దతు తీసుకుంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్లయితే మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 21,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. స్వల్పకాలిక ప్రధాన నిరోధం 21,850. ఆ పైన ప్రధాన నిరోధం 22,100.

బేరిష్ స్థాయిలు: 21,600 వద్ద విఫలమైతే మైనర్ అప్రమత్తతను సూచిస్తుంది. భద్రత కోసం ప్రధాన మద్దతు స్థాయి 21,400 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత తప్పదు.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 48,000 వద్ద నిలదొక్కుకోలేక బలమైన కరెక్షన్‌లో పడింది. చివరికి 2,000 పాయింట్లు నష్టపోయి 46,000 సమీపంలో ముగిసింది. ఈ స్థాయిలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. పాజిటివ్ ధోరణి ప్రదర్శించినట్లయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 46,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో నిరోధం 47,200.

పాటర్న్: మార్కెట్ ప్రస్తుతం 20 డిఎంఏ వద్ద ఉంది. సానుకూలత కోసం ఇక్కడ నిలదొక్కుకుని తీరాలి. 21,850 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన నిరోధం ఉంది. 21,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. అంతకన్నా దిగజారితే అప్రమత్తతను సూచిస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	21,640, 21,700
మద్దతు	21,500, 21,460

www.sundartrends.in

కరెంట్ అఫైర్స్/ జనరల్ ఎస్సే



అదానీ Vs హిండెన్‌బర్గ్

ఆరోపణలు - పరిణామాలు

భారతదేశం తొంభయ్యవ దశకంలో చేపట్టిన సంస్కరణలతో ఆర్థికరంగం సరికొత్త రూపుదాల్చింది. ఎల్‌పీజీ(లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్)ను ప్రవేశపెట్టడం ద్వారా దేశ ఆర్థికవ్యవస్థలో వృద్ధితోపాటు, కొన్ని అవలక్షణాలకు ద్వారాలు తెరిచినట్లయింది. మరీ ముఖ్యంగా వైట్‌కాలర్ నేరాలు(స్టాక్ మార్కెట్ కుంభకోణాలు, ఇన్‌సైడర్ ట్రేడింగ్‌లు, మనీ లాండరింగ్, డొల్ల సంస్థలు, పన్ను ఎగవేతలు, రుణాల కుంభకోణాలు మొదలైన ఆర్థిక నేరాలు) విజృంభించాయి.

కొత్తగా అనుసరిస్తున్న ఆర్థికపంథాకు అవసరమైన నియంత్రణ సంస్థల, చట్టాలపరమైన కొరతకు తోడు ఇతర దేశాలతో ఆర్థిక నేరాల సమాచార మార్పిడి, నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు విస్తృతంగా లేనందున ఆర్థిక నేరాలను పసిగట్టడం, అదుపు చేయడం, నేరగాళ్లను శిక్షించడంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయి. అందువల్ల తరచూ ఏదో ఒక తరహా వైట్ కాలర్ నేరాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

ఇటీవల అదానీ గ్రూప్ సంస్థలపై అలాంటి వైట్‌కాలర్ నేరాలను ఆరోపిస్తూ అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్, ఆర్థిక నేరాల పరిశోధన సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఒక పరిశోధన నివేదికను జనవరి 2023లో విడుదల చేసింది.

షార్ట్ సెల్లింగ్ అంటే ఏమిటి?

హిండెన్‌బర్గ్ సంస్థ షార్ట్ సెల్లింగ్‌కు పాల్పడేందుకే అదానీ గ్రూపు లొసుగులపై నివేదికను వెలువరించిందనే వాదనలూ ఉన్నాయి. షార్ట్ సెల్లింగ్ అంటే సాధారణంగా స్టాక్ మార్కెట్లలో సాధారణ ఇన్వెస్టర్లు, భవిష్యత్తులో షేర్ ధర పెరగవచ్చనే ఆశావాద దృక్పథంతో చేసే కొనుగోళ్లకు పూర్తిగా విభిన్నం అయిన ప్రక్రియ ఇది. ఒక ప్రయోజనంతో, ధరలు ఎక్కువగా ఉన్నప్పుడే అరువుగా ఆ షేర్లను తీసుకుంటారు. వాటిని అమ్మి, ఆ మొత్తంతో ధర పడిపోగానే భారీగా ఆ షేర్లు తిరిగి కొంటారు. ధర పెరిగినప్పుడు మరలా అమ్మి, లభించిన మార్జిన్‌తో భారీగా లాభపడతారు. అలా అరువు తీసుకున్న షేర్లను తిరిగి వెనక్కి ఇచ్చేసే ప్రక్రియ ఇది. దీనిలో తక్కువ కాలానికి స్టాక్స్ ఉంచుకుంటారు.

19(ఎ) రూల్ అనగా?

'సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్(రెగ్యులేషన్) రూల్స్ 1957'లోని 19(ఎ) రూల్ ప్రకారం భారత స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన ప్రతి కంపెనీ కనీసం 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను కలిగి ఉండాలి. అంటే 75 శాతం మించి కంపెనీ యజమానులు కానీ వారి కుటుంబీకులు కానీ వాటాను కలిగి ఉండరాదు. ఈ నియమం ఇన్‌సైడర్ ట్రేడింగ్, షేరు ధరల్లో అవకతవకలకు పాల్పడటం వంటి వాటిని నిరోధించడానికి నిర్దేశించారు. షేర్ మార్కెట్‌లో ప్రజలకు అందుబాటులో కొంతమొత్తం షేర్లు ఉంచడం ద్వారా ట్రేడింగ్ జరిగి షేర్ విలువల్లో కచ్చితత్వ సాధనకూ ఈ నియమాన్ని ప్రవేశపెట్టారు.

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు

1. అదానీ గ్రూపునకు చెందిన పోర్ట్స్, లాజిస్టిక్, పవర్ జనరేషన్, అగ్రి బిజినెస్ వంటి వివిధ సంస్థలు స్టాక్ మార్కెట్ మ్యానిప్యులేషన్, అకౌంటింగ్ లొసుగులు, పన్ను ఎగవేతలు, ఫ్రాడ్ స్కీమ్‌లు వంటి చర్యల ద్వారా దశాబ్దాల తరబడి సుమారు 17.8 ట్రిలియన్ల(218 బిలియన్ డాలర్ల) మేర అక్రమాలకు పాల్పడ్డాయి.
2. అదానీ కుటుంబ సభ్యులు మారిషస్, కరేబియన్ దీవులు, యుఏఈ వంటి టాక్స్‌హెవెన్(పన్ను రాయితీ/పన్నురహిత) దేశాల్లో షెల్ కంపెనీలు(డొల్ల కంపెనీలు) ఏర్పాటుచేసి అనేక అక్రమాలకు తెరలేపారు.
3. ఈ డొల్ల కంపెనీల ద్వారా భారీఎత్తున మనీ లాండరింగ్, అవినీతి, స్వదేశంలో పన్ను ఎగవేత జరిగాయి.
4. అదానీ గ్రూపులోని పబ్లిక్ లిస్టింగ్ కంపెనీల మధ్య నిధుల అక్రమ బదిలీ ఈ డొల్ల కంపెనీల ద్వారా జరిగింది.
5. షేర్ల విలువను తప్పుడు మార్గాల్లో పెంచడం ద్వారా బ్యాంకుల నుంచి భారీఎత్తున రుణాలు, ఇతర సంస్థల నుంచి పెట్టుబడులు అదానీ పొందారు.

ఈ నివేదిక వెలువడటంతోనే దేశంలోనే సంపన్న వ్యక్తిగా నిలిచిన గౌతం అదానీ సంస్థల షేర్లు గత ఏడాది 150 బిలియన్ డాలర్ల మేర నష్టపోవడానికి, అతని వ్యక్తిగత సంపద 60 బిలియన్ డాలర్ల మేర తుడిచిపెట్టుకుపోవడానికి కారణమైంది. ఇన్వెస్టర్లు భారీగా నష్టపోయారు. అదానీ కంపెనీలకు పెద్దమొత్తంలో రుణాలిచ్చిన బ్యాంకులు, పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ సంస్థ షేర్లు అమాంతం పడిపోయాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు అదానీ సెక్యూరిటీ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా మూలధన మార్కెట్ రెగ్యులేటింగ్ ఏజెన్సీ అయిన 'సెబీ(సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా)'ను 2023 మార్చిలో ఆదేశించింది. ఈ మేరకు సెబీకి సుప్రీంకోర్టు రెండు కీలక విషయాల పరంగా పరిశోధన జరపాలని టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఇచ్చింది. **అవి-**

1. సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్(రెగ్యులేషన్)రూల్స్ 1957లోని రూల్ 19(ఎ)ను అదానీ గ్రూపు సంస్థలు అతిక్రమించాయా?
2. స్టాక్ ప్రైసెస్ అవకతవకలు, అదానీ సంస్థల్లో రహస్య లావాదేవీలు జరిగాయన్న ఆరోపణలపై పరిశీలన.

> అదానీ కంపెనీలకు పెద్దమొత్తంలో రుణాలిచ్చిన బ్యాంకులు, పెట్టుబడులు పెట్టిన ఎల్ఐసీ సంస్థ షేర్లు అమాంతం పడిపోయాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు అదానీ సెక్యూరిటీ చట్టాల ఉల్లంఘనకు పాల్పడిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాల్సిందిగా సెబీని ఆదేశించింది.

దీనితోపాటు సుప్రీంకోర్టు కూడా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏ.ఎం.సప్రే అధ్యక్షతన ఆరుగురు సభ్యుల ఎక్స్‌పర్ట్ కమిటీని నియమించి హిండెన్‌బర్గ్ రిపోర్టుతో ఇన్వెస్టర్లు సంపద కోల్పోవడానికి రెగ్యులేటరీ వైఫల్యం ఎంతవరకు ఉందో తేల్చి చెప్పాల్సిందిగా ఆదేశించింది.

ఈ క్రమంలో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేపుతూ ఫైనాన్షియల్ టైమ్స్, ద గార్డియన్ పత్రికల్లో ఆగస్టులో 'ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు(ఓసీసీఆర్‌పీ) వెలువరించిన రిపోర్టు సంచలనం రేపింది. ఈ సంస్థ రిపోర్టు, హిండెన్‌బర్గ్ ఆరోపణలకు ఆధారాలను చూపెట్టింది. విదేశాల్లోని డొల్ల కంపెనీల ద్వారా ఏవిధంగా అదానీ పవర్, అదానీ ట్రాన్స్‌మిషన్స్‌లో రూల్ 19(ఎ)ను అతిక్రమిస్తూ రహస్యంగా 75 శాతానికి మించి వాటాను అదానీ కుటుంబం సంపాదించిందో అంతర్గత ఈమెయిల్స్, ఇన్వాయిస్‌లు, లావాదేవీల రికార్డులు సహితంగా ఆధారాలు ప్రచురించింది. అంతేకాక గతంలో అదానీ కంపెనీ జరిపిన కొన్ని అనుమానాస్పద లావాదేవీలను సెబీ నియంత్రణ చేయలేకపోవడం గతంలో సెబీ ఛైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి తదుపరి అదానీ గ్రూపు కొనుగోలు చేసిన ఎన్‌డీటీవీలో కీలక పదవి చేపట్టడం వంటి విషయాలు సైతం ఈ నివేదిక వెల్లడించింది. ఈ వార్తా కథనాలతో సెబీ దర్యాప్తుపై అనుమానాలు రేకెత్తించడంతో కొందరు అదానీ కేసులో సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) లేదా సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాల్సిందిగా సుప్రీంకోర్టును కోరుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు.ఈ వ్యాజ్యాలపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం జనవరి 3న తీర్పు చెప్పింది.

సుప్రీంకోర్టు తీర్పులోని అంశాలు

1. సెబీ చేస్తున్న దర్యాప్తుపై ఎటువంటి అనుమానాలూ లేవని, అదనంగా సిట్‌ను గానీ, సీబీఐని గానీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. వార్తాపత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా సెబీ సమగ్రతను శంకించలేమని పేర్కొంది.
2. ఇప్పటికీ విచారణ చేపట్టాల్సిన 22 అంశాల్లో 20 అంశాల పరంగా విచారణ పూర్తయిందని సెబీ తెలిపిన దరిమిలా మిగతా రెండు అంశాలపై కూడా మూడు నెలల్లోగా దర్యాప్తు పూర్తిచేసి నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది.
3. పిటిషన్‌దారులు కోరినట్లుగా, సెబీ ఇటీవల ప్రవేశపెట్టిన ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్స్ రెగ్యులేషన్, ద లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్స్ రిక్వైర్‌మెంట్ రెగ్యులేషన్ పరంగా ఎటువంటి మార్పులు చేయాలని సెబీని ఆదేశించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు పేర్కొంది.
4. హిండెన్‌బర్గ్ సంస్థ నివేదిక వెలువరించిన తరవాత భారత షేర్ మార్కెట్‌లో ఒడుదొడుకులను ఆసరాగా చేసుకొని షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ భారీగా కొనుగోళ్లు జరిపి లాభపడిందనే వార్తల వచ్చాయి. ఆ నేపథ్యంలో, హిండెన్‌బర్గ్ అవకతవకలకు పాల్పడిందేమో విచారించాలని సుప్రీంకోర్టు సెబీని ఆదేశించింది. అయితే కొందరు విశ్లేషకులు మాత్రం సుప్రీంకోర్టు తీర్పు విషయంలో కొన్ని అంశాలపరంగా మరింత స్పష్టత ఆశిస్తున్నారు. **అవి-**

- సెబీ దర్యాప్తు పూర్తిచేసిన 20 అంశాల్లో ఏముందో ప్రజలకు గానీ, కనీసం సుప్రీంకోర్టు పరిశీలించడానికి గానీ సెబీ నివేదించలేదు. సుప్రీంకోర్టు కూడా వాటి వివరాలు కోరలేదు.
- దర్యాప్తు పూర్తిచేయాల్సి ఉన్న మిగతా రెండు విషయాలైన రూల్19(ఎ) అతిక్రమణకు సంబంధించి, అదానీ సంస్థల్లో పెట్టుబడి పెట్టిన విదేశీ సంస్థల యాజమాన్యాలు, వాటి లావాదేవీల గురించి హిండెన్‌బర్గ్ ఓసీసీఆర్‌పీ సేకరించిన వివరాలు, ఆధారాలు సెబీ ఎందుకు సేకరించలేకపోతోంది?
- టాక్స్ హెవెన్ దేశాల్లో ఆర్థిక సంబంధమైన సమాచార మార్పిడిపరంగా ఉన్న నిబంధనల కారణంగా మిగిలిన రెండు అంశాల్లో విచారణ ఆలస్యమవుతోందని సెబీ కోర్టుకు తెలిపింది. అయితే ఆ సమస్య పరిష్కార దిశగా సెబీ, సుప్రీంకోర్టు, ప్రభుత్వం ఎలాంటి పరిష్కార మార్గాలు, ప్రత్యామ్నాయ పద్ధతులు చూపకపోవడంతో కేసు విచారణ మూడు నెలల గడువులోగా పూర్తికావడంపై సందేహాలు ముసురుకుంటున్నాయి.
- సెబీ దర్యాప్తు ఆలస్యం అవడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా చర్యలు తీసుకోవడానికి మార్గం సుగమం కావడంలేదు. ఈ పరిస్థితుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తన విధిని నిర్వర్తించేందుకు సెబీ కనీసం ప్రాథమిక దర్యాప్తు నివేదికనైనా బహిర్గతపరచాల్సి ఉంటుంది. నేరారోపణ ఉన్నట్లయితే మిగతా రెండు విషయాల కోసం కాలయాపన తగదు.

గతంలో ఇదేతరహా ఆర్థిక నేరాలకుగాను 15 సంవత్సరాల క్రితం సెబీ అదానీపై ఫిర్యాదు నమోదుచేసి, పదిలక్షల జరిమానా విధించింది. ప్రస్తుతం వివిధ బ్యాంకులు అదానీకి భారీగా రుణాలు ఇచ్చి ఉండటం, ఎల్ఐసీ అదానీ సంస్థల్లో 81,347 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టి ఉన్న నేపథ్యంలో ఒకవేళ నేరాలు రుజువై, అదానీ రుణాల చెల్లింపులో విఫలమైతే స్టాక్ మార్కెట్‌లో తీవ్ర ఒడుదొడుకులు నమోదవుతాయన్న భయాలు సర్వత్రా నెలకొన్నాయి.

అయితే ఈ తీర్పుతో సెబీ సమగ్రతపై సుప్రీంకోర్టు ధృవీకరణ ఇచ్చినట్లయింది. భారతదేశ విత్త మార్కెట్, రెగ్యులేటరీ మెకానిజాలపై ఇన్వెస్టర్లకు అభద్రతాభావం కలుగకుండా ఉండేందుకు ఇది దోహదపడింది.

ఇదిలా ఉండగా తీర్పు వెలువడిన వెంటనే గౌతమ్ అదానీ 'సత్యమేవ జయతే' అని ట్వీట్ చేయడం మాత్రం కేసులో ఆయన విజయం సాధించినట్లుగా భ్రమలు కల్పించే ప్రయత్నమేనని విమర్శకులు పేర్కొంటున్నారు. నిజానికి సెబీ కానీ, సుప్రీంకోర్టు కానీ ఆయనకు ఎటువంటి క్లీన్‌చిట్ ఇవ్వలేదు. కేవలం సెబీ సమగ్రతకు మాత్రమే సుప్రీంకోర్టు ధృవీకరణ దక్కింది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లెటర్ సిరీస్

రీజనింగ్

పార్ట్-1



1. PQR/ RPQ/ QRP/ PQR

మొదటి సమూహంలో చివరి అక్షరం రెండో సమూహంలో మొదటి అక్షరంగా, మొదటి సమూహంలో మొదటి రెండు అక్షరాలు రెండో సమూహంలో రెండో, మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి.. అదేవిధంగా రెండో సమూహంలో చివరి అక్షరం మూడో సమూహంలో మొదటి అక్షరంగా, రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలు మూడో సమూహంలో రెండో, మూడో అక్షరాలుగా ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

2. PQ/ PPQ/ PPPQ/ PPPPQ

మొదటి సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'P' అదనంగా వస్తున్నది.

3. abcd/ aabbccdd/ aaabbbccc

మొదటి సమూహంలో ఒక abcd, రెండో సమూహంలో రెండు a లు, రెండు bలు, రెండు cలు, రెండు dలు ఒక సమూహంగా ఏర్పడింది. మూడో సమూహంలో మూడు aలు, మూడు bలు, మూడు cల వరకు ఈ సిరీస్ ఏర్పడింది.

4. baac/ accb/ cbba/ baac/ accb

మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా, రెండో అక్షరమే మరల మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడ్డాయి. అదేవిధంగా రెండో సమూహంలోని చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలోని ఒకటో, రెండవ అక్షరాలుగా, రెండో అక్షరమే తిరిగి మూడో అక్షరంగా, నాలుగో అక్షరంగా దాని ముందు సమూహంలోని మొదటి అక్షరం ఏర్పడింది. ఈ విధంగా ఒక కచ్చితమైన చైన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించినది.

5. ccacc/ aabaa/ bbcbb/ ccacc

మొదటి సమూహంలో నాలుగు cలు, రెండో సమూహంలో నాలుగు aలు, మూడో సమూహంలో నాలుగు bలు ఏర్పడుతూ మొదటి సమూహంలోని నాలుగు అక్షరాలకు మధ్యగా a. రెండో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా b, మూడో సమూహంలో నాలుగు అక్షరాలకు మధ్యగా c. ఈవిధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

6. PQR/ QRST/ RSTUV/ STUVWX

మొదటి సమూహంలో మూడు అక్షరాలు, రెండో సమూహంలో నాలుగు అక్షరాలు, మూడో సమూహంలో అయిదు అక్షరాలు, నాలుగో సమూహంలో ఆరు అక్షరాలు ఉన్నాయి. మొదటి సమూహంలోని చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో ఒకటో, రెండో అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాలను(ఆల్ఫాబెట్స్) అనుసరిస్తూ ఏర్పడ్డాయి. రెండో సమూహంలోని చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలోని మొదటి మూడు అక్షరాలుగా ఏర్పడి అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడినవి. అదేవిధంగా మూడో సమూహంలోని చివరి నాలుగు అక్షరాలు నాలుగో సమూహంలో మొదటి నాలుగు అక్షరాలుగా ఏర్పడుతూ అదనంగా రెండు అక్షరాలు వర్ణమాల ప్రకారం ఏర్పడ్డాయి. ఈ విధంగా ఒక కచ్చితమైన క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.

7. aabc/ bbca/ ccab/ aabc

పై సిరీస్‌లో అండర్‌లైన్ చేసిన అక్షరాలు abc/ bca/ cab/ abcలకు 11వ మోడల్‌కు సంబంధించిన వివరణే. అంతేకాక ప్రతి సమూహంలోను మొదటి అక్షరమే రెండుసార్లు రిపీట్ అయినది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

శక్తి వనరులు

ఇండియన్ జాగ్రఫీ

విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించే వనరులను శక్తి వనరులు అంటారు. భారతదేశంలో ఈ వనరులను సంప్రదాయ, సంప్రదాయేతర అని రెండు విధాలుగా వర్గీకరించారు.

సంప్రదాయ శక్తి వనరులు

ఈ వనరులు అంతమైతే మానవ జీవిత కాలంలో వీటిని పునరుద్ధరించలేం. అందువల్ల వీటిని పునరుద్ధరణ కాని(Non Renewable) శక్తి వనరులు అని కూడా అంటారు. ఉదా: బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు, యురేనియం. భారతదేశంలో అత్యధికంగా థర్మల్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు.

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం



థర్మల్ విద్యుత్: బొగ్గు, నీటి ఆవిరి, సహజవాయువు ఆధారంగా విద్యుదుత్పత్తిని చేపడితే దానిని థర్మల్ విద్యుత్ అని పిలుస్తారు. ప్రపంచంలో, భారతదేశంలో థర్మల్ విద్యుత్ ఎక్కువగా ఉత్పత్తి అవుతోంది. 2019 మార్చి 31 నాటికి దేశంలో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం- 226.27 గిగా వాట్లు. ఇందులో..

- **బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్:** 2,000,704.5 మెగా వాట్లు
- **సహజవాయువు ఆధారిత విద్యుత్:** 24,937.32 మెగా వాట్లు
- **డీజిల్ ఆధారిత విద్యుత్:** 637.63 మెగా వాట్లు
- థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో గల రాష్ట్రం- మహారాష్ట్ర, గుజరాత్
- థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కోసం 1975లో ఎన్‌టీపీసీ(నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్) ఏర్పాటు చేశారు.
- ప్రస్తుతం దేశంలో ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో 13 బొగ్గు ఆధారిత సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. 1000 మెగా వాట్ల కంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగినవాటిని సూపర్ థర్మల్ పవర్ స్టేషన్స్ అంటారు. దేశంలో ప్రస్తుతం ఇవి ఉన్న ప్రాంతాలు...

1. ఉత్తరప్రదేశ్: రిహండ్, దాద్రి, ఉంచహార్, సింగ్రౌలి
2. మధ్యప్రదేశ్: వింద్యాచల్, 3. ఛత్తీస్‌గఢ్: కోర్బా
4. ఆంధ్రప్రదేశ్: సింహాద్రి, 5. తెలంగాణ: రామగుండం, 6. బిహార్: కహల్ గావ్, 7. ఒడిశా: తాల్చేరు
8. పశ్చిమ బెంగాల్: ఫరక్కా, 9. కేరళ: కాయంకులం

- ప్రస్తుతం ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో ఆరు యూఎంపీపీ(అల్ట్రా మెగా పవర్ ప్లాంట్)లు ఏర్పాటు చేశారు. 4000 మెగా వాట్ల కంటే ఎక్కువ ఉత్పాదక సామర్థ్యం కలిగిన వాటిని అల్ట్రా మెగా పవర్ ప్లాంట్స్ అని పిలుస్తారు. అవి... మధ్యప్రదేశ్-ససన్, గుజరాత్-ముంద్ర, మహారాష్ట్ర-గిర్యా, కర్ణాటక-తాద్రి, ఒడిశా- ఇబ్, ఆంధ్రప్రదేశ్- కృష్ణపట్నం.

సహజవాయువు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి

1. విజ్జేశ్వరం సహజవాయువు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం: భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రభుత్వరంగ సహజవాయువు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రం. పశ్చిమగోదావరి జిల్లాలోని నిడదవోలు మండలంలోని విజ్జేశ్వరం వద్ద 1990లో దీన్ని ఏర్పాటు చేశారు. దీని విద్యుదుత్పత్తి సామర్థ్యం- 272 మెగా వాట్లు. ఈ కేంద్రానికి సహజవాయువును ఓఎన్‌జీసీ సరఫరా చేస్తుంది.

2. జేగురుపాడు సహజవాయువు ఉత్పత్తి కేంద్రం: భారతదేశంలో ఏర్పాటు చేసిన మొట్టమొదటి ప్రైవేట్ సహజవాయువు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రం. తూర్పుగోదావరి జిల్లాలో 1997లో ఏర్పాటు చేశారు. దీని విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం- 216 మెగా వాట్లు. 2015 జూన్ 20న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దీన్ని కొనుగోలు చేసింది. దేశంలో ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో ఏడు సహజవాయువు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. అవి..అంతా- రాజస్థాన్, ఔరియా- యూపీ, కవాస్-గుజరాత్, దాద్రి- యూపీ, జనోర్ గాంధార- గుజరాత్, కాయంకులం - కేరళ, ఫరీదాబాద్ - హరియాణా.

అణు విద్యుత్

భారత్‌లో అణు శక్తి ఉత్పత్తికి నాంది పలికిన వ్యక్తి హోమీ జే బాబా. ఇతనిని అణుశక్తి పితామహుడు అని పిలుస్తారు.

అణుశక్తి విభాగం: 1954లో ముంబై కేంద్రంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఇది అణుశక్తి ఉత్పత్తికి తోడ్పడే కీలకమైన సంస్థ. ఇది ప్రధానమంత్రి ఆధ్వర్యంలో పనిచేస్తుంది.

అణుశక్తి కమిషన్: ఇది కూడా ముంబై కేంద్రంగా 1948లో ప్రవేశపెట్టిన అణుశక్తి బిల్లు ఆధారంగా 1948 ఆగస్టు 10న ఏర్పడింది. హోమీ జె.బాబా దీనికి తొలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. అణుశక్తికి సంబంధించిన విధాన రూపకల్పన, అమలు దీని ముఖ్య ఉద్దేశం.

భారత అణుశక్తి కార్యక్రమం- దశలు: భారత్‌లో మూడు దశల అణుశక్తి కార్యక్రమానికి హోమీ జే బాబా పునాది వేశాడు.

ముఖ్యమైన అణు రియాక్టర్లు

అప్సర: 1956 ఆగస్టు 4న యునైటెడ్ కింగ్‌డమ్ సహాయంతో ప్రారంభించారు. ఇది దేశంలో మొట్టమొదటి అణు రియాక్టర్. ఒక మెగావాట్ ఉత్పత్తి సామర్థ్యం కలది. ఈ రియాక్టర్ స్విమ్మింగ్‌పూల్ తరహాలో ఉంటుంది.

- ఇతర ముఖ్యమైన రియాక్టర్లు: ధృవ(దేశంలో అతిపెద్ద అణు రియాక్టర్. 1984లో ఏర్పాటు చేశారు), పూర్ణిమ, సిరస్, జెరిన్.
- ప్రస్తుతం భారతదేశంలో ఏడు అణు విద్యుత్ కేంద్రాలు, 22 అణు రియాక్టర్లు ఉన్నాయి. భారతదేశంలో అణు విద్యుచ్ఛక్తి సామర్థ్యం - 6780 మెగావాట్లు. అణు విద్యుత్
- అణు విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచంలో అమెరికా మొదటి స్థానంలో ఉంది.

తారాపూర్ అణువిద్యుత్ కేంద్రం: దీని సామర్థ్యం 1400 మెగా వాట్లు. ఇది మహారాష్ట్రలోని థానే జిల్లాలోని ట్రోంబే వద్ద ఉంది. 1969 అక్టోబరు 28న ప్రారంభించారు. దీనిలో యురేనియం ఆక్సైడ్, ప్లూటోనియం ఆక్సైడ్‌ను ఇంధనాలుగా వాడుతున్నారు. దీనిని తారాపూర్ అటామిక్ పవర్ స్టేషన్(టీఏపీఎస్) అంటారు. ఇది భారతదేశంలో మొట్టమొదటి అణువిద్యుత్ కేంద్రం. దీనిలో మొట్టమొదటి రియాక్టర్ అప్సర.

కల్పకం అణువిద్యుత్ కేంద్రం: దీని సామర్థ్యం 440 మెగా వాట్లు. 1984లో ఏర్పాటు చేశారు. ఇది తమిళనాడులో ఉంది. దీని పేరు ఇందిరాగాంధీ సెంటర్ ఫర్ అటామిక్ రీసెర్చ్. స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించారు. ఇక్కడ ఎఫ్‌బీటీఆర్(ఫాస్ట్ బ్రీడర్ టెస్ట్ రియాక్టర్) అనే సాంకేతిక పరిజ్ఞానం ద్వారా అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అణు విద్యుత్ ఉత్పత్తిలో రెండో దశ ద్వారా కల్పకంలోని కామిని అనే రియాక్టర్ అణు విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది.

రావత్ భట్(లేదా) కోట: దీన్ని 1973 ఏర్పాటు చేశారు. దీని సామర్థ్యం 1180 మెగా వాట్లు. ఇది రాజస్థాన్‌లోని చంబల్ నది ఒడ్డున కోట వద్ద ఉంది. దీన్ని ఆర్‌ఏపీఎస్(రాజస్థాన్ అటామిక్ పవర్ స్టేషన్). దీనిని రాణా ప్రతాప్ సాగర్ రియాక్టర్ అని పిలుస్తారు. ఇక్కడ ఐదో రియాక్టర్ 765 రోజులు ఆగకుండా విద్యుత్ ఉత్పత్తిలో ప్రపంచ రికార్డును నమోదు చేసింది. ఇది రాజస్థాన్‌లోని అనేక ప్రాంతాలకు విద్యుత్‌ను సరఫరా చేస్తోంది.

మిగతా కేంద్రాలు: నరోరా(440 మెగా వాట్ల సామర్థ్యం- ఉత్తరప్రదేశ్); కాక్రపరా(440 మెగా వాట్ల సామర్థ్యం- గుజరాత్); కైగా(880 మెగా వాట్ల సామర్థ్యం- కర్ణాటక), కుడంకులం(2000 మెగా వాట్ల సామర్థ్యం- తమిళనాడు).



వి. వెంకట్‌రెడ్డి, సీనియర్ ఫ్యాకల్టీ

టీఎస్‌పీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

భారత రాజ్యాంగం - ముఖ్య సమావేశాలు

ఇండియన్ పాలిటీ

సైమన్ కమిషన్-1927

జాన్ సైమన్ అధ్యక్షతన బ్రిటిష్ ప్రభుత్వం ఏడుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించింది(1+6). భారతప్రభుత్వ చట్టాన్ని సమీక్షించడానికి 1919లో ఏర్పాటుచేశారు. అప్పటి బ్రిటన్ ప్రధాని 'బాల్విన్' ఈ కమిషన్‌ను 1927 నవంబరులో నియమించారు. ఈ కమిషన్‌లో సభ్యులందరూ ఆంగ్లేయులే కావడం వల్ల భారతీయులు దీనిని వ్యతిరేకించారు.

మొదట ఈ కమిషన్ బొంబైలో పర్యటించింది. ఇండియాలో ఈ కమిషన్ రెండు సార్లు పర్యటించింది. **అవి-**

1. 1928 ఫిబ్రవరి 3 నుంచి మార్చి 31 వరకు
2. 1928 అక్టోబరు 11 నుంచి 1929 ఏప్రిల్ 6 వరకు

ఈ కమిషన్‌ను మద్రాసులో వ్యతిరేకించినందుకు టంగుటూరి ప్రకాశం పంతులుకు 'ఆంధ్రకేసరి', పంజాబ్‌లో వ్యతిరేకించినందుకు లాలా లజపతిరాయ్‌కి 'పంజాబ్ కేసరి' అనే బిరుదు వచ్చాయి. సైమన్ కమిషన్ తన నివేదికను 1930లో సమర్పించింది.

కమిషన్ సిఫార్సులు

1. భారత్‌లో సమాఖ్య ప్రభుత్వం ఏర్పాటు
2. మత నియోజకవర్గాల కొనసాగింపు
3. రాష్ట్రాల్లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాటు.
4. కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటు
5. ప్రభుత్వ నిర్వహణలో భారతీయులకు స్వయంప్రతిపత్తిని కల్పించడం.
6. హైకోర్టులపై కేంద్రానికి పాలనపరమైన నియంత్రణను కల్పించడం.
7. రాష్ట్ర శాసనమండళ్లలో సభ్యుల సంఖ్యను పెంచడం.
8. భాషా ప్రాతిపదికపై ఒరిస్సా, సింధ్ రాష్ట్రాల ఏర్పాటు.

నెహ్రూ రిపోర్ట్- 1928

మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన అఖిలభారత కాంగ్రెస్ ఒక కమిటీని ఏర్పాటుచేసింది. దీనిలో నలుగురు సభ్యులు. ఇది అతి తక్కువకాలంలోనే స్వయంప్రతిపత్తితో కూడిన రాజ్యాంగాన్ని రూపొందించి బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించింది. సైమన్ గో బ్యాక్ ఉద్యమంతో కోపోద్రిక్తుడైన భారత రాజ్య కార్యదర్శి బెర్కెల్ హెడ్ భారతీయుల రాజ్యాంగాన్ని రూపొందించుకోగలరా? అని విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ జాతీయ నాయకులు నెహ్రూ కమిటీని నియమించారు.

ముఖ్యాంశాలు

1. శాసనసభకు కార్యనిర్వహణశాఖ బాధ్యత వహించడం
2. భాషా రాష్ట్రాలు, స్వయంప్రతిపత్తి రాష్ట్రాలతో కలిపి సమాఖ్య వ్యవస్థగా ఏర్పాటు కావడం.
3. ప్రాథమిక హక్కుల రూపకల్పన.
4. శాసనమండలిలో మైనారిటీలకు పది సంవత్సరాల పాటు సీట్ల రిజర్వేషన్.
5. అవశిష్ట అధికారాలు కేంద్రానికి ఇవ్వడం.

రౌండ్ టేబుల్ సమావేశాలు: (1930-32)


సైమన్ కమిషన్ నివేదికలోని అంశాలను చర్చించడం కోసం భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలతో సంప్రతింపులు జరపడానికి బ్రిటిష్‌వారు మూడు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించారు.

మొదటి రౌండ్ టేబుల్ సమావేశం (1930 నవంబరు 12 - 1931 జనవరి 19)

- భారత జాతీయ కాంగ్రెస్ దీనికి హాజరు కాలేదు.
- ముస్లింలీగ్ తరపున జిన్నా, దళితుల తరపున డాక్టర్ అంబేద్కర్ హాజరయ్యారు.

రెండో రౌండ్ టేబుల్ సమావేశం (1931 సెప్టెంబరు 7 - 1931 డిసెంబరు 1)

- కాంగ్రెస్ తరపున గాంధీజీ, సరోజిని నాయుడు హాజరయ్యారు.



- ముస్లింలీగ్ తరపున జిన్నా, దళితుల తరపున డాక్టర్ అంబేద్కర్ హాజరయ్యారు.
- కమ్యూనల్ అవార్డు ప్రతిపాదనను తిరస్కరించి గాంధీ రెండో రౌండ్ టేబుల్ సమావేశాన్ని బహిష్కరించారు.

మూడో రౌండ్ టేబుల్ సమావేశం (1932 నవంబరు 17 - 1932 డిసెంబరు 24)

- కాంగ్రెస్ తప్ప మిగిలినవారు దీనికి హాజరయ్యారు.
- బ్రిటన్ ప్రధాని 'రామ్ సే మెక్ డొనాల్డ్' కమ్యూనల్ అవార్డును ప్రకటించారు. దీనిద్వారా షెడ్యూల్ కులాలు అనే పదాన్ని దళితులకు ఉపయోగించారు. దళితులకు నియోజకవర్గాలను రిజర్వు చేశారు.
- సైమన్ కమిషన్ నివేదిక, నెహ్రూ రిపోర్టు, రౌండ్ టేబుల్ సమావేశాలు, తీర్మానాలు, స్వతంత్ర నివేదికలు మొదలైన అన్నింటి ఆధారంగా 1935లో భారత ప్రభుత్వ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం 1937 నుంచి అమలులోకి వచ్చింది.



వి.చైతన్యదేవ్, పోటీ పరీక్షల నిపుణులు


స్పీకర్ ప్రసాద్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కవిత

అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయండి

» అసెంబ్లీ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత వినతి

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు భారత జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో స్పీకర్‌ను కలిసి ఆమె వినతిపత్రం సమర్పించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. బీసీల కోసం ఉద్యమాలు చేపట్టిన సంఘ సంస్కర్త పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని స్పీకర్‌ను కోరానన్నారు. గతంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో పోరాటం చేసి అసెంబ్లీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నామని, ఇప్పుడు అదే స్ఫూర్తితో పూలే విగ్రహం కోసం కూడా ఉద్యమిస్తామని తెలిపారు. ఏప్రిల్ 11న పూలే జయంతి లోపు స్పీకర్, ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయాన్ని తీసుకుంటారని భావిస్తున్నామని పేర్కొన్నారు. అప్పటి వరకు బీసీ సంఘాల మద్దతుతో ప్రతి గ్రామం నుంచి ఈ డిమాండ్ వచ్చేలా భారత్ జాగృతి ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 26న హైదరాబాద్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహబూబ్‌నగర్ నుంచి పోటీ చేస్తా: వంశీచంద్

మక్తల్, జనవరి 21: వచ్చే ఎన్నికల్లో మహబూబ్‌నగర్ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తానని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు, రాహుల్‌గాంధీ ఆశీస్సులతో బరిలోకి దిగుతానన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్‌లోని ద్వారకా ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీచంద్ మాట్లాడుతూ.. తనకు రాజ్యసభ స్థానం కోసం ఆఫర్ వచ్చినా, ప్రజల మధ్య ఉండాలనే కోరికతో లోక్‌సభకు పోటీ చేసేందుకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో విస్తృత స్థాయి సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో ప్రతీ అసెంబ్లీ పరిధిలో మూడ్రోజుల పాటు పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు.

మోదీ మళ్లీ ప్రధానయితే.. కాంగ్రెస్ పరిస్థితేంది?

» రేవంత్ పద్ధతిగా మాట్లాడాలి: మాజీ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ప్రధానిగా మూడోసారి మోదీ ఎన్నికయితే దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఏవిటని మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రశ్నించారు. దేశంలో కేవలం మూడు రాష్ట్రాలకే పరిమితమైన కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టడం కేంద్రంలోని బీజేపీకి పెద్ద పనేమి కాదని ఆయన పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతులో బొంద పెడతానని అనడం సరికాదని అన్నారు. 130 ఏళ్ల చరిత్ర ఉన్న కాంగ్రెస్ ఎన్ని రాష్ట్రాల్లో అధికారంలో ఉంది, వారు ఎంత లోతులో ఉన్నారో తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. బీజేపీ అక్షింతలు పంచడం తప్ప తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు.

వీధి రౌడీలా రేవంత్ మాటలు: శంభీపూర్‌రాజు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తెచ్చిన గులాబీ జెండాను వందమీటర్ల లోతున పాతిపెడతా అన్న రేవంత్ వ్యాఖ్యలు అర్థరహితమని, ఆయన ఒక వీధి రౌడీలా మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. సీఎం హోదాలో ఉన్న రేవంత్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన హితవు పలికారు.

బీఆర్ఎస్ పార్టీని దేవుడూ రక్షించలేడు

» ఆత్మవంచనతో పార్టీలో ఉండలేకే రాజీనామా: పీఎల్ శ్రీనివాస్



పంజాగుట్ట, జనవరి21 (ఆంధ్రజ్యోతి): 'కొంత మంది నాయకులు చేసిన అవినీతి, అక్రమాలతోనే పార్టీ ఓడిపోయింది. ఓటమికి ఒక్క కేసీఆర్‌నే బాధ్యుడిని చేయడం మాత్రం సరైంది కాదు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చిన రోజే.. పార్టీకి తెలంగాణతో ఉన్న పేగుబంధం తెగిపోయింది. ఉద్యమకారులను దూరంపెట్టి రాజకీయాలు చేశారు. చేసిన తప్పులను ఇప్పటికీ తెలుసుకోలేని నాయకులు నడిపే బీఆర్ఎస్ పార్టీని ఇకపై ఆ దేవుడు కూడా రక్షించ లేడు. ఆత్మవంచనతో బీఆర్ఎస్‌లో కొనసాగలేకే పార్టీకి రాజీనామా చేసున్నా" అని ఆ పార్టీ సీనియర్ నేత పీఎల్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడగొట్టినా పార్టీ నాయకులు ఇంకా ఆత్మపరిశీలన చేసుకోవడం లేదని విమర్శించారు. తాను ఏ పార్టీలో చేరబోయేదీ త్వరలోనే వెల్లడిస్తానని ఆయన తెలిపారు.

మేము తలుచుకుంటే బీఆర్ఎస్‌ను 39 ముక్కలుగా చేస్తాం

100 రోజులు కాకుండానే సర్కారుపై విమర్శలా?.. కేటీఆర్, హరీశ్ ఆస్పత్రిలో చూపించుకోవాలి

బీఆర్ఎస్‌ను బరాబర్ బొందపెడతాం.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు


యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

యాదాద్రి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): "ఆరు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని మాజీ మంత్రులు కేటీఆర్, హరీ‌శ్‌రావు అంటున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తారా? మేము తలుచుకుంటే బీఆర్ఎస్‌లో ఉన్న 39 మంది ఎమ్మెల్యేలను 39 ముక్కలుగా చేస్తాం.. బీఆర్ఎస్‌ను 14 ముక్కలు చేస్తాం" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అన్నట్లు బీఆర్ఎస్‌ను బరాబర్ బొందపెడతామని చెప్పారు. కరెంటు బిల్లులు కట్టవద్దని కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఇళ్లకు ఉచిత విద్యుత్ విషయమై ఆయన ఆలోచించి మాట్లాడాలన్నారు. అధికారం కోల్పోయిన షాక్‌లో కేటీఆర్, హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, వారు ఆస్పత్రిలో చూపించుకుంటే బాగుంటుందని హితవు పలికారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్నామని, కేవలం 40 రోజులకే బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం చేసిన అవినీతి సొమ్ముతో 20ఏళ్ల పాటు సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రగతిభవన్‌లోకి వెళ్లేందుకు అప్పటి హోంమంత్రికే అనుమతి లేదని, కేవలం లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబసభ్యులే ఉండేవారన్నారు. ప్రస్తుతం సచివాలయంలో ఏ అంతస్తులో చూసినా వేలాది మంది ప్రజలు కనిపిస్తున్నారని తెలిపారు. యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో రూ.10వేల కోట్ల కమీషన్లు తిన్నారని, దోచుకున్న సొమ్మును కక్కించేందుకు విజిలెన్స్‌తో పాటు న్యాయం విచారణ చేపడతామన్నారు. రీజినల్ రింగురోడ్డు(ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్చేందుకు ప్రయత్నిస్తామని, దీనిపై అధికారుల నుంచి నివేదిక వచ్చిన తర్వాత ఓఆర్ఆర్‌కు 60 కిలోమీటర్ల దూరం నుంచి వెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ప్రతి గ్రామంలో 100 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

హైదరాబాద్‌కు టెస్లా?

(మొదటిపేజీ తరువాయి)

ఆయన వెల్లడించలేదు. తమ ప్రభుత్వం కొత్త ఇంధన విధానాన్ని తీసుకురానున్నట్లు మాత్రం వివరించారు. యూకే రాజధాని లండన్‌లోని భారత హై కమిషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడారు. ఫార్మా, వైద్య ఉపకరణాలు, ఐటీ, ఏరో స్పేస్, డేటా సైన్స్ తదితర రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని తెలిపారు. శస్త్రచికిత్సలకు సుదీర్ఘ సమయం నిరీక్షించాల్సి వచ్చే యూకే తదితర దేశాలను దృష్టిలోపెట్టుకుని మెడికల్ టూరిజం అభివృద్ధిపై శ్రద్ధ చూపుతామన్నారు. కాగా, అమెరికాకు చెందిన టెస్లా భారత మార్కెట్‌లోకి వచ్చేందుకు రెండేళ్లుగా పలు ప్రయత్నాలు చేస్తోంది. ఇక గత ఏడాది జూలైలో హైదరాబాద్‌లో ప్లాంట్ స్థాపిస్తామన్న బీవైడీ (బిల్డ్ యువర్ డ్రీమ్) ప్రతిపాదనకు కేంద్రం అంగీకరించలేదు. మరోవైపు హై కమిషన్‌లో సమావేశానికి ముందు సీఎం రేవంత్ బ్రిటన్ పార్లమెంటేరియన్లు, వాణిజ్యవేత్తలు, భారత సంతతికి చెందిన వ్యక్తులతో భేటీ అయ్యారు. తెలంగాణ మూలాలున్న మహిళా కౌన్సిలర్ ఒకరు ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను కీలక ప్రశ్న అడిగారు. తెలంగాణ నుంచి వచ్చి యూకేలో హింసకు గురైన వ్యక్తులకు, దురదృష్టవశాత్తు ఎవరైనా చనిపోతే వారి మృతదేహాన్ని స్వదేశం తరలించేందుకు బాధిత కుటుంబాలకు ఏమైనా సాయం చేసే ఉద్దేశం మీ ప్రభుత్వానికి ఉందా? అని అడిగారు. దీనిపై రేవంత్ స్పందిస్తూ ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు ఆదుకునేలా హెల్ప్ లైన్ లేదా ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ కార్మికులకు ఇలానే హెల్ప్‌లైన్ ఉన్న సంగతిని ప్రస్తావించారు. కాగా, తమ ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి కట్టుబడి ఉందని.. ఎన్నికల సమయంలోనే కాక, ప్రతి రోజూ ప్రజల నమ్మకాన్ని చూరగొనేలా పనిచేస్తామని రేవంత్ తెలిపారు.

మూసీ పునరుద్ధరణతో అద్భుత హైదరాబాద్

ప్రపంచంలోని చారిత్రాత్మక నగరాలన్నీ నీటి వనరుల చుట్టే అభివృద్ధి చెందాయని, నదులు, సరస్సులు వాటికి సహజత్వాన్ని తెచ్చిపెట్టాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మూసీ పునరుద్ధరణతో హైదరాబాద్ ప్రపంచంలోనే అద్భుతమైన నగరంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. లండన్ నుంచి బయల్దేరిన సీఎం ఆదివారం దుబాయ్‌లోని వాటర్ ఫ్రంట్ ప్రాజెక్టును సందర్శించారు. ఓ ఆకాశ హర్మ్యం పైకి వెళ్లి ఏరియల్ వ్యూ కనిపించేలా ఉన్న వాటర్ ఫ్రంట్ అందాలను తిలకించారు. ప్రపంచ స్థాయి సిటీ ప్లానర్లు, డిజైనర్లు, మెగా మాస్టర్ ప్లాన్ డెవలపర్లు, ఆర్కిటెక్ట్‌లతో భేటీ అయ్యారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న మూసీ రివర్ ప్రాజెక్టుకు అపురూపమైన డిజైన్లు, నమూనాలు రూపొందించాలని వారిని కోరారు. 56కిలోమీటర్ల పొడవునా మూసీ రివర్ ఫ్రంట్, గ్రీన్ అర్బన్ పార్కులు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణ డిజైన్లు, అభివృద్ధి నమూనాలు, అవసరమైన పెట్టుబడులపై వివిధ సంస్థలతో చర్చలు జరిపారు. దాదాపు 70సంస్థలతో సంప్రదింపులు జరపగా.. అన్ని సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యానికి, మూసీ ప్రాజెక్టుపై ఆసక్తి ప్రదర్శించాయి. హైదరాబాద్ మూసీ రివర్ ఫ్రంట్‌ను నిర్మించేందుకు దేశ విదేశాల్లోని వివిధ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రతినిధి బృందం అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే లండన్‌లోని థేమ్స్ రివర్ ఫ్రంట్‌ను సందర్శించగా, తాజాగా దుబాయ్ వాటర్ ఫ్రంట్‌ను సందర్శించింది.


దుబాయ్‌లోని పలువురు ఆర్కిటెక్ట్, డిజైన్ సంస్థల ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి

ఏడు రోజులు బిజీబిజీ..

సీఎం రేవంత్ ఏడు రోజుల విదేశీ పర్యటనలో బిజీబిజీగా గడిపారు. ఈ నెల 15న స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రారంభమైన 54వ ప్రపంచ ఆర్థిక సదస్సుకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి హాజరయ్యారు. పలు కంపెనీలతో చర్చించి, వారిని ఒప్పించి రాష్ట్రానికి దాదాపు రూ.40వేల కోట్లకుపైగా పెట్టుబడులను రాబట్టారు. ఇతర దేశాల నుంచి వచ్చిన పలువురు ప్రముఖులతో పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 18న లండన్ వెళ్లారు. పలు ప్రముఖ కంపెనీల వ్యవస్థాపకులు, కొందరు సీఈవోలతో భేటీ అయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణమై ఆదివారం దుబాయ్‌కు చేరుకున్న సీఎం.. మూసీ అభివృద్ధిపై చర్చించారు. విదేశీ పర్యటనలో సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్, సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్‌రెడ్డి, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి పాల్గొన్నారు. సీఎం నేతృత్వంలోని ప్రతినిధి బృందం దుబాయ్‌లో ఆదివారం అర్ధరాత్రి వరకు చర్చలు కొనసాగించింది. సోమవారం ఉదయం సీఎం హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు.

ప్రవాసీయులకు మార్చిలోగా ఎన్నారై పాలసీ

» జెద్దాలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, జనవరి 21: ఎడారి దేశాలలో చెమటోడ్చి పనిచేస్తున్న తెలంగాణ ప్రవాసీయుల సంక్షేమం కోసం ఎన్నారై పాలసీని మార్చిలోగా ప్రకటిస్తామని ప్రవాసీ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. పెట్టుబడుల సాధన కోసం దావోస్ నుంచి జెద్దాకు వచ్చిన మంత్రిని ప్రవాసీయులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీమారకం ద్వారా మాతృభూమికు ఎనలేని సేవలందిస్తున్న ప్రవాసీయుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా మానవీయ కోణమైన సహాయ విధానంతో కూడిన ఎన్నారై పాలసీని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించనుందని తెలిపారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజీని పెంపొందించడానికి ప్రవాసీయులు తమ వంతుగా ప్రయత్నించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదిలా ఉండగా.. జెద్దాలో ఆదివారం ప్రముఖ వ్యాపారవేత్తలతో పెట్టుబడులపై మంత్రి సమావేశయ్యారు. సౌదీ యువరాజు ప్రత్యేక కార్యాలయం జనరల్ మహమ్మద్ బిన్ అబ్దుల్లా అల్ రాయెస్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ విధానాలు, ఐటీ పరిశ్రమకు సహకారం అందించడం వంటి అంశాలపై వివరించారు. రసాయనాలు, ఇంధన రంగంలో దిగ్గజ కంపెనీగా ఉన్న ఆరాంకో సంస్థ ప్రతినిధులతోనూ మంత్రి సమావేశమై.. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంపై వారితో చర్చించారు. అదేవిధంగా విద్యుత్తు, హాస్పిటాలిటీ, రియల్ ఎస్టేట్, టెక్నాలజీ ఆవిష్కరణ రంగాలకు చెందిన ఆల్‌షరీఫ్ గ్రూప్ హోల్డింగ్స్, ప్రముఖ పెట్టుబడుల కంపెనీ సెడ్కో క్యాపిటల్స్ ఆహార ఉత్పత్తుల సంస్థ అయిన సవోలా గ్రూప్ సీఈవో, సౌదీ బ్రదర్స్ కమర్షియల్ కంపెనీ, బట్టర్జీ హోల్డింగ్ కంపెనీలకు చెందిన పలువురు ఛైర్మన్లు, సీఈవోలు, ఇతర ప్రతినిధులతో మంత్రి శ్రీధర్ బాబు సమావేశమయ్యారు. పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ అనువైన రాష్ట్రమని, రాష్ట్రప్రభుత్వం తరఫున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మంత్రి వెంట రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ తదితరులు ఉన్నారు.

ఆసరాకు అందలం

సీఎం, ప్రభుత్వ సలహాదారులుగా వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కార వేణుగోపాల్‌రావు

ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా మల్లు రవి.. ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్


వేం నరేందర్‌రెడ్డి


షబ్బీర్ అలీ


వేణుగోపాల్‌రావు


మల్లు రవి

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్‌గా నియామకం జరగకముందు నుంచి.. సీఎంగా ఎన్నికయ్యేంత వరకూ రేవంత్‌రెడ్డి వెన్నంటి ఉన్న నేతలకు తగిన ప్రతిఫలం దక్కింది. వేం నరేందర్‌రెడ్డిని సీఎం సలహాదారుగా (ప్రజాసంబంధాలు), షబ్బీర్ అలీ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమం), హర్కార వేణుగోపాల్‌రావు (ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్)లను ప్రభుత్వ సలహాదారులుగా, మల్లు రవిని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి శనివారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నలుగురు నేతలను ఆయా పదవుల్లో క్యాబినెట్ ర్యాంకులో నియమించారు. వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్ అలీ, హర్కార వేణుగోపాల్‌రావు, మల్లు రవి కష్ట కాలంలోనూ రేవంత్‌రెడ్డికి అండగా నిలిచారు. రేవంత్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డి మధ్య స్నేహబంధం.. వారిద్దరూ టీడీపీ నేతలుగా ఉన్నప్పటి నుంచీ కొనసాగుతోంది. రేవంత్‌తో పాటు కాంగ్రెస్‌లో చేరిన వేం నరేందర్‌రెడ్డి ఆయనకు సన్నిహితునిగా వ్యవహరిస్తూ వస్తున్నారు. షబ్బీర్ అలీ, హర్కార వేణుగోపాల్‌రావు, మల్లు రవి.. రేవంత్‌రెడ్డి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఉన్నప్పటి నుంచీ ఆయన వెంటే ఉన్నారు. రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా నియామకం కావటంలో వీరు తమ వంతు పాత్ర పోషించారు. ప్రతిగా రేవంత్ కూడా వారికి క్యాబినెట్ ర్యాంకుతో ప్రభుత్వ పదవులు ఇచ్చి సముచితంగా గౌరవించారు. ఈ నేతల ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు షబ్బీర్ అలీ మంత్రిగా పని చేశారు. వేం నరేందర్ రెడ్డి టీడీపీ నుంచి గతంలో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌లో చేరి కీలక బాధ్యతలు చేపట్టారు. నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ అయిన మల్లు రవి.. వైఎస్ హయాంలో ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా ప్రొటోకాల్ వ్యవహారాలు చూస్తున్న హర్కార వేణుగోపాల్‌రావుకు ప్రొటోకాల్, పబ్లిక్ రిలేషన్ వ్యవహారాలకు సంబంధించి ప్రభుత్వ సలహాదారుగా నియమించారు. ప్రభుత్వ సలహాదారులుగా, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధిగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ నాయకులను మంత్రి జూపల్లి అభినందించారు. కాగా, వేం నరేందర్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమించనున్నట్లు ఈ నెల 19వ తేదీన ఆంధ్రజ్యోతి వెల్లడించిన సంగతి తెలిసిందే.

15 పోస్టులకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్

ఇటీవల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేతలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమైనప్పుడు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికతో పాటుగా కార్పొరేషన్ ఛైర్మన్, ఇతర నామినేటెడ్ పోస్టుల నియామకాలపైనా చర్చించారు. దాదాపు 30 నియామకాలకు అధిష్ఠానం ముందు రేవంత్‌రెడ్డి ప్రతిపాదనలు ఉంచగా.. అందులో సగం మేరకు నియామకాలకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలుస్తోంది. దావోస్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. హైదరాబాద్ వచ్చాక ఆయా పదవులకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

మిమ్మల్ని కలిసే అవకాశం ఇప్పుడొచ్చింది

ప్రతిపక్షంలో ఉంటే కానీ.. మేం మీకు గుర్తు రాలేదు.. ఇన్నాళ్లూ పార్టీలో మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు

» కేటీఆర్ వద్ద బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తల గోడు

» ఇకపై 3 నెలలకోసారి కలుద్దాం: కేటీఆర్

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): 'గత పదేళ్లలో పార్టీలో ఎవరూ ఎవరినీ పట్టించుకోలేదు. మిమ్మల్ని కలిసి ఇంతసేపు మాట్లాడే అవకాశం ఇప్పుడు వచ్చింది.. సంతోషం. మేం బీఆర్ఎస్ నాయకులమని చెప్పుకుంటున్నాం.. కానీ మాకు పార్టీ పదవులు లేవు. మా కష్టాలను వినే వారు లేరు' అని సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఓ నాయకుడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో అన్నారని తెలిసింది. 'ప్రతిపక్షంలో కూర్చుంటే కానీ పార్టీ క్యాడర్ గుర్తుకు రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కార్యకర్తలను పట్టించుకుని ఉంటే.. ఈ రోజు పరిస్థితి ఇలా ఉండేది కాదు కదా..' అని సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని సీనియర్ నాయకుడు అభిప్రాయం వెలిబుచ్చారని సమాచారం. 'అధికారంలో ఉన్న పదేళ్ల మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. ఉద్యమ సమయం నుంచి పార్టీలో ఉన్న వారికీ గుర్తింపు దక్కలేదు. బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. పార్టీ కమిటీలు లేవు. నామినేటెడ్ పోస్టులు ఇవ్వలేదు. లీడర్‌కు, క్యాడర్‌కు మధ్య దూరం బాగా పెరిగింది' అని, ఆదివారాల్లో సికింద్రాబాద్, హైదరాబాద్, మల్కాజ్‌గిరి పరిధిలోని బీఆర్ఎస్ నేతలతో తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో పలువురు నేతలు, కార్యకర్తల అభిప్రాయం ఇది.


తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

రూటు మార్చిన అగ్ర నేతలు..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బీఆర్ఎస్ అగ్రనేతలు రూటు మార్చారు. గతంలో మేం చెప్పింది వినాలి అన్నట్లుగా ఉన్న అగ్రనేతలు.. ఇప్పుడు పార్టీ శ్రేణుల అభిప్రాయం తెలుసుకుంటున్నారు. దీంతో పలువురు నేతలు పదేళ్లుగా పార్టీలో నెలకొన్న పరిస్థితులపై గళం విప్పుతున్నారు. ఉద్యమ సమయం నుంచి పార్టీలోనే ఉన్నా తమకు సరైన గుర్తింపు లేదని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి మాత్రం ప్రాధాన్యం దక్కుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అంబర్‌పేట నియోజకవర్గానికి సంబంధించి ఆసక్తికర చర్చ జరిగినట్లు తెలిసింది. 'అడ్డా కూలీల్లాగా సమయానికి వచ్చి కొందరు పార్టీ కండువాలు కప్పుకుంటున్నారు. అలాంటి వారికే గుర్తింపు.. పదవులా..?' అని ఓ కార్యకర్త పేర్కొన్నట్లు సమాచారం. 'మాకు పార్టీలో గుర్తింపు లేదు. అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు సరిగా లేరు. అధికారుల వద్దకు ప్రజా సమస్యలపై వెళితే బీఆర్ఎస్ నాయకులమని చెప్పుకుంటున్నామే కానీ.. పార్టీలో మా హోదా ఏంటో చెప్పలేని పరిస్థితి' అని హైదరాబాద్ లోక్‌సభ పరిధిలోని కొందరు నాయకులు పేర్కొన్నట్లు సమాచారం.

ఇంతకు ముందులా ఉండదు: కేటీఆర్

మల్కాజ్‌గిరి లోక్‌సభ నేతల సమావేశంలోనూ కొందరు నాయకులు తమ ఇబ్బందులను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. 'పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి, ఏళ్లుగా నమ్ముకుని ఉన్న వారికి అవకాశాలు ఇవ్వాలి' అని ఓ మహిళా నేత పేర్కొన్నట్లు సమాచారం. డివిజన్, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కమిటీలను నియమించాలని మెజారిటీ నేతలు పేర్కొనగా.. అందుకు కేటీఆర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది. అన్ని స్థాయిల్లో కమిటీలు వేస్తామని.. వారం, పది రోజుల్లో శాసనసభా నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించుకుందామని రెండు రోజులుగా జరిగిన సమావేశాల్లో కేటీఆర్ చెప్పినట్లు సమాచారం. 'హైదరాబాద్‌కు సంబంధించి ప్రత్యేకంగా పార్టీ ఆఫీస్ అందుబాటులోకి వస్తుంది. ఇంతకు ముందులా కాదు.. ప్రతి మూడు నెలలకోసారి సమావేశమవుదాం. గ్రేటర్ హైదరాబాద్‌లో పార్టీ బలంగా ఉంది.. ఐక్యంగా పనిచేస్తే పార్లమెంటు స్థానాలను సులువుగా గెలుచుకుంటాం' అని కేటీఆర్ చెప్పినట్లు తెలిసింది.

బీఆర్ఎస్‌ను ఖతం చేసే కుట్ర

» మా పార్టీని ఎవరూ ఏమీ చేయలేరు

» మల్కాజిగిరి సన్నాహక భేటీలో కేటీఆర్

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): "బీఆర్ఎస్ పార్టీని ఖతం చేయాలని బీజేపీ, కాంగ్రెస్‌లు కుట్ర పన్నుతున్నాయి. మొన్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ ఇదేమాట అన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఆ సంస్థ అధినేత రాధాకృష్ణ రాసిన కొత్త పలుకు వ్యాసంలోనూ ఇదే చెప్పారు. తెలంగాణ గొంతుక అయిన మా పార్టీని ఖతం చేయడం ఎవరి వల్లా కాదు" అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందులో పార్టీ ముఖ్య నేతలు హరీశ్‌రావు, కె.కేశవరావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కడియం శ్రీహరి, ఆ పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఇటీవల ప్రధాని మోదీని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క కలిసినపుడు.. బీఆర్ఎస్‌ను ఫినిష్ చేసేందుకు పూర్తిగా సహకరిస్తానని ఆయన అన్నట్లు.. రాధాకృష్ణ చెప్పారన్నారు. ఇదే నిజమైతే.. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని రుజువు అవుతోందని పేర్కొన్నారు. మోదీ-అదానీ ఒక్కటే అని ఢిల్లీలో విమర్శించే కాంగ్రెస్.. దావోస్‌లో అదే అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడుల ఒప్పందం కుదుర్చుకున్నదని, తమ ప్రభుత్వ హయాంలో అదానీకి అవకాశమే ఇవ్వలేదని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా.. బీజేపీకి బీఆర్ఎస్ బీటీమ్ కాదనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు, పార్టీ కార్యకర్తలు గుర్తించాలన్నారు. ఉద్యమ సమయం నుంచి ఎన్నో ఆటంకాలను ఎదుర్కొన్న తమ పార్టీని ఇక్కడి ప్రజలకు దూరం చేయలేరని, ప్రధాని మోదీకి, సీఎం రేవంత్‌రెడ్డికి తమ పార్టీ భయపడేది కాదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓట్లతో 14 సీట్లు కోల్పోయామని, బీఆర్ఎస్ మరో ఏడెనిమిది స్థానాలు అదనంగా గెలిచి ఉంటే.. తెలంగాణలో హంగ్ సర్కార్ ఏర్పడేదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కన్నా.. కాంగ్రెస్ కేవలం నాలుగు లక్షల ఓట్లు ఎక్కువ సాధించిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ దొంగ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ప్రజలు ఇప్పుడిప్పుడే వాస్తవాలు తెలుసుకుంటున్నారని చెప్పారు.

హామీల అమలుకు ఒత్తిడి తేవాలి

200 యూనిట్లలోపు వచ్చిన విద్యుత్ బిల్లులను జనవరి నుంచి కట్టొద్దని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గత నవంబరు నుంచే అన్నారని కేటీఆర్ తెలిపారు. ప్రస్తుతం తాను వారి మాటలనే గుర్తు చేస్తున్నానని పేర్కొన్నారు. తాను కరెంటు బిల్లులు కట్టొద్దంటే విధ్వంసకర మనస్తత్వం అని అంటున్నారని మండి పడ్డారు. నిజాలు మాట్లాడితే విధ్వంసకర మనస్తత్వమా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇక నుంచి కరెంటు బిల్లులను కాంగ్రెస్ నేత సోనియా గాంధీకి పంపుదామని, ఇందుకోసం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు సమాయత్తం కావాలన్నారు. నిరుద్యోగ భృతిపై తప్పించుకున్నట్టే.. పాలమూరు- రంగారెడ్డి జాతీయ హోదాపై కాంగ్రెస్ మాట మార్చిందని మండిపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోందన్నారు. హామీలను పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా.. ఇప్పటి నుంచే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ సర్కారు తీరును ఎండగట్టేందుకు సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టాన్ని వాడుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రగతి భవన్‌లో విలాసవంతమైన సౌకర్యాలున్నాయంటూ దుష్ప్రచారం చేశారని, ఇప్పుడు డిప్యూటీ సెం భట్టి అందులోనే ఉంటున్నారని, అక్కడ విలాసాలే ఉంటే.. ఆయన టాం టాం వేసేవారు కదా అని అన్నారు.

మూడు నెలలకోసారి కమిటీల సమావేశం

బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై కాంగ్రెస్ వాళ్లు తప్పుడు కేసులు పెడుతున్నారని, పార్టీ లీగల్ సెల్ అందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ కమిటీలు పూర్తిగా వేయకపోవడం వల్ల నష్టం జరిగిందని, గతంలో జరిగిన పొరపాట్లు ఇక ముందు ఉండవని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. మూడు నెలలకోసారి అన్ని కమిటీల సమావేశం నిర్వహించుకుందామని తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు: హరీశ్

"కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మార్చి నెల 17తో వంద రోజులు పూర్తవుతుంది. అప్పటికి పార్లమెంటు ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుంది. ఈ లోపే కాంగ్రెస్ వాళ్లు చెప్పినట్లుగా ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి" అని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ బూచిని చూపించి.. ప్రజలికిచ్చిన హామీలను వాయిదా వేసే ప్రయత్నంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. కర్ణాటకలో ఉన్న పరిస్థితే తెలంగాణలోనూ ఉంటుందని, వారిచ్చిన 420 హామీల్లో పావలా వంతు కూడా నెరవేర్చలేదని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని, ఆ రెండు పార్టీల డ్రామాలు ఎండగట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అధికారంలో లేదని కార్యకర్తలు కుంగిపోవద్దని, భవిష్యత్తులో అధికారం బీఆర్ఎస్సేనని చెప్పారు. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్‌ను గెలిపించి మన సత్తా చాటాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని వంద మీటర్ల లోతులో బొందపెడతానని రేవంత్ వ్యాఖ్యానించడం సరికాదని, ఆయనే కాదు.. వాళ్ల అయ్య నుంచి కూడా కాదన్నారు. తమ పార్టీని బొంద పెట్టే మొనగాడు ఈ భూమ్మీద పుట్టలేదని పేర్కొన్నారు.



సనత్‌నగర్‌లోని హనుమాన్ మందిరంలో అయోధ్య సీతారాములకు బహూకరించేందుకు మగ్గంపై సిద్ధం చేస్తున్న పోచంపల్లి ఇక్కత్ పట్టుచీర

అయోధ్య రాములోరికి పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలు

» 29న తీసుకెళ్లనున్న మద్దెలమ్మదేవి ఆలయ కమిటీ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 21: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి ఇక్కత్ చీరకు మరో అరుదైన గౌరవం దక్కింది. అయోధ్య రామ మందిరంలో సీతారాములకు పోచంపల్లి ఇక్కత్ పట్టు వస్త్రాలను బహూకరించనున్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ సనత్‌నగర్‌లోని హనుమాన్ మందిరంలో భూదాన్‌పోచంపల్లికి చెందిన మద్దెలమ్మదేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేనేత కళాకారులు మగ్గంపై పట్టు వస్త్రాలను నేయడం ప్రారంభించారు. వీటి తయారీ మరో మూడు రోజుల్లో పూర్తవుతుందని, 29న అయోధ్యకు తీసుకు వెళ్లి ఆలయంలో అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. వస్త్రాల తయారీ ప్రక్రియలో పోచంపల్లి చేనేత కళాకారులు చంద్రశేఖర్, చెన్నకేశవులు, ఆంజనేయులు, గిరివాసు, యాదగిరి పాల్గొన్నారు. వీరికి సికింద్రాబాద్ గణపతి దేవాలయ కమిటీ సభ్యులు సహకారం అందించారు.

రామయ్య ఊరేగింపునకు ముస్లింల పల్లకి

» అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేసిన ముస్లింలు

ఇనుగుర్తి, పెనుబల్లి, జనవరి 22: దేశమంతా ఎంతో ఉత్సుకతతో అయోధ్యలో రామయ్య ప్రాణప్రతిష్ఠ కోసం ఎదురు చూస్తున్న వేళ రాష్ట్రంలో పలు చోట్ల ముస్లింలు మత సామరస్యాన్ని చాటుకుంటున్నారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం రామచంద్రాపురం సర్పంచ్ ఎస్‌కే కరీముల్లా సహా పలువురు ముస్లింలు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, రామయ్య చిత్రపటాలను హిందువులతో కలిసి ఊరేగింపుగా దేవాలయానికి చేర్చారు. అలాగే గృహాలపై హిందూ, ముస్లింలు సమైక్యతతో శ్రీరాముడి పతాకాలను ఎగురవేశారు. ఇక మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందినముగ్గురు ముస్లిం అన్నదమ్ములు గ్రామంలో శ్రీరాముడి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కోసం పల్లకిని తయారు చేయించారు. తండ్రి రబ్బాని జ్ఞాపకార్థం కుమారులు ఇలియాజ్, ఇంతియాజ్, రియాజ్.. దానిని స్థానిక ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులుకు అందజేశారు.

రాష్ట్రపతి ఎట్‌హోంకు నెల్లుట్ల సర్పంచ్

» గణతంత్ర దినోత్సవ తేనేటి విందుకు ఆహ్వానం



స్వరూపారాణి

లింగాలఘణపురం, జనవరి 21: జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం నెల్లుట్ల గ్రామ సర్పంచ్ చిట్ల స్వరూపారాణికి అరుదైన అవకాశం లభించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఇచ్చే ఎట్ హోం తేనేటి విందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కేంద్ర పంచాయతీరాజ్ విభాగం నుంచి తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఆదేశాలు అందాయి. 2021-22 సంవత్సరానికి నీటి సమృద్ధి విభాగంలో నెల్లుట్ల పంచాయతీకి జాతీయ పురస్కారం లభించిన సంగతి తెలిసిందే. గత ఏడాది ఏప్రిల్ 17న నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ స్వరూపారాణి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ క్రమంలోనే సర్పంచ్ స్వరూపారాణికి ఎట్ హోమ్‌కు ఆహ్వానం అందింది. దేశ వ్యాప్తంగా కేవలం ఎనిమిది మంది సర్పంచ్‌లకే ఈ అవకాశం దక్కగా.. అందులో రాష్ట్రం నుంచి నెల్లుట్ల సర్పంచ్‌కు స్థానం దక్కడం విశేషం.

రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఆశ్రమ విద్యార్థులు

రాజేంద్రనగర్, జనవరి21 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న న్యూఢిల్లీలో నిర్వహించే పరేడ్‌ను వీక్షించేందుకు రాష్ట్రంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులకు ఆహ్వానం అందింది. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన 15 మంది బాలికలు, 15 మంది బాలురను ఢిల్లీ పర్యటనకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఎంపిక చేసింది. ఈ విద్యార్థులను ఢిల్లీ తీసుకుని వెళ్లి తిరిగి తెచ్చేందుకు ముగ్గురు లైజన్ అధికారులను కూడా ఎంపిక చేశారు. 23వ తేదీన ఢిల్లీ చేరుకోనున్న ఈ బృందం తిరిగి.. 27న హైదరాబాద్ చేరుకుంటుంది.

శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

శంషాబాద్ రూరల్, జనవరి 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఆర్‌జీఐఏకు ఆదివారం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. గుర్తుతెలియని దుండగుడు ఫోన్‌చేసి, విమానాశ్రయంలో బాంబు పెట్టామంటూ బెదిరించాడు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తనిఖీలను ముమ్మరం చేశారు. బ్యాగేజీ ప్రాంతాలు, టెర్మినల్స్ వద్ద తనిఖీ చేశారు. విమానాశ్రయంలోకి వచ్చే ప్రయాణికులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రూ.41 కోట్ల హెరాయిన్ సీజ్

» ఆర్‌జీఐఏలో జాంబియా మహిళ అరెస్టు

శంషాబాద్ రూరల్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికా నుంచి దర్జాగా డాక్యుమెంట్ ఫోల్డర్‌లో హెరాయిన్ తీసుకొస్తున్న ఓ మహిళ హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టయ్యారు. ఆమె నుంచి రూ.41.4 కోట్లు విలువచేసే 5.92 కిలోల హెరాయిన్‌ను సీజ్ చేసినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. నిందితురాలిని జాంబియాకు చెందిన 'లుసాకా'గా గుర్తించామన్నారు. ఆమె జింబాంబ్వే నుంచి సింగపూర్ మీదుగా హైదరాబాద్‌కు చేరుకున్నారని, పక్కా సమాచారంతో తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ఆమె చేతిలోని డాక్యుమెంట్ ఫోల్డర్‌లో హెరాయిన్ లభించిందని తెలిపారు. నిందితురాలిని అరెస్టు చేసి, తదుపరి దర్యాప్తు నిమిత్తం కస్టమ్స్ కార్యాలయానికి తరలించామని చెప్పారు.

అందుబాటులో జేఈఈ మెయిన్ అడ్మిట్ కార్డులు

» ఈ నెల 24 నుంచి సెషన్-1 పరీక్షలు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24 నుంచి జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ పరీక్షల కోసం విద్యార్థులకు సంబంధించిన అడ్మిట్ కార్డులను తాజాగా విడుదల చేశారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి ఈ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఎన్‌టీఏ సూచించింది. మెయిన్ పరీక్షలకు దేశవ్యాప్తంగా సుమారు 12.3 లక్షల మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరిలో తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 2.5 లక్షల మంది ఉంటారని అంచనా. దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షలు జనవరి 24, 27, 29, 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో జరగనున్నాయి. తర్వాత మెయిన్ సెషన్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అడ్వాన్స్‌డ్ కోసం ఎంపిక చేస్తారు.

దేశంలో హిందుత్వ భావాలు పెరుగుతున్నాయి

» 'అక్టోబర్ విప్లవం' స్ఫూర్తితో ముందుకెళ్దాం: రాఘవులు

హైదరాబాద్, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో హిందుత్వ భావాలు పెరుగుతున్నాయని, వాటిని ఎలా ఎదుర్కోవాలనే విషయంలో లెనిన్ రచనలు ఉపయోగపడుతాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్థంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాఘవులు మాట్లాడుతూ రాజకీయ, సామాజిక, విద్యా తదితర అన్ని వ్యవస్థల్లో భావవాదం ఇమిడి ఉంటుందని, దాన్ని నిలువరించేందుకు విప్లవకారులు అవసరమని అన్నారు. దోపిడీ, అసమానతలు లేని కష్టజీవుల రాజ్యం రావాలని, ఆ దిశగా అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో ముందుకుసాగాలని కోరారు.

దోచుకోవడం.. దాచుకోవడమే!

ఏపీలో ఎక్కడ చూసినా మైనింగ్‌.. ఇసుక, మద్యం మాఫియానే.. అన్న జగన్ సర్కారుపై చెల్లెలు షర్మిల ఫైర్

» ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతల స్వీకారం

అమరావతి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రలో ఎక్కడ చూసినా మైనింగ్, ఇసుక, మద్యం మాఫియానేనని.. దోచుకోవడం, దాచుకోవడమేనని పీసీసీ నూతన అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. అభివృద్ధి జరగడం లేదు గానీ.. దళితులపై దాడులు మాత్రం వందకు వంద శాతం పెరిగాయని ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు. ఆదివారం విజయవాడలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో పీసీసీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఆమె.. పార్టీ నేతలు, కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ఆంధ్రరత్న భవన్‌లో సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి జరగలేదని, అప్పులు మాత్రం రూ.10 లక్షల కోట్లకు చేరుకున్నాయన్నారు. 'రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న అప్పు రూ.లక్ష కోట్లు. చంద్రబాబు హయాంలో రూ.2 లక్షల కోట్లు అప్పు చేస్తే, ప్రస్తుతం సీఎం జగన్‌రెడ్డి రూ.3 లక్షల కోట్లకు పైగా చేశారు.. మొత్తంగా రూ.6.50 లక్షల కోట్లు అప్పు చేశారు. కార్పొరేషన్ రుణాలు, ఇతర బకాయిలతో కలిపితే రూ.10 లక్షల కోట్లు అప్పుచేసినా రాష్ట్రం అభివృద్ధి చెందిందా..? రాష్ట్రానికి రాజధాని ఉందా..? విజయవాడలో కనీసం మెట్రో అయినా ఉందా..? పదేళ్లలో కనీసం 10 పెద్ద పరిశ్రమలైనా వచ్చాయా? రోడ్డు వేయడానికి కూడా నిధుల్లేని పరిస్థితి. కనీసం ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు కూడా ఇవ్వడం లేదు. దేనికీ డబ్బుల్లేవు' అని విరుచుకుపడ్డారు. తాను కాంగ్రెస్‌లో చేరితే ఏ పార్టీకి కీడు జరుగుతుందో తనను అడగడం కంటే ప్రజలను అడిగితే వారే సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమన్నారంటే..

వైసీపీ, టీడీపీ.. బీజేపీ తొత్తులు

బీజేపీ రైటిస్ట్ పార్టీ. అది అధికారంలో ఉంటే మణిపూర్ వంటి ఘటనలే జరుగుతాయి. ఏపీకి అన్యాయం చేసింది. ప్రత్యేక హోదా ఇవ్వలేదు. అమరావతి నిర్మాణాన్ని నిలిపేసింది. పోలవరం పూర్తి చేయకుండా రైతులను మోసం చేసింది. ఏపీ ప్రజలు బీజేపీకి బుద్ధి చెప్పాలి.. చెబుతారు కూడా. రాజధాని అమరావతిని చంద్రబాబు పూర్తి చేయలేదు. జగన్ మూడు రాజధానులని చెప్పి ఒక్కటీ చేయలేదు. రాజధాని ఏదంటే ఇప్పుడు ఏమీ అర్థం కాని పరిస్థితి. ప్రత్యేక హోదా ఇచ్చి ఉంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. హోదా కోసం జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు నిరాహారదీక్ష కూడా చేశారు. సీఎం అయిన తర్వాత ఒక్కసారైనా ఆయన నిజమైన ఉద్యమం చేశారా? ఎంపీలందరి చేత రాజీనామా చేయిస్తే ప్రత్యేక హోదా ఎందుకు రాదంటూ అప్పట్లో టీడీపీకి సవాల్ విసిరిన జగన్‌రెడ్డి.. ఆ తర్వాత ఏం చేశారు? స్వలాభం కోసం ఇద్దరూ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారు. ప్రత్యేక హోదా కాదు కదా.. ప్యాకేజీ కూడా లేదు. ప్రత్యేక హోదా ఇవ్వని బీజేపీకి ఆ రెండు పార్టీలు తొత్తులుగా మారాయి. బయటకు విభేదిస్తున్నట్లు కనిపిస్తూనే మద్దతిస్తున్నాయి. ఐదేళ్లలో ఒక్క అంశంలోనైనా బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడారా? ఆ పార్టీతో వాటికి కంటికి కనిపించని పొత్తులున్నాయి. రెండు పార్టీల ఎంపీలు కలిపి మొత్తం బీజేపీ ఎంపీలే. ఈ పార్టీలకు వేసే ప్రతి ఓటు బీజేపీకే పోతుంది. ఆంధ్ర ప్రజలు అప్రమత్తం కావాలి. కాంగ్రెస్ తరపు నుంచి నేను చెబుతున్నాను. ఏపీ ప్రజల పట్ల, ఏపీ అభివృద్ధి పట్ల రాహుల్ పట్టుదలతో ఉన్నారు. అందుకే ప్రధాని కాగానే తొలి సంతకం ప్రత్యేక హోదా కల్పిస్తూ చేస్తానని మాటిచ్చారు. బీజేపీ ట్రాప్‌లో పడిన వైసీపీ, టీడీపీ ట్రాప్‌లో ప్రజలు అసలే పడొద్దు. వీళ్ల స్వలాభం కోసం ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టారు. ఐదేళ్లలో ఒక్క విషయంలో కూడా వైసీపీ, టీడీపీ ఎంపీలు బీజేపీని వ్యతిరేకించింది లేదు. మణిపూర్ ఘటనలో కూడా బీజేపీని వ్యతిరేకించలేదు. ఆ పార్టీ కోసమే పని చేస్తున్నాయి. దొందూ దొందే.



విజయవాడ కాంగ్రెస్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ జెండాతో షర్మిల



ఏపీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపడుతున్న షర్మిల

జగన్‌రెడ్డీ.. క్రైస్తవుల కడుపు మండిపోదా?

మణిపూర్‌లో 2 వేల చర్చిలను ధ్వంసం చేసినా.. 60 వేల మంది క్రైస్తవులను నిర్వాసితులను చేసినా.. కనీసం అప్పుడు కూడా జగన్‌రెడ్డి క్రైస్తవుడిగా అయి ఉండి ఒక్కసారైనా ఆ ఘటనపై మాట్లాడలేదు. మరి క్రైస్తవుల కడుపు మండిపోదా.. క్రైస్తవులకు మనసు లేదా? వారు మనుషులు కాదా..? మనుషులు చచ్చిపోతున్నా.. మీరు బీజేపీకి మద్దతు ఇస్తా ఉన్నారంటే మీరు మనుషులేనా..? నేను ఎవరో వదిలిన బాణాన్నీ కాదు. సొంత ఆలోచనతో, వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని కాంగ్రెస్‌లో చేరా.

ప్రమాణ స్వీకారానికి బయల్దేరిన షర్మిల కాన్వాయ్ విజయవాడలో అడుగుపెట్టగానే అడ్డంకులు ఎదురయ్యాయి. వాహన శ్రేణిని ఎనికేపాడు వద్ద జాతీయ రహదారిపై పోలీసులు అడ్డుకున్నారు. ఆమె కారు ముందు, వెనుక ఉన్న ఎస్కార్ట్ వాహనాలను విజయవాడ వైపు వదిలి... ఆ తర్వాత వచ్చే వాహనాలను తాడిగడప 100 అడుగుల రోడ్డులోకి వెళ్లాలని సూచించారు. దీంతో నాయకులు, కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. వాహనాలను అడ్డుకున్నారని తెలిసిన షర్మిల తన కారును అక్కడే ఆపేశారు. పోలీసుల తీరుకు నిరసనగా పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, కార్యకర్తలు జాతీయ

భయపడుతున్నారా సార్..!

రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయినా పోలీసులు వాహనాలను వదల్లేదు. దీంతో షర్మిల ఈ వాహనాలను వదిలే వరకు కదిలే ప్రసక్తే లేదని భీష్మించారు. తానూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేస్తానన్నారు. 'వైఎస్సార్ బిడ్డ ఎవరికీ భయపడదు. ప్రభుత్వం కావాలనే నా కాన్వాయ్‌ను అడ్డుకుంది. అడ్డుకోవాల్సిన అవసరం ఎందుకొచ్చింది? అంటే కాంగ్రెస్‌కు భయపడుతున్నట్లే కదా! భయపడుతున్నారా సార్' అని సూటిగా జగన్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని.. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరించిందని ధ్వజమెత్తారు. షర్మిల ఆందోళనకు దిగడంతో పోలీసులు చేసేది లేక మిగిలిన వాహనాలను అనుమతించారు. విలేకరుల సమావేశంలో కూడా జగన్‌పై షర్మిల స్పందించారు. జగన్‌రెడ్డీ అని సంబోధించడాన్ని వైసీపీ వాళ్లు వ్యతిరేకిస్తున్నారని విలేకరులు ప్రస్తావించగా.. 'జగన్‌రెడ్డి గారు.. జగన్‌రెడ్డి గారు అంటే కూడా అభ్యంతరం ఉందా' అని ఎదురు ప్రశ్నించారు.

షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లోకి ఆళ్ల

విజయవాడ-ఆంధ్రజ్యోతి-మంగళగిరి సిటీ, జనవరి 21: తన అడుగులు షర్మిలతోనేనని ప్రకటించిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి.. ఆదివారం షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయనకు ఆమె కాంగ్రెస్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రామకృష్ణారెడ్డి ముందుగా గన్నవరంలోని విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ మీడియాతో మాట్లాడారు. షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని, ప్రజలు ఆమె నాయకత్వాన్ని కోరుకుంటున్నారని చెప్పారు.

తెలంగాణలో ఓ నియంతను దించా

రాజశేఖర్‌రెడ్డి బిడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఒక నియంతను గద్దె దించింది. రాజశేఖర్‌రెడ్డి బిడ్డ ప్రతి నియోజకవర్గంలో తిరిగి, ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ తెలంగాణలో పాదయాత్ర చేసింది కాబట్టే అక్కడ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగింది. కాబట్టి ప్రజలు కాంగ్రెస్ వైపు చూశారు. నాకు బలం లేకపోయినా మరొకరికైనా ఉంది. నేను చేసిన త్యాగం వల్ల ఒక నియంత అధికారంలో లేకుండా పోయారు. నిజానికి ప్రాంతీయ పార్టీల నాయకులు అధికారంలోకి వస్తే నియంతలే అవుతారని చరిత్ర పదే పదే చెబుతోంది. అందుకనే నా పార్టీ గురించి ఆలోచించకుండా.. నా పార్టీకి చెడు జరుగుతుందని తెలిసీ.. సూసైడ్ అని తెలిసీ.. అంత కష్టపడీ.. పోటీ చేయకుండా త్యాగం చేశాను. నా పార్టీ గురించి ఆలోచించి ఉంటే మరో పార్టీలో విలీనం చేసేదాన్ని కాదు. నాకు కావలసింది ప్రజల శ్రేయస్సు. తెలుగు ప్రజల సంతోషం.. తెలంగాణ, ఏపీ ప్రజలు బాగుండాలని కాంగ్రెస్‌లో చేరా. రాహుల్ అప్పగించిన బాధ్యతలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని 14 ఏళ్ల కిందటే వైఎస్ కోరుకున్నారు. ఆయన కల నెరవేర్చేందుకు కృషిచేస్తా.

పీవీ హయాంలోనే అయోధ్య రామాలయానికి బీజం

» లిటిల్ మ్యూజిషియన్స్ రజతోత్సవంలో మైహోం అధినేత రామేశ్వరరావు

» రామరాజ్యంగా దేశం పరిఢవిల్లాలి: వెంకయ్య నాయుడు

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠతో దేశ వాసుల 500 ఏళ్ల నిరీక్షణ ఫలించబోతున్నదని మైహోం సంస్థల అధినేత జూపల్లి రామేశ్వరరావు అన్నారు. ఈ చారిత్రక ఘట్టానికి పీవీ నరసింహారావు ప్రధానిగా ఉన్న సమయంలోనే బీజం పడిందని, బాబ్రీ మసీదును తొలగించడానికి పీవీ చాకచక్యం, నేర్పరితనం ఎంతగానో తోడ్పడ్డాయని వ్యాఖ్యానించారు. ఆదివారం మాదాపూర్ శిల్పకళావేదికలో లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ బాల గాంధర్వం రజతోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ముందుగా చినజీయర్ స్వామి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ చరిత్రలోనే నూతన అధ్యాయానికి నాందిగా అభివర్ణించారు. సంగీత విద్యకు సంస్కారాన్ని జోడించి పాతికేళ్లుగా సంస్థ వ్యవస్థాపకుడు రామాచారి అందిస్తున్న సేవలు అద్వితీయమంటూ ప్రశంసించారు. లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీకి శాశ్వత భవన నిర్మాణానికి సాయం అందించాల్సిందిగా చినజీయర్ రామేశ్వరరావును కోరారు. దీనిపై రామేశ్వరరావు స్పందిస్తూ.. ముచ్చింతల్‌లో స్థలం కేటాయిస్తామని ప్రకటించారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ సేవలను అభినందించారు. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఆకలిదప్పులకు తావులేని, అవినీతికి ఆస్కారంలేని రామరాజ్యంగా దేశం పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. సమాజాన్ని సంఘటితం చేసే శక్తి సంగీతానికి ఉందన్నారు. పాతికేళ్లుగా నిస్వార్థంతో సాగుతోన్న లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీకి ప్రభుత్వం నుంచి తమ వంతు సహకారం అందిసామని చెప్పారు. శాంతా బయోటెక్నిక్స్ అధినేత వరప్రసాద్ రెడ్డి, హరీశ్‌రావు, ఎంపీ రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభి వాణీదేవి, సినీ దర్శకుడు రాఘవేంద్రరావు తదితరులు రామాచారి సేవలను ప్రశంసించారు.

గత పాలన ఓ పీడకల

» ఇప్పటి నుంచి సుపరిపాలన: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మఠంపల్లి, జనవరి 21: తొమ్మిదిన్నరేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని, ఆ పాలనను ప్రజలు ఓ పీడకలలా మరిచిపోవాలని నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో నూతన పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలన అందిస్తుందని భరోసా ఇచ్చారు. పేదల ఇందిరమ్మ రాజ్యం కల సాకారమై, సుభిక్షమైన పాలన చేతికి వచ్చిందని, ప్రజలు ప్రశాంత జీవనం గడపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. స్థానిక సంస్థలకు నిధులు, బిల్లులు ఇవ్వకుండా కేసీఆర్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కమీషన్ల కోసం ట్రాక్టర్ల కొనుగోలు, ఉపాధి నిధుల దుర్వినియోగం, నిరంకుశ పాలనతో ప్రజా జీవితాన్ని అస్తవ్యస్తం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు భూకబ్జాలతో రాష్ట్రాన్ని దివాళా తీయించారని, రూ.లక్ష కోట్లను అక్రమంగా సంపాదించారని, దాన్నంతా కక్కిస్తామని స్పష్టం చేశారు. ఎంపీగా తాను హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 25 గ్రామ పంచాయతీల భవనాలకు రూ.25 లక్షల చొప్పున మంజూరు చేయించానని తెలిపారు..

యాదగిరీశుడికి వైభవంగా ఏకాదశి లక్షపుష్పార్చన

» ఆలయ పునర్నిర్మాణం అద్భుతం: కేంద్రమంత్రి ఆర్కేసింగ్

యాదగిరిగుట్ట, జనవరి 21: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం లక్షపుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వయంభూ నారసింహుడికి నిత్య పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. వేకువజామున సుప్రభాతంతో నిత్యారాధనలు ఆరంభించిన ఆచార్యులు రాత్రి వేళ మహానివేదన, శయనోత్సవ పర్వాలతో ఆలయ ద్వారబంధనం చేశారు. గర్భాలయంలోని స్వయంభువులకు అభిషేకం, అర్చనలు జరిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించిన పూజారులు ఏకాదశి పర్వదినం సందర్భంగా లక్షపుష్పార్చన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, నిత్య రుద్రహవనం, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రతపూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. కాగా కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధనశాఖ మంత్రి ఆర్కే సింగ్ లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రాన్ని సందర్శించగా, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధానాలయంలోని స్వయంభువులను దర్శించుకుని, ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిక్షేత్ర ఆలయ పునర్నిర్మాణం అద్భుతంగా ఉందని చెప్పారు. యాదగిరిక్షేత్రాన్ని త్రిపుర హైకోర్టు జడ్జి జస్టిస్ టి.అమర్‌నాథ్‌గౌడ్ కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాగా, వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో యాదగిరిగుట్ట క్షేత్రానికి తరలివచ్చారు. కొండకింద లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కొండపైకి చేరుకుని దర్శనం కోసం క్యూలైన్లలో దర్శనాలకు బారులు తీరారు.

ధర్మారం క్యాంపుపై మేమే దాడి చేశాం

» భారీ సంఖ్యలో పోలీసులు మృతిచెందారు

» మా వాళ్లు ముగ్గురు చనిపోయారు.. నక్సల్స్ లేఖ

చర్ల, జనవరి 21: బీజాపూర్ జిల్లా పామేడులోని ధర్మారం సీఆర్పీఎఫ్ క్యాంపుపై తామే దాడి చేశామని మావోయిస్టులు ప్రకటించారు. ఈ మేరకు దక్షిణ సబ్-జోనల్ బ్యూరో ప్రతినిధి సమత పేరుతో ఆదివారం ఓ లేఖ విడుదలైంది. ఈ ఘటనపై ఇంతవరకు పోలీసులు మాట్లాడేందుకు నిరాకరించినా.. మావోయిస్టులు ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. "ఈ నెల 16న ధర్మారం క్యాంపుపై భారీ దాడి చేశాం. పీఎల్‌జీఏ బలగాలు వీరోచితంగా పోరాటం చేశాయి. అనేక గంటలపాటు సాగిన ఈ పోరులో చాలా మంది పోలీసులు మృతి చెంది ఉంటారు. పలువురు క్షతగాత్రులై ఉంటారు. చనిపోయిన పోలీసుల కుటుంబాలకు సానుభూతి తెలుపుతున్నాం" అని సమత ఆ లేఖలో పేర్కొన్నారు. సుదీర్ఘంగా సాగిన ఈ పోరాటంలో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారని వివరించారు. మృతిచెందిన మావోయిస్టుల్లో పీఎల్‌జీఏ కమాండర్ కరటం దేవాల్, మూసాక విక్రమ్, మడకం దేవాల్ ఉన్నారని వెల్లడించారు. "కరటం దేవాల్ 2006 నుంచి పార్టీ(మావోయిస్టు)లో పనిచేస్తున్నారు. విక్రమం 2020లో పార్టీలో చేరారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి, హోంమంత్రి విజయశర్మలదే" అని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి ప్రకటన చేయలేదని ఆమె పేర్కొన్నారు.

విభజన హామీలపై పోరాడాలి

» లేదంటే తెలంగాణకు అన్యాయమే: కోదండరాం

ఖైరతాబాద్/పంజాగుట్ట, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): విభజన హామీల అమలు కోసం కేంద్రప్రభుత్వంపై పౌర సంఘాలు, ప్రజా సంఘాలు పోరాడాల్సిన అవసరం ఉన్నదని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. లేదంటే భవిష్యత్తులో రాష్ట్రానికి మరింత అన్యాయం జరిగే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. 'తెలంగాణ విభజన హామీల అమలు.. కేంద్ర ప్రభుత్వ వివక్ష' అనే అంశంపై టీజేఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కోదండరాం మాట్లాడుతూ.. విభజన హామీలు నెరవేరనందున రాష్ట్ర పునర్నిర్మాణం, ప్రజాస్వామిక నిర్మాణం జరగలేదన్నారు. తెలంగాణ ఏర్పడ్డనాడు కలిగిన ఆనందం పది సంవత్సరాల ప్రభుత్వ పాలనలో కనిపించలేదని, ఈ విషయమై ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఉన్నదని హరగోపాల్ అన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత భూ ఆక్రమణలు పెరిగాయని, కబ్జాదారుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కాగా, తెలంగాణలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 317 వలన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని కోదండరాం అన్నారు. జీవో 317 బాధిత ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కొత్త జిల్లాలో అదనపు మండలాలు చేర్చడం వల్ల స్థానికత సమస్య ఏర్పడిందని, ఈ జీవో వలన ఎక్కువ శాతం నష్టపోయింది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు.

ఇంటి దగ్గరే క్యాన్సర్ పరీక్షలు

బసవతారకం ఆస్పత్రి ఆధ్వర్యంలో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్

హైదరాబాద్ సిటీ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్.. అత్యాధునిక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ బస్‌ను ఆదివారం ఆస్పత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ, ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్ ప్రారంభించారు. దీనికి సుమారు రూ.16 కోట్లు ఖర్చు కాగా, ఎస్‌బీఐ తమ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా రూ.1.5కోట్ల ఆర్థిక సహాయం అందించిందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఈ బస్‌లో అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే, మామోగ్రఫీ, అల్ట్రాసౌండ్ యంత్రాలతో పాటు క్యాన్సర్ నిర్ధారణకు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, పరీక్షా ఫలితాలను వెనువెంటనే అందించేలా అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించాయి. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఇటువంటి ప్రత్యేకమైన బస్‌ను కలిగిన సంస్థ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి మాత్రమేనని అన్నారు. దీనికి రోటరీ క్లబ్, పలువురు దాతలు సహాయం చేశారన్నారు. పలువురు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నా పరీక్షలు చేయించుకోవడానికి ముందుకురారని, అలాంటి వారికి ఇంటి వద్దనే స్క్రీనింగ్ చేసే అవకాశం ఉంటుందని అన్నారు. యాడ్ లైఫ్, అకడమిక్స్ అసోసియేట్ డైరెక్టర్ కల్పనా రఘునాథ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 1,177 ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాల్లో 2,24,532 మందికి పరీక్షలు నిర్వహించామని తెలిపారు. వారిలో 1,38,865 మంది మహిళలు, 85,667 మంది పురుషులు ఉన్నారన్నారు. ఆస్పత్రి సీఈవో డాక్టర్ కృష్ణయ్య మాట్లాడుతూ ఆస్పత్రిలో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు.





అత్యాధునిక మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ బస్, ప్రారంభిస్తున్న ఎస్‌బీఐ సీజీఎం రాజేష్‌కుమార్, నందమూరి బాలకృష్ణ

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.